తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
గురువారం 05.02.2026 | సంపుటి : 12 సంచిక : 197 | పేజీలు : 12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# ఎదురులేని కాంగ్రెస్

## మున్సిపాలిటీల్లో సత్తాచాటుతాం

### ఎన్నికల తరవాత రైతుభరోసా అందిస్తాం

### ఏప్రిల్ తర్వాత పేదలకు లక్షలాది ఇళ్లు

"7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు, మన విజయాన్ని అడ్డుకోలేరు. అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలి. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్లపాటు ఎదురు చూడాల్సిన పరిస్థితి. రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల సన్నబియ్యం ఇస్తున్నాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతు భరోసా కింద రూ.6 వేల చొప్పున రూ.9 వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతుభరోసా నిధులు జమచేస్తాం" - సీఎం రేవంత్ రెడ్డి



- సన్నబియ్యం తీసుకున్న వారంతా ఓటేయాలి
- రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్
- తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్
- తెలంగాణ తల్లి మన సోనియమ్మ మిర్యాలగూడ ప్రజాపాలన-ప్రజా విజయోత్సవ సభలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- హాజరైన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి

**నల్గొండ(జనంసాక్షి):**రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్ని కల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు.. విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన – ప్రజా విజయోత్సవ' సభలో సీఎం ప్రసంగించారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్ల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందుంది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బీఫాం మీద పోటీ చేస్తున్న ఆడబిడ్డలకు కూడా ఆర్టీసీలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాం. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసా కింద రూ.6వేల చొప్పున రూ.9వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతు

మిగతా 2లో..

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అనర్హత

# పిటిషన్‌ను కొట్టేసిన స్పీకర్



### పార్టీ మారినట్టు ఆధారాలు లేవని వెల్లడి

#### స్పీకర్ తీర్పును స్వాగతించిన సంజయ్

#### తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నానని వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చారు. సంజయ్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవని, ఆయన్ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే పరిగణిస్తున్నామని స్పీకర్ తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించిన గెజిట్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. సంజయ్‌పై అనర్హత కోరుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇక, పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. సంజయ్ సహా ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్.. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్ల విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేశారు. తాజాగా జగిత్యాల ఎమ్మెల్యేకు కూడా క్లిన్ చిట్ ఇచ్చేశారు స్పీకర్. స్పీకర్ ఇచ్చిన తీర్పుపై జగిత్యాల ఎమ్మెల్యే స్పందిస్తూ... ' నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే. బీఆర్ఎస్ పార్టీలోనే గెలిచా. బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చా. అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ బిల్లులు ప్రవేశపెట్టి, విప్ జారీ చేస్తే నేను మద్దతు ఇస్తా. నేనెప్పుడూ బీఆర్ఎస్ పార్టీని, అధిష్టానాన్ని విమర్శించలేదు. స్థానిక బీఆర్ఎస్ నాయకత్వం నాకు దూరంగా ఉంది. నాది ఎలక్షన్ కోసం కాదు.. అభివృద్ధి కోసం ఆరాటం. జగిత్యాల అభివృద్ధి కోసం సీఎం, ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నా' అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. నా జీతం నుంచి నెలకు రూ. 5 వేలు బీఆర్ ఎస్ పార్టీకి కట్ అవుతున్నాయి. నేను

మిగతా 2లో..

# సుప్రీంలో సవాల్ చేస్తాం



- స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు
- కళ్లముందు కనిపిస్తున్నా సాక్ష్యాలు లేవంటే ఎలా?
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్‌చిట్‌పై కేటీఆర్ ఆగ్రహం
- సిట్ విచారణ పేరుతో డైవర్షన్ గేమ్ ఆడుతున్నారని విమర్శ

**హైదరాబాద్(జనంసాక్షి):**ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్న తీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కి కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు,

మిగతా 2లో..



# చిత్ర పరిశ్రమకు పెద్దపీట

- సినీ పరిశ్రమ కేంద్రంగా హైదరాబాద్
- అన్ని భాషల వారు తరలివచ్చినా ప్రోత్సాహం
- ఉగాది రోజున గద్దర్ అవార్డుల ప్రదానం
- మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్(జనంసాక్షి):**సినీ పరిశ్రమకు తెలం గాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని వెల్లడించారు. కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీద సినిమా అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఉగాది రోజు మార్చి 19న ఘనంగా అవార్డుల పంపిణీ జరగనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ పక్రియ ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు, కానీ దేశంలో

మిగతా 2లో..

## ప్రధానికి సభకొచ్చే

# ధైర్యం లేదా?

### నవరణే పుస్తకంపై సమాధానం చెప్పాలి • రాహుల్, ప్రియాంక డిమాండ్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇంకా ప్రచురణ కాని నరవణె రాసిన పుస్తకాన్ని విపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రాంగణంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేడు ప్రధాని మోదీ లోక్‌సభకు వస్తారని తాను అనుకోవడం లేదన్నారు. ఒకవేళ మోదీ వస్తే.. తానే స్వయంగా ఆయన వద్దకువెళ్లి ఈ పుస్తకాన్ని అందజేస్తానన్నారు. పార్లమెంటు ప్రాంగణంలో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టుల మధ్య చిన్న వాగ్వాదం జరిగింది. పార్లమెంటు ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసన తెలుపుతున్నారు. అదే సమయంలో కేంద్ర మంత్రి అటుగా రాగా.. 'ఇదిగో ఇక్కడ ఓ ద్రోహి నడుచుకుంటూ వెళ్తున్నాడు' అంటూ రాహుల్ విమర్శలు చేశారు. ఈ క్రమంలో బిట్టుకు కరచాలనం చేయడానికి ముందుకొస్తూ.. "ద్రోహి స్నేహితుడా" అంటూ చురకలంటించారు. నువ్వు తిరిగి (కాంగ్రెస్‌లోకి) వస్తావంటూ ఎద్దేవా చేశారు. దీనికి కేంద్ర మంత్రి గట్టి కౌంటర్ ఇచ్చారు. రాహుల్‌తో కరచాలనం చేసేందుకు నిరాకరిస్తూనే.. 'మీరు దేశానికి ద్రోహం చేశారు' అని వ్యాఖ్యానించారు. గతంలో కాంగ్రెస్ నుంచి మూడుసార్లు ఎంపీగా

మిగతా 2లో..

## ఇలా మొదలు.. అలా వాయిదా..

### ఐదు నిమిషాలకే లోక్‌సభ వాయిదా

2లో..



## పాతబస్తీ వారసత్వ కట్టడాలను

# పరిరక్షిస్తున్నారా?

- పురాతన కట్టడాల పరిరక్షణ కమిటీ అనుమతి ఉందా?
- మెట్రో సంస్థను ప్రశ్నించిన హైకోర్టు ధర్మాసనం

**హైదరాబాద్(జనంసాక్షి):**పాతబస్తీలో మెట్రో నిర్మాణానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో జరిగిన ఒప్పందాలపై మూడు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని మెట్రో నిర్మాణ సంస్థను హైకోర్టు ఆదేశించింది. వారసత్వ కట్టడాల సంరక్షణ కమిటీ ఏర్పాటుకు సంబంధించిన విషయాన్ని అందులో పొందుపర్చాలని ఆదేశించింది. పాతబస్తీలో మెట్రో నిర్మాణం వల్ల చారిత్రక కట్టడాలు దెబ్బతింటున్నాయని యాక్ట్ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సీజే ధర్మాసనం మరో సారి విచారణ చేపట్టింది. మెట్రో నిర్మాణ సంస్థ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్.. నిర్మాణానికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మెట్రో నిర్మాణం వల్ల 3 పురాతన కట్టడాలు మాత్రమే కూల్చేయాల్సి ఉంటుందని ఏఏజీ కోర్టుకు తెలిపారు. దీనికి సంబంధించి సంబంధిత శాఖకు దరఖాస్తు చేశామన్నారు. ప్రస్తుతం ఆస్తుల స్వాధీన ప్రక్రియ కొనసాగుతోందని, నిబంధనల మేరకు వారందరినీ ఖాళీ చేయిస్తామన్నారు. ఇప్పటి వరకు వారసత్వ కట్టడాల సంరక్షణ కమిటీనే ఏర్పాటు చేయలేదని

మిగతా 2లో..

# దేశ ప్రయోజనాల కోసమే వాణిజ్య ఒప్పందం

### వ్యవసాయం, పాడి రంగాల్లో భారత్ తన ప్రయోజనాలను వీడలేదు

#### యూఎస్‌తో ఒప్పందంతో తయారీదారులు, ఎగుమతిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బలపడతారు: పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నప్పటికీ వ్యవ సాయం, పాడి రంగాల్లో భారత్ తన ప్రయోజనాలను వీడలేదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దేశంలోని ముఖ్యమైన రంగాల్లో దేనినీ విస్మరించలేదన్నారు. ఇరుదేశాల ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకొని దౌత్య సంబంధాలపై ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఇందులోభాగంగా 140 కోట్ల మంది దేశ ప్రజల ఇంధన భద్రతకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఏడాది పాటు అమెరికాతో పలుమార్లు చర్చలు జరిపిన అనంతరం దీనిపై ట్రంప్ ప్రకటన వెలువరించారని తెలిపారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో మాట్లాడుతూ పీయూష్ గోయల్ ఈ వ్యాఖ్యలు చేశారు. అగ్రరాజ్యంతో ఒప్పందం వల్ల భారత్‌లోని తయారీదారులు, ఎగుమతిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

మిగతా 9లో..

## మణిపూర్ ముఖ్యమంత్రిగా

# ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం



**ఇంఫాల్(జనంసాక్షి):**మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు తెరపడింది. నూతన సీఎంగా భాజపా నేత వై.ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ అజయ్‌కుమార్ భల్లా ఆయనతో ప్రమాణం చేయించారు. భాజపా ఎమ్మెల్యే నెమ్చా కిప్‌జెన్, నాగా పీపుల్స్ ఫ్రంట్ శాసనసభ్యుడు ఎల్.డిఖో ఉపముఖ్యమంత్రులుగా ప్రమాణ

మిగతా 9లో..

# ప్రాణాలు తీసిన కొరియన్ గేమ్

### ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై మరణశాసనం రాసుకున్న ముగ్గురు అక్కాచెల్లెళ్లు

### యూపీలో భవనంపై నుంచి దూకి ఆత్మహత్య

**లక్నో(జనంసాక్షి):** ఉత్తర ప్రదేశ్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఆన్‌లైన్ కొరియన్ గేమ్ ముగ్గురు అక్కాచెల్లెళ్ల ప్రాణం తీసింది. ఆన్‌లైన్ గేమ్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించటంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లు 9వ అంతస్తు నుంచి కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 2.30 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు

మిగతా 2లో..

# విద్యుత్ కనెక్షన్లకు కొత్త మార్గదర్శకాలు



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో విద్యుత్ కొత్త కనెక్షన్ల జారీలో గురువారం నుంచి భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఇందుకోసం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. గతంలో స్తంభాలు, లైన్స్ కోసం వినియోగదారుల నుంచి దూరాన్ని బట్టి ఒక్కో రీతిలో ఫీజు వసూలు చేసేవారు. ఇకపై ఫిక్స్‌డ్ ఛార్జీలు వసూలు చేయనున్నారు. గృహ విద్యుత్ కనెక్షన్‌లకు 1 కిలో వాట్ వరకు రూ.500. ఒకటి నుంచి 5కేవీ వరకు రూ.500 కిలో వాట్‌కి రూ.600 చొప్పున వసూలు చేయనున్నారు.



# మిర్చి రైతులకు గుడ్ న్యూస్

- ఎనుమాముల మార్కెట్‌లో భారీగా పెరిగిన ధరలు
- దేశీ మిర్చి క్వింటా రూ. 41,200లకు అమ్మకం

**వరంగల్(జనంసాక్షి):** తెలంగాణలో మిర్చి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి, రైతులకు ఆశాజనకంగా మారాయి. వరంగల్ జిల్లా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో దేశీ మిర్చి క్వింటా 41,200 రూపాయలకు, ఎల్లో మిర్చి క్వింటా 44,000 రూపాయలకు అమ్ముడయ్యింది. వండర్ హాట్ మిర్చి ధర ఒక్కరోజులో 5,000 రూపాయలు పెరిగి క్వింటా 37,100కి చేరింది. అంతర్జాతీయ డిమాండ్ పెరుగుదల, ఇతర రాష్టాల్లో ఉత్పత్తి తగ్గడం ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా తక్కువ ధరల కారణంగా బాధపడ్డ రైతులకు ఈ పరిస్థితి పెద్ద ఊరటనిస్తుంది. వివిధ రకాల మిర్చి ధరలు ఊహించనంత వేగంగా పెరుగుతుండడం రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచింది. ఎల్లో, దేశీ, వండర్ హాట్ మిర్చి వంటి రకాల డిమాండ్ అంతర్జాతీయంగా కూడా ఎక్కువగా ఉండటంతో మార్కెట్ ఉత్సాహంగా ఉంది. రైతులు

మిగతా 2లో..

# ఎదురులేని కాంగ్రెస్



భరోసా నిధులు జమ చేస్తాం. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఏప్రిల్‌లో కొత్త బ్జడెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తాం. పేదల ఆత్మగౌరవం పెంచే బాధ్యత తీసుకుం టాం. నల్గొండ జిల్లాపై కోపంతో ఎస్‌ఎల్‌బీసీని పక్కనపెట్టారు. ఎస్‌ఎల్‌బీసీ ఆగిపోతే మామ, అల్లుళు దావతు చేసుకున్నారు. నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళు తాగడానికి కారణం బీఆర్‌ఎస్. రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ఎస్‌ఎల్‌బీసీ పనులు చేపట్టాం. కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. తెలంగాణ జాతికి ఇచ్చినట్టు చెబుతున్నారని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను మార్చి, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం విమర్శించారు. సన్నబియ్యం పొందుతున్న లబ్దిదారులంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు పథకం నిజంగా వరంగా మారిందని, ఆర్టీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న మహిళలు కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బిఆర్‌ఎస్ అడ్రస్ గల్లంతు అవుతుంది అంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఇతర నాయకులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్‌కు పేదవాళ్లకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదని సీఎం విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం డిమాండ్ ఉందని, రాబోయే బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించి పేదల ఆత్మగౌరవాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నల్లగొండ జిల్లా ప్రజలపై కోపంతో ÷ూఃఅ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ÷ూఃఅ ప్రమాదంలో 8 మంది మృతి చెందితే మామ?అల్లుళ్లు సంబరాలు చేసుకున్నారని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేశారు. గంజి గతి లేని నాయకులు బెంజ్ కార్లు కొనుగోలు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో మిగితా నేతలు డబ్బులు ఇస్తే తీసుకోండి, కానీ ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని సీఎం ఆరోపిస్తూ.. జాతిపిత ఎవరన్న ప్రశ్నకు సమాధానంగా, తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్‌నే జాతిపిత అని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీనే తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రెండేళ్లలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సీఎం పిలుపునిచ్చారు. మరో ఎనిమిదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తూ, 'కాంగ్రెస్ గెలిస్తే పేదవారు గెలుస్తారు' అని సీఎం అన్నారు.

**కాంగ్రెస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండండి**

తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన జయశంకర్ జాతిపిత అవుతారని, రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ తెలంగాణ తల్లి అవుతారని సీఎం అన్నారు. దోపిడీలు, దుర్మార్గాలు చేసిన వారు తెలంగాణ జాతిపిత ఎలా అవుతారు? అని ప్రశ్నించారు. చేసిన తప్పులకు తలవంచుకుని ముక్కు నేలకు రాయాల్సింది పోయి తెలంగాణ సమాజాన్ని క్షమాపణ కోరకుండా సిగ్గులేని వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018లో జానారెడ్డి కుమారుడికి కాకుండా భాస్కర్‌రావుకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే మిర్యాలగూడ ప్రజల ఆత్మగౌరవాన్ని ఎర్రవల్లి ఫాంహౌస్‌లో తాకట్టు పెట్టారని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్లు వాపసు తీసుకోవాలని భాస్కర్‌రావు బెదిరిస్తున్నారన్న సీఎం కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన పనిలేదని చెప్పారు. భాస్కర్‌రావును నమ్మి ఎమ్మెల్యేను చేస్తే నాగార్జునసాగర్ ఉపఎన్నికలో జానారెడ్డి ఓటమికి పనిచేశారని రేవంత్ విమర్శించారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలు కాంగ్రెస్ గెలిచి తీరాలని నాయకులకు సూచించారు. రూ.వేల కోట్లు తీసుకువచ్చి మున్సిపాలిటీలు అభివృద్ధి చేస్తామని, ఎన్నికల తర్వాత సాగర్, నందికొండలోని ఇళ్ల పట్టాల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**అన్నీ మీ కుటుంబమే తీసుకుంది**

మీకు నోటీసులు ఇస్తే అందరికీ ఇచ్చినట్లయితే ఎర్రవల్లి, జన్వాడ ఫాంహౌస్‌లు మా ప్రజలకు ఇస్తారా? అని రేవంత్ ప్రశ్నించారు. మొయినాబాద్‌లోని హరీశ్‌రావు ఫాంహౌస్‌లో అందరినీ రానిస్తారా?, రూ.వేల కోట్లు కొల్లగొట్టిన దాంట్లో నిరుద్యోగులకు ఏమైనా ఇస్తారా? అని పెదవి విరిచారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభలు, మంత్రి పదవులు అన్నీ మీ కుటుంబమే తీసుకుందని బీఆర్?ఎస్?ను నిలదీశారు. తెలంగాణ సమాజానికి ఏమైనా ఇచ్చారా?, చివరికి తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసుకున్న శ్రీకాంతాచారి తల్లికి కూడా ఏమీ ఇవ్వలేదని మండిపడ్డారు.

## ప్రాణాలు తీసిన కొరియన్ గేమ్

తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఘజియాబాద్‌కు చెందిన 16 ఏళ్ల నిషిక, 14 ఏళ్ల ప్రాచి, 12 ఏళ్ల పఖి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. అన్ని పనులు కలిసే చేసేవారు. కోవిడ్ సమయంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు టాస్క్ బేస్డ్ కొరియన్ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. గంటలు, గంటలు గేమ్ ఆడుతూ గడిపేవారు. అంతేకాదు.. తమ పేర్లు మార్చుకుని కొరియన్ పేర్లు పెట్టుకున్నారు. గేమ్ అడిక్షన్ కారణంగా స్కూలుకు కూడా సరిగా వెళ్లేవారు కాదు. పిల్లలు పూర్తిగా గేమ్‌కు బానిసలుగా మారటంతో తల్లిదండ్రులకు కోపం వచ్చింది. వారిని ఇకపై గేమ్ ఆడవద్దని మందలించారు. దీంతో ముగ్గురూ మనస్తాపానికి గురయ్యారు. గేమ్ ఆడకుండా బతకలేమని భావించారు. ఈ నేపథ్యంలోనే ముగ్గురూ కలిసి చనిపోవాలని నిశ్చయించుకున్నారు. మంగళవారం 8 పేజీల సూసైడ్ నోట్ రాశారు. రాత్రి 2.30 గంటల ప్రాంతంలో 9వ అంతస్తులో ఉన్న తమ ఎ÷-లాట్ కిటికీ నుంచి ఒకరి తర్వాత ఒకరు కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. బిల్డింగ్ దగ్గర పెద్ద శబ్దం రావటంతో స్థానికులు అక్కడికి వచ్చారు. నేలపై రక్తపు మడుగులో పడి ఉన్న వారిని చూసి షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మాస్ సూసైడ్స్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కాచె÷-లలెల్ల గదిలోకి వెళ్లి పరిశీలించగా అక్కడ సూసైడ్ నోట్ దొరికింది. ఆ సూసైడ్ నోట్‌లో వారు తమ బాధనంతా వివరంగా రాసుకొచ్చారు. తల్లిదండ్రులకు క్షమాపణ సైతం చెప్పారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఏం తేలిదంటే.. ప్రాచీ విపరీతంగా మొబైల్ ఫోన్ వాడేది. ఆమె కారణంగానే మిగిలిన ఇద్దరూ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. చివరకు గేమ్ అడిక్షన్ కారణంగానే ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు.

## ఎన్నికల హామీలను మరిచిన సీఎం రేవంత్

- తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయి
- మహబూబ్‌నగర్ ప్రచారంలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్



**మహబూబ్‌నగర్(జనంసాక్షి):** తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తు చేశారు. బుధవారం నాడు మహబూబ్ నగర్‌లోని ఎంవిఎస్ కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసంగించిన నితిన్ నబీన్.. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు ఉందని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని నితిన్ నబీబ్ విమర్శించారు. నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా ఈ గడ్డ నుంచి పోరాడారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైంది. ఎన్నికల హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కింది. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం మోసం చేసింది. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు.

## ఆరు లేఖలు రాసినా న్యాయం జరగలేదు

### సుప్రీంలో 'సర్' విచారణ సందర్భంగా స్వయంగా వాదనలు వినిపించిన మమతా బెనర్జీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై విచారణలో భాగంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ సుప్రీంకోర్టులో స్వయంగా వాదనలు వినిపించారు. 'సర్' ప్రక్రియకు సంబంధించి తాను ఈసీకి ఆరుసార్లు లేఖలు రాసినట్లు ఆమె అత్యున్నత న్యాయస్థానానికి వెల్లడించారు. అయినప్పటికీ తనకు న్యాయం జరగలేదని తెలిపారు. తన రాజకీయ పార్టీ కోసం పోరాటం చేయడం లేదని, ఓ పెద్ద కారణంతోనే న్యాయం కోసం ఇక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో సర్‌ను వ్యతిరేకిస్తూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) చేస్తున్న పోరాటం కొన్నిరోజుల క్రితమే దిల్లీకి చేరింది. సర్ సమస్యలపై మాట్లాడేందుకు ఇప్పటికే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)తోనూ భేటీ అయ్యారు. అయితే ఆ భేటీ నుంచి ఆమె మధ్యలోనే వాకౌట్ చేశారు. మరోవైపు, సర్ ప్రక్రియ ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని, అవకతవకలు జరుగుతున్నాయని తృణమూల్ ఎంపీలు ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో తాజాగా జరిగిన విచారణకు మమత హాజరయ్యారు. స్వయంగా వాదనలు వినిపించేందుకు 5 నిమిషాలు సమయం ఇవ్వాలంటూ ఆమె సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను అభ్యర్థించారు. 15 నిమిషాలు తీసుకోండంటూ గడువు ఇచ్చారు. "ఎన్నికల సంఘం మా అభ్యర్థనలను పట్టించుకోవడం లేదు. సమస్య ఏంటంటే.. చివరకు ఎక్కడా న్యాయం దొరకడం లేదు. ఈసీకి ఆరుసార్లు లేఖ రాసినా.. సమాధానం రాలేదు" అని ఈసీపై విమర్శలు చేశారు. ఆమె వాదనలో వాస్తవం ఉందని పేర్కొన్న కోర్టు.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని హామీ ఇచ్చింది. అలాగే మమత వేసిన పిటిషన్‌లో భాగంగా ఈసీకి కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

## పొంచి ఉన్న 'అణు'ముప్పు

- నేటితో ముగియనున్న అమెరికా-రష్యా అణ్వాయుధ నియంత్రణ ఒప్పందం
- అణ్వాయుధ నిల్వలపై తొలిగిపోనున్న పరిమితులు
- ఒప్పందం కొనసాగింపుకు ముందుకొచ్చిన రష్యా..
- సరైన సమయంలో ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని ప్రకటించిన వైట్‌హౌస్

న్యూయార్క్(జనంసాక్షి):అమెరికా-రష్యా అణ్వాయుధ నియంత్రణ ఒప్పందం ఫిబ్రవరి 5తో ముగియనుంది. దీంతో అణ్వాయుధ నిల్వలపై ఉన్న పరిమితులు తొలగిపోనున్నాయి. ఈ ఒప్పందం ముగింపు అనేది అణ్వాయుధ పోటీకి దారితీయొచ్చనే భయాలు మొదలవుతున్నాయి. అయితే, అమెరికా ఈ ఒప్పందాన్ని కొనసాగించేందుకు ముందుకొస్తే.. తాము కూడా మరో ఏడాది పాటు దీనికి కట్టుబడి ఉంటామని రష్యా అధ్యక్షుడు ఇటీవల ప్రకటించారు. కానీ, ట్రంప్ యంత్రాంగం నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు. దీనిపై సరైన సమయంలో అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ వర్గాలు ప్రకటించాయి.

**నాటి ఒప్పందం..**

అణ్వాయుధ నిల్వలకు సంబంధించి 1972లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్, సోవియట్ నేత బ్రెజ్నెవ్‌ల మధ్య తొలిసారి ఒప్పందం జరిగింది. అయితే, 2001లో అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ సమయంలో అమెరికా బయటకు వచ్చింది. మళ్లీ 2010లో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, రష్యా అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదెవ్‌ల మధ్య 'న్యూ స్టార్ట్' పేరుతో ఒప్పందం (ఔవలి ాంఖీ ుతీవజీబిఎ) కుదిరింది. దీని ప్రకారం.. ఇరుదేశాలూ 700 కన్నా ఎక్కువ క్షిపణులు, యుద్ధవిమానాలపై 1550 కన్నా ఎక్కువ అణ్వస్త్రాలను వినియోగానికి సిద్ధంగా ఉంచకూడదు. ఒకరి అణు కేంద్రాలను మరొకరు తనిఖీ చేసుకోవచ్చు. అయితే, ఇది 2021లోనే ముగియాల్సి ఉన్నప్పటికీ.. ఐదేళ్లపాటు పొడిగించారు.

## పాతబస్తీ వారసత్వ కట్టడాలను పరిరక్షిస్తున్నారా?

పిటిషనర్ తరఫు న్యాయవాది రామారావు వాదించారు. ఆ ప్రక్రియ కొనసాగుతోందని ఏఏజీ చెప్పారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు.. నిర్మాణానికి సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని మెట్రో నిర్మాణ సంస్థను ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## రూ.15 లక్షల లంచం డిమాండ్

### సొమ్ము తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కూకట్‌పల్లి ఎస్ఈ

హైదరాబాద్(జనంసాక్షి): ఏసీబీ అధికారుల వలలో భారీ అవినీతి తిమింగలం పడింది. రూ. 15 లక్షలు లంచం తీసుకుంటూ కూకట్‌పల్లి జోన్ ఎస్ఈ చిన్నారెడ్డి అధికారులకు చిక్కారు. జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. చిన్నారెడ్డి ఆస్తులు, ఇతర అంశాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. బిల్లులు మంజూరు చేయాలంటే లంచం ఇవ్వాలని ఒక కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

**ఖమ్మం(జనంసాక్షి):** తెలంగాణ లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఇప్పటికే 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేయగా, రెండో జాబితా పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ కీలక ప్రకటన చేశారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. త్వరలో రెండో విడత లబ్దిదారుల జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ ఈ విడతలో ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ÷ూజకీయాలను పక్కనపెట్టి పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు.ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఖాళీ స్థలం ఉండి ఇల్లు నిర్మించే పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. మొత్తం 4 విడతల్లో లబ్దిదారుల ఖాతాల్లో ఆ మొత్తం నిధులు జమ చేస్తున్నారు.

## చిత్ర పరిశ్రమకు పెద్దపీట

ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీలను హైదరాబాద్‌లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్‌కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే, సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందని వివరించారు.సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం కొనియాడారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. అందుకే వారి పేరు మీద గత సంవత్సరం నుంచి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి, సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి, అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులను ఎంపిక చేశారని, ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

## మిర్చి రైతులకు గుడ్ న్యూస్

తమ ఉత్పత్తిని పెద్ద ధరకు విక్రయించగలిగితే, ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో ప్రతి రకానికి ప్రత్యేక ధరలు ఉన్నాయని, ధరల పెరుగుదల కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ధరల పెరుగుదల రైతుల ఉత్సాహాన్ని పెంచింది, కానీ నిలకడైన ఆదాయం కోసం మంచి మార్కెట్ వ్యూహాలు అవసరం. పంటలను సరైన సమయంలో మార్కెట్లో విడుదల చేయడం, నిల్వ మరియు రవాణా సదుపాయాలను మెరుగుపరచడం కీలకం. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్‌లను గమనించి, ధరల మార్పులపై రైతులు సరిగా నిర్ణయాలు తీసుకోవాలి. ఈ పరిస్థితులు, రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తూ, స్థిరమైన లాభాలను అందించగలవని విశ్లేషకులు పేర్కొన్నారు.

## తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పవన్ రాక

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రచారం చేయనున్నారు. ఈ నెల 7, 8వ తేదీల్లో ప్రచారం చేసేందుకు రానున్నారు. ఈ మేరకు జనసేన కేంద్ర కార్యాలయం వెల్లడించింది. భాజపా, జనసేన అభ్యర్థుల తరఫున మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ తెలిపింది. పవన్ ఎన్నికల ప్రచార షెడ్యూల్, రూట్ మ్యాప్‌ను త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది.

## పవన్.. ఆంధ్రా రాజకీయాలు చూసుకో

- తెలంగాణను అవమానించిన నీకు ఇక్కడేం పని?
- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యలు

హైదరాబాద్(జనంసాక్షి): పవన్ ఒక ఆంధ్ర నాయకుడని, ఆయన తెలంగాణ వ్యతిరేకి అని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.ఈ మేరకు పవన్ కల్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ తన రాజకీయాలను ఆంధ్రాలోనే చేసుకోవాలని, తెలంగాణలో ఆయన ప్రచారం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో మహేశ్ గౌడ్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారు. బీజేపీ నేతలు పవన్ కల్యాణ్‌ను భిక్షాం దేహీ అని అడిగారు' అని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారని, అలాంటి వ్యక్తి మాటలు విని ఇక్కడి ప్రజలు ఓట్లు వేయరని అన్నారు. ఆయన మాటలను ఎవరూ విశ్వసించరని, ఆయన ప్రభావం తెలంగాణ రాజకీయాలపై శూన్యమని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.గతంలో తెలంగాణ రాష్ట్రం గురించి, తెలంగాణ వ్యక్తుల గురించి, భాష, సంస్కృతి గురించి దారుణంగా మాట్లాడారని మండిపడ్డారు. అందుకే పవన్‌ను దిష్టి కల్యాణ్ అని అంటామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి సంక్షేమం, అభివృద్ధి ఇస్తుందని అన్నారు.

# సుప్రీంలో సవాల్ చేస్తాం

వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితం అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టేయడంపై కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాసి గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధంగా చర్య తీసుకోకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఓవైపు జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి దుమ్మెత్తిపోస్తున్న తరుణంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవికున్న గౌరవాన్ని దెబ్బతీయడమే. పంచాయతీ ఎన్నికల్లో తగిలిన ఘోరమైన ఎదురుదెబ్బతో కోలుకోని కాంగ్రెస్ పార్టీ బైఎలక్షన్స్ అంటే భయపడుతోందని అర్థమైపోయింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఫల్యాలు, మోసాలపై పట్టణ ప్రజల్లో పెద్దఎత్తున వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని తేలిపోయింది. పార్టీ ఫిరాయింపుల సూత్రధారి ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకనుంచి రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఒక్కరిపై కూడా చర్య తీసుకోకుండా సీఎం నడిపిస్తున్న ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం తప్పదని పేర్కొన్నారు.

**సిట్ విచారణ పేరుతో డైవర్షన్ గేమ్: కేటీఆర్**

హైదరాబాద్: సిట్ విచారణ పేరుతో డైవర్షన్ గేమ్ ఆడుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో వరుసగా విచారణ చేస్తుంటే అనుమానం వచ్చిందని తెలిపారు. ఆరా తీస్తే సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారం బయటపడిందన్నారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి బినామీ కంపెనీకి సుప్రీంకోర్టు ఇటీవల నోటీసులు ఇచ్చింది. దివాలా తీసిన ఇన్‌ఫ్రా సంస్థకు రూ.6 వేల కోట్ల టెండర్లు ఇచ్చారు. గతంలో రేవంత్‌పై ఐటీ సోదాలు జరిగాయి. ఇన్‌ఫ్రా కంపెనీలో సీఎం పెట్టుబడులు ఉన్నాయి. 2023లోనే కేఎల్ఎస్ఆర్ సంస్థ దివాలా తీసింది. ఈ కంపెనీకి ఎందుకు టెండర్లు ఇచ్చారని సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. ఈ బినామీ వ్యవహారం బయటకు రాకుండా చేయాలనే సిట్ విచారణతో డ్రామా ఆడుతున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.

**జగిత్యాల ఎమ్మెల్యేకు సంజయ్ అనర్హత..**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చానని సంజయ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని కడియం శ్రీహరి చెప్పడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యానించారు. కడియం నీతులు చెప్పడం ఆపు. నువ్వు కాంగ్రెస్‌లో చేరావని స్పీకర్ ముందు అంగీకరించు. దిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కాలయాపన చేసి అనర్హత నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఆధారాలు లేవని ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు' అని వివేకానంద తెలిపారు.

# ప్రధాని సభకొచ్చే ధైర్యం లేదా?

భారత సైన్యం మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె పుస్తకంలోని ఓ అంశంపై వివాదం కొనసాగుతోంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. ఆ పుస్తకం చదివితే చైనా మన సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు మన దేశ నాయకత్వం దానిపై ఎలా స్పందించిందనే విషయం బయటపడిపోతుందని ప్రభుత్వం భయపడుతోందన్నారు. అందుకే తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఈ విషయంపై పార్లమెంటులో మాట్లాడనీయకుండా చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపా నాయకులు మాట్లాడేటప్పుడు కూడా పుస్తకాలు, పత్రికల గురించి ప్రస్తావిస్తారన్నారు. ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వమైనా, ప్రతిపక్షమైనా తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేసేవి. కానీ, ఇప్పుడు ఓ వ్యక్తి అభిప్రాయాన్ని మాత్రమే ముందుకు తీసుకొస్తున్నారని విమర్శలు చేశారు. వారికి సంబంధించి ఏ విషయాలు బయటపడతాయోనని ప్రభుత్వం భయపడుతోందన్నారు. అందుకే ఆ పుస్తకం ప్రచురణకు అనుమతించడం లేదని ఆరోపించారు.

### ఇలా మొదలు.. అలా వాయిదా..

**ఐదు నిముషాలకే లోక్‌సభ వాయిదా**

న్యూఢిల్లీ(జనంసాక్షి): పార్లమెంటు బ్జడెట్ సమావేశాల్లో యూరోపియన్ యూనియన్, అమెరికాతో చేసుకున్న ఒప్పందాల వివరాలను పార్లమెంటు ముందుంచాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో బుధవారం కూడా లోక్‌సభ ప్రారంభం అవ్వగానే ప్రతిపక్ష సభ్యులు ఈ ఒప్పందాలపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ పరిణామాలతో సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే మధ్యాహ్నం 12 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. మరోవైపు రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ మాట్లాడడనున్నారు. ఇకపోతే భారత సైన్యం మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె పుస్తకంలోని ఓ అంశంపై వివాదం కొనసాగుతోంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. ఆ పుస్తకం చదివితే చైనా మన సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు మన దేశ నాయకత్వం దానిపై ఎలా స్పందించిందనే విషయం బయటపడిపోతుందని ప్రభుత్వం భయపడు తోందన్నారు. అందుకే తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఈ విషయంపై పార్లమెంటులో మాట్లాడనీయ కుండా చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపా నాయకులు మాట్లాడేటప్పుడు కూడా పుస్తకాలు, పత్రికల గురించి ప్రస్తావిస్తార న్నారు. ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వమైనా, ప్రతిపక్షమైనా తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేసేవి. కానీ, ఇప్పుడు ఓ వ్యక్తి అభిప్రాయాన్ని మాత్రమే ముందుకు తీసుకొస్తున్నారని విమర్శలు చేశారు. వారికి సంబంధించి ఏ విషయాలు బయటపడతాయోనని ప్రభుత్వం భయపడు తోందన్నారు. అందుకే ఆ పుస్తకం ప్రచురణకు అనుమతించడం లేదని ఆరోపించారు. ఇంకా ప్రచురణ కాని నరవణె రాసిన పుస్తకాన్ని విపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రాంగణంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేడు ప్రధాని మోదీ లోక్‌సభకు వస్తారని తాను అనుకోవడం లేదన్నారు.

## తెలంగాణ కోసం ఏనాడైనా రేవంత్ పోరాడారా?

### స్వరాష్ట్రం కోసం మంత్రి పదవులను త్యాగం చేశాం: హరీశ్

మెదక్(జనంసాక్షి): తెలంగాణ కోసం తాము మంత్రి పదవులు త్యాగం చేశామని.. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పుడైనా రాష్ట్రం కోసం పోరాడారా? అని భారత రాష్ట్రసమితి ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఏ ముఖం పెట్టుకుని మెదక్ ప్రజలను ఓట్లు అడుగుతున్నారని ధ్వజమెత్తారు. 'మెదక్ నుంచి సిద్దిపేటకు ఆఫీసులను నేను తరలించానని అంటున్నారు. నేను తరలించిన ఆఫీస్ పేరు చెబితే నేనే తెచ్చిస్తా. రేవంత్‌రెడ్డి ఒక్కటంటే.. నేను రెండంటాను. ఆయన మంచి మాట్లాడితే.. మేము మంచే మాట్లాడతాం. ఆయన భాష జారితే.. మేము కూడా జారాల్సి వస్తుంది. రైతు భరోసా సొమ్ము ఈనెల 11లోపు ఇవ్వకపోతే కర్షక ఆగ్రహానికి గురికాక తప్పదు' అని హరీశ్‌రావు అన్నారు.



# ఆక్సిజన్ అందక మహిళ మృతి

- అంబులెన్స్ వైద్య సిబ్బందిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి
- మృతురాలు కుటుంబ సభ్యులు



**మహదేవపూర్, ఫిబ్రవరి 4 (జనంసాక్షి)** : అత్యవసర సేవలందించేందుకు 108 వాహనాలను ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. కానీ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవలసిన 108 వాహనాల్లో ఆక్సిజన్ లాంటి ప్రధాన సౌకర్యం విద్యుత్ సదుపాయం లేకపోవడం నిండు ప్రాణాలను బలిగున్నాయని అత్యవసర సేవలందించే 108 వాహనాలపై అధికారుల నిఘా లేకపోవడం వల్ల సమయానికి వాహనం అందుబాటులోకి రాకపోవడం ఎంతో నమ్మకముతో ఉన్న పేద ప్రజలకు 108 వాహనాలు ప్రాణాలు పోస్తాయి అనుకుంటున్నా క్రమంలో పేద ప్రజల ప్రాణాలు తీస్తున్నాయని చెప్పుకోవడంలో ఇలాంటి సందేహం లేదు. కానీ 108 వాహనంలో ఆక్సిజన్ విద్యుత్ సదుపాయ లేకపోవడం వల్ల మహిళ మృతి చెందింది. నిర్లక్ష్యం చేసిన 108 వైద్య సిబ్బందిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు మహదేవపూర్ మండలంలోని కుదురుపల్లి గ్రామానికి చెందిన చల్లం మదునమ్మ అనే మహిళ అనారోగ్యంతో అస్తవ్యస్త గురికావడంతో మదునమ్మ మనుమళ్లు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో వచ్చిన 108 వాహనం మదినమ్మ ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్న క్రమంలో వాహనములు ఆక్సిజన్ సదుపాయం ఉండకపోవడం బంధువులు ఆక్సిజన్ సిలిండర్ తీసుకు వచ్చినప్పటికి అమర్చుటకు సిద్ధమైనప్పటికీ వాహనములు విద్యుత్ సదుపాయం లేకపోవడంతో అత్యవసర సమయములు మదినమ్మ కు ఆక్సిజన్ అందకపోవడం 108 వాహనంలో సామాజిక ఆసుపత్రికి తీసుకువచ్చే క్రమంలో మదినమ్మ మృతి చెందడం జరిగింది. తిరిగి మదినమ్మ మృతదేహాన్ని కి తీసుకు వెళ్ళుటకు అంబులెన్స్ లేకపోవడంతో పేద కుటుంబం అయినా మదనమ్మ బంధువులు ప్రవేటు ఆటో వాహనంలో మృతురాలు ఇంటికి తీసుక వెళ్లడం జరిగిందన్నారు. నిర్లక్ష్యం చేసిన 108 వైద్య సేవలు అందించే సిబ్బందిపై జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని కుటుంబ బంధువులు కోరారు.

# ఓటు అమ్ముకోవద్దు



**తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు**

**సూర్యాపేట (జనం సాక్షి) :** ఓటును అమ్ముకోవద్దని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రం లో గాంధీ విగ్రహం వద్ద ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక వెంపటి రాము ఆధ్వర్యంలో 'ఓటు అమ్ముకోవొద్దు' అని పిలుపునిస్తూ వివిధ ప్రజా సంఘాల నాయకులు వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, రాష్ట్ర నాయకులు భాషిపంగు సునీల్, ఏనిగా సంతోష్ రెడ్డి పాల్గొని మద్దత్తు తెలియజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలతో సంబంధం లేని వాళ్ళు, ఎన్నికలు రాగానే డబ్బు సంచులతో రాజకీయ పార్టీ ల సీట్లు సంపాదించి, నోట్ల తో ఓట్లు కొంటున్నారని ఈ 'ధన స్వామ్యాన్ని' ఓటర్లు కులాదోసి, నోటు కి ఓటు అమ్ముకోకుండా ప్రజల కోసం పని చేసే నిజాయతి గల నాయకులకు ఓటు వేసి ప్రజాస్వామ్యానికి పునాదులు వేయాలని అన్నారు. కొంతమంది అవకాశా వాద రాజకీయ నాయకులకు తమ తమ పార్టీ లలో కేవలం డబ్బులు ఉన్నాయనే సాకు చూపి కొన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించడం సిగ్గు చేటు అని అన్నారు. ప్రభుత్వ అధికారులు కూడా ఓటు విలువ పై ప్రజలను చైతన్యం చేయాలనీ పిలుపు నిచ్చారు. మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికలలలో మద్యం సీసాలకు, కరెన్సీ నోట్ల కి ఓట్లు అమ్ము కోకుండా ప్రజల పక్షాన నిరంతరం నిలిచే వారిని ఎన్నికలలో గెలిపించాలని ఓట్లర కి విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ అన్న, వివిధ ప్రజా సంఘాల నాయకులు గుండు వెంకన్న, నర్సయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.



# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయండి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్..
- ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పై వెరిఫికేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్ష..

హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టిన ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని వెరిఫికేషన్ అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పై వెరిఫికేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ఇరవై పోలింగ్ కేంద్రాలలో 2002 ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో బీఎల్వోలు ఓటర్ల జాబితాను ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ చేస్తున్న ప్రక్రియపై వెరిఫికేషన్ అధికారులుగా నియమితులైన జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. క్షేత్రస్థాయిలో మ్యాపింగ్ చేస్తున్న విధానం, ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా, వెరిఫికేషన్ అధికారులుగా పరిశీలించిన అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ బీఎల్వోలు ఆయా పోలింగ్ కేంద్రాల వారీగా క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతంగా చేసేవిధంగా చర్యలు చేపట్టాలని వెరిఫికేషన్ అధికారులకు తెలియజేశారు. బీఎల్వోలుగా ఉన్నవారు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారా లేదా పరిశీలించాలని ఆర్డీవో రాథోడ్ రమేష్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, వెరిఫికేషన్ అధికారులు డీఆర్డీవో మేన శ్రీను, డీఎంహెచ్ వో డాక్టర్ అప్పయ్య, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఉద్యాన శాఖ అధికారి అనసూయ, ఇంచార్జి డీడబ్ల్యూవో విశ్వజ, మెప్మా కో ఆర్డినేటర్ రజిత రాణి, డీఎల్పీవో గంగా భవాని, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రచయితల సమాఖ్య ఆవిర్భావం

- పోస్టర్‌ను ఆవిష్కరించిన జూలూరు
- సామాజిక న్యాయం కోసం గళమెత్తాలి.. కలమెత్తాలని పిలుపు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం కోసం బీసీల హక్కుల సాధన కోసం భావజాలవ్యాప్తి చేస్తూ గళమెత్తేందుకు, కలమెత్తేందుకు ఆవిర్భవించిందే 'బీసీ రచయితల సమాఖ్య' అని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీశంకర్ తెలిపారు. బీసీలు తమ వాటా తాము సాధించకునేందుకు 'మా వాటా మాకేనంటూ' నినదింపచేస్తూ ఓట్లు మావే సీట్లు మావేన'ని చాటింపు వేసేందుకే 'బీసీ రచయితల సమాఖ్య' మొదలయ్యిందని పేర్కొన్నారు. తెలుగు నేలపై ఎగిసిన అన్ని రకాల విముక్తి పోరాటాలు అస్తిత్వ ఉద్యమాలలో పాలుపంచుకుని అగ్ర భాగాన నిలిచి కీలక పాత్ర పోషించిన బీసీ రచయితలు, ఇప్పుడు తమ జాతుల, కులాల హక్కుల సాధన కోసం కోట్ల గొంతుకల బడుగుల మహాస్వరంగా 'బీసీ రచయితల సమాఖ్య'గా అవతరించిందని వివరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ రచయితల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ గాజోజు నాగభూషణం, అరసం రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్ తదితర కవులు, రచయితలతో కలిసి బీసీ రచయితల సమాఖ్య పోస్టర్‌ను జూలూరు గౌరీశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ, రాజ్యాంగమే ప్రమాణంగా స్థానిక సంస్థల నుంచి చట్ట సభల వరకు బీసీలకు తమ వాటా ప్రకారం లభించాల్సిన సీట్లను సాధించుకునేందుకు బీసీలను ఏకం చేయటమే ఏకైక లక్ష్యంగా బీసీ రచయితల సమాఖ్య ముందుకు సాగుతుందన్నారు. కోట్లాదిమంది బడుగుల సామూహిక స్వప్నమైన బీసీ రాజ్యాధికారం సాధించాలన్న ఒకే ఒక లక్ష్యంతో సాహిత్య సృష్టి చేయటమే 'బీసీ రచయితల సమాఖ్య' కర్తవ్యమని తెలిపారు. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో విడగొట్టబడిన బీసీ కులాలన్నింటిని ఏకం చేస్తూ మనదంతా ఒకే బీసీకులమన్న ఐక్యతను సాధించేందుకు భావజాల వజ్రాయుధంగా "బీసీ రచయితల సమాఖ్య" పని చేస్తుందన్నారు. బీసీలది కులపోరాటం కాదని, ఇది సామాజిక న్యాయ పోరాటమని చాటి చెబుతూ పాట, కవిత, కథ, నవలా ప్రక్రియల ద్వారా సాహిత్యం సృష్టించబడాలన్నారు. బీసీల భావోద్వేగాలను చాటి చెప్తూ భావజాలాన్ని గడపగడపలదాకా, బీసీల ఎదఎదదాకా తీసుకు పోయేందుకు కృషి జరగాలన్నారు. ఇది బీసీల హక్కుల పోరాటమే కానీ, కొన్ని కులాలకు వ్యతిరేక పోరాటం కాదన్నారు. కుల అసమానతలను తొలగిస్తూ సమానత్వం కోసం, అన్ని అవకాశాలు అందరికీ అందాలన్నదే బీసీల సామాజిక న్యాయ పోరాటమని వివరించారు. పాలకులు వాగ్ధానాలు చేసి బీసీల ఓట్లను కొల్లగొట్టే రాజకీయాలకు చరమగీతం పాడాలన్నారు- చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల జరుగుతోన్న నష్టాల్ని తెలియజేస్తూ జరగాల్సిన ఉద్యమాలకు వెన్నుదన్నుగా సాహిత్య సృష్టి జరగాలన్నారు. మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆట, పాట, మాట రూపకల్పనలు ఎలా జరిగాయో ఇప్పుడు బీసీ ఉద్యమానికి సాహిత్య ధూంధాలు ఎగిసిపడవలసి ఉందని వివరించారు.

బీసీ యోధుల చరిత్రను పలు సాహిత్య రూపాల ద్వారా కవిత, వ్యాసం, పాట, నాటిక, నాటకం, వీధినాటికలు, పలు కళారూపాల్లో సోషల్ మీడియాల ద్వారా ఈ తరం హృదయాల్లోకి తీసుకుపోయే పనిని చేపట్టాలని చెప్పారు. మెజార్టీ ప్రజలైన బీసీలను మత్తులో ముంచేస్తూ ఏలుకుంటూ వస్తోన్న తీరుకు చరమగీతం పాడాలన్నారు. మన ఓటు మనకేనన్న స్ఫూర్తి బీసీలకు కలిగినప్పుడు మాత్రమే రాజకీయ రంగంలో ఆధిపత్య రాజకీయాలను దునుమాడగలుగుతామన్న స్ఫూర్తిని రగిలించే పని చేయాలని చెప్పారు. బీసీ కవులలు, రచయితలు తమ కుల అస్తిత్వాల గురించి మాట్లాడుతూ తమ మూలాలను వెతుక్కునే సామాజిక అస్తిత్వం అవుతారని చెప్పారు. రాజకీయ అస్తిత్వం అన్నప్పుడు ఉమ్మడి బీసీ అస్తిత్వంగా ఐక్యమవుతారని చెప్పారు. వెనక్కి వెళ్లి చరిత్రకు రీ-కనెక్ట్ కావటం వల్ల కొత్త ఐకాన్స్ వస్తారని, ఇప్పుడు బడుగుల ఉద్యమాల కాలజ్ఞానం చెప్పే అత్యాధునిక పోతులూరి వీరబ్రహ్మేలు కొత్త కలాలై బహుజన కాలజ్ఞానాలు రాయాలన్నారు. ఆ పనిని చేయటానికి కదలించి నడిపించడానికే బీసీ రచయితల సమాఖ్య ఆవిర్భవించిందని జూలూరు తెలిపారు. బీసీ రచయితల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ గాజోజు నాగభూషణం మాట్లాడుతూ, త్వరలో 33 జిల్లాల కమిటీలను వేస్తామని తెలిపారు. బీసీ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడానికి పలు రూపాల్లో కార్యక్రమాలను రూపొందిస్తామని అన్నారు. ఈ సమాఖ్య బీసీల హక్కుల సాధనకై జరిగే నిరంతర పోరాటాలకు మద్దతును కొనసాగిస్తుందని చెప్పారు. అరసం రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ, బీసీ రచయితల సమాఖ్య భవిష్యత్తులో తన వంతుగా చారిత్రక కర్తవ్యాన్ని నిర్వహిస్తుందని ఆశిస్తున్నామన్నారు.

# నువ్వు ముఖ్యమంత్రివా? లేక వీధి రౌడీవా?

- 11తేదీలోగా రైతుబంధు ఇవ్వకపోతే రైతులు నీ చెడ్డీల తొండలు ఇడుస్తారు
- గెలిచే దమ్ములేక మా అభ్యర్థులను ఎత్తుకెళ్తున్నారు
- రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 4 (జనం సాక్షి):** కాంగ్రెస్ పార్టీకి గెలిచే దమ్ములేక, ఓడిపోతామనే భయంతో బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించి, ప్రలోభపెట్టి పార్టీలు మారుస్తున్నారని మాజీ మంత్రి, హరీష్ రావు మండిపడ్డారు. మెదక్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాషపై, పాలనపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. 'రేవంత్ రెడ్డి.. నువ్వు ముఖ్యమంత్రివా? లేక వీధి రౌడీవా? అని అడుగుతున్నా. అవ్వతాతలు రూ. 4000 పెన్షన్ ఎప్పుడు ఇస్తావ్ అని అడిగితే లాగుల తొండలు వదులుతా అంటావా.. బాండ్ పేపర్లు రాసిచ్చి, అమ్మతోడు అని చెప్పి మోసం చేశావు కదా.. ఆడబిడ్డలు మహాలక్ష్మి రూ. 2500 అడిగితే 'పేగులు తీసి మెడలో వేసుకుంటా' అంటావా? ఇదేనా నీ సంస్కారం? నీ రౌడీయిజం సాగదు ఖబర్దార్' అని హెచ్చరించారు. 'కాంగ్రెస్ పార్టీకి గెలిచే సత్తా ఉంటే మా అభ్యర్థులను ఎందుకు ఎత్తుకెళ్తున్నారు? జనం మీకు ఓటు వేయరని అర్థమై.. పోలీసులతో బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి కండువాలు కప్పుతున్నారు. ఎవరెవరు అమ్ముడుపోతున్నారో, ఎవరు ఎందుకు ఎత్తుకుపోతున్నారో అందరినీ గుర్తుపెట్టుకుంటాం. సమయం వచ్చినప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తాం' అని అన్నారు. 'ఇప్పటివరకు రైతు బంధు ఇవ్వలేదు. ఫిబ్రవరి 11వ తేదీలోగా రైతు బంధు పడకపోతే.. రైతులు నీ చెడ్డీల తొండలు తొడిగి ఏడిపిస్తారు. నిన్ను చీరిచింతకు చెండాడుతారు. రుణమాఫీ పేరుతో దేవుళ్లనే మోసం చేసిన ఘనుడివి నువ్వు. నీ అబద్ధాలను రైతులు నమ్మే స్థితిలో లేరు. కాంగ్రెస్ వచ్చాక ఇక్కడ ఒక్క రూపాయి పని జరగలేదు. మెదక్‌లో ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు.ఏ కార్యకర్తకు ఏ ఇబ్బంది వచ్చినా మీకు మీ హరీష్ అన్న ఉన్నాడు. నేను చూసుకుంటా. కాంగ్రెస్ గుండా రాజకీయాన్ని, మోసాలను ఎండగట్టండి' అని కోరారు. ఈ సమావేశంలో మెదక్ మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జ్ ఫారుక్ హుస్సేన్, జిల్లా బి ఆర్ఎస్ అధ్యక్షురాలు ఎం పద్మా దేవేందర్ రెడ్డి, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు దేవేందర్ రెడ్డి, కంటారెడ్డి తిరుపతిరెడ్డి, బట్టి జగపతి, మల్లికార్జున్ గౌడ్, మామిండ్ల ఆంజనేయులు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బీహార్ ప్రభుత్వ లేబర్ రిసోర్సెస్ ఉన్నతాధికారులను కలిసిన టీజీవో హైదరాబాద్ అధ్యక్షులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీహార్ ప్రభుత్వ లేబర్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డిప్యూటీ డైరెక్టర్ రాజీవ్ రమణ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ అంకిత్ రాజ్‌తో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబి కృష్ణ యాదవ్ టీజీఓ డైరీ-2026ను ఆవిష్కరించి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లాలో ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు (ఏటీసీలు), ఉపాధి మార్పిడి కేంద్రాలు, టామ్‌కామ్ ద్వారా ఉపాధి సృష్టి కోసం తీసుకున్న అభివృద్ధి, ఆవిష్కరణ కార్యక్రమాలను ఎంబి కృష్ణ యాదవ్ వివరించారు. బీహార్ రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన కోసం తీసుకున్న ముఖ్యమైన కార్యక్రమాలను బిహార్ అధికారులు వివరించారు. ఇరు రాష్ట్రాల మధ్య అనుభవాల పరస్పర మార్పిడి ద్వారా ఆధునిక నైపుణ్యాల అభివృద్ధి, స్థిరమైన ఉపాధి అవకాశాలు మరింత బలోపేతం అవుతాయని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది.

## తెలంగాణ మిర్చి రైతులకు గుడ్ న్యూస్

- దేశీ మిర్చి క్వింటా 41,200 రూపాయలకు అమ్మకం

**వరంగల్, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) :** తెలంగాణలో మిర్చి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి, రైతులకు ఆశాజనకంగా మారాయి. వరంగల్ జిల్లా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో దేశీ మిర్చి క్వింటా 41,200 రూపాయలకు, ఎల్లో మిర్చి క్వింటా 44,000 రూపాయలకు అమ్ముడయ్యింది. వండర్ హాట్ మిర్చి ధర ఒక్కరోజులో 5,000 రూపాయలు పెరిగి క్వింటా 37,100కి చేరింది. అంతర్జాతీయ డిమాండ్ పెరుగుదల, ఇతర రాష్ట్రాల్లో ఉత్పత్తి తగ్గడం ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా తక్కువ ధరల కారణంగా బాధపడ్డ రైతులకు ఈ పరిస్థితి పెద్ద ఊరటనిస్తుంది. వివిధ రకాల మిర్చి ధరలు ఊహించనంత వేగంగా పెరుగుతుండడం రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచింది. ఎల్లో, దేశీ, వండర్ హాట్ మిర్చి వంటి రకాల డిమాండ్ అంతర్జాతీయంగా కూడా ఎక్కువగా ఉండటంతో మార్కెట్ ఉత్సాహంగా ఉంది. వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో ప్రతి రకానికి ప్రత్యేక ధరలు ఉన్నాయని, ధరల పెరుగుదల కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ధరల పెరుగుదల రైతుల ఉత్సాహాన్ని పెంచింది, కానీ నిలకడైన ఆదాయం కోసం మంచి మార్కెట్ వ్యూహాలు అవసరం. పంటలను సరైన సమయంలో మార్కెట్లో విడుదల చేయడం, నిల్వ మరియు రవాణా సదుపాయాలను మెరుగుపరచడం కీలకం. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్‌లను గమనించి, ధరల మార్పులపై రైతులు సరిగా నిర్ణయాలు తీసుకోవాలి. ఈ పరిస్థితులు, రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తూ, స్థిరమైన లాభాలను అందించగలవని విశ్లేషకులు పేర్కొన్నారు.

# పులి జాడలతో జనం బెంబేలు

- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



**జనగామ, ఫిబ్రవరి4 (జనంసాక్షి) :** పెద్దపులి సంచారం ఇప్పుడు మూడు జిల్లాల వాసులను భయాందోళనకు గురి చేస్తోంది. సిద్దిపేట, యాదాద్రి, జనగామ జిల్లాల సరిహద్దుల్లో తిరుగుతున్నట్లుగా గుర్తించారు. జనగామ మండలంలోని సిద్దెంకి, పెంబర్తి, పెద్దరాంచర్లలో పెద్దపులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. యాద్రాది భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామ మీదుగా పెద్దపులి జనగామకు ప్రవేశించినట్లు రైతులు ఆటవీశాఖ, పోలీసులు సమాచారం అందించారు. దీంతో ఆధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి పులి పాదముద్రలను సేకరించారు. వ్యవసాయ బావుల ప్రాంతాల్లో సంచరిస్తూ ఉండోచ్చని కావున వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన పెద్దపులి వరుస గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా ఈ పులి యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం బసంతపూర్ సమీపంలో ఓ లేగదూడపై దాడి చేసి చంపేసినట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు, తాజాగా జనగామ జిల్లా ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామ పరిసరాల వైపు పులి వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా గుర్తించారు. ఘటనా స్థలాల్లో అటవీ శాఖ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. పులి ప్రయాణించే మార్గాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి సంచారం కారణంగా సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# బిజెపి అభ్యర్థులకు బూస్ట్

- ప్రచారం చేయనున్న పవన్ కళ్యాణ్



**హైదరాబాద్, ఫిబ్రవరి4 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ త్వరలో తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈనెల 7,8 తేదీల్లో బీజేపీకి మద్దతుగా పవన్ ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు బిజెపి నేతలకు హామీ ఇచ్చారు. మంగళవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు రామచందర్‌రావు.. పవన్ కల్యాణ్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మున్సిపల్ ఎన్నికలు సహా పలు కీలక అంశాలపై ముగ్గురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా బీజేపీ తరఫున ప్రచారంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి, రామచందర్ రావు.. పవన్‌ను కోరారు. ఇందుకు పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని రామచందర్ రావు స్వయంగా వెల్లడించారు. మంగళవారం ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పవన్ కల్యాణ్ గారిని కలవడం గౌరవంగా భావిస్తున్నా. తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలతో సహా ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా, అర్థవంతమైన చర్చలు జరిపాము. పవన్ కల్యాణ్ గారు భారతీయ జనతా పార్టీకి పూర్తి మద్దతు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం చేయడానికి అంగీకరించారు' అని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత 13న ఫలితాలను వెల్లడించనున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 ప్రకారం ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ, జనసేన స్నేహపూర్వక పోటీ అంటూ ఈ మేరకు జనసేన పార్టీ ట్వీట్ చేసింది.

# వీటో రాజకీయాల బందీగా ప్రపంచ భవిష్యత్తు



**శాంతి నినాదాల మధ్య యుద్ధ రాజకీయాలు..**
**ప్రపంచం నెత్తిన అశాంతి కుంపటి..**
**అగ్రరాజ్యాల అహంకార అగ్ని గుండంలో మానవాళి విలవిల..**
**శాంతిస్థాపనే అంతిమ లక్ష్యం కావాలి..**

విశ్వ మానవాళి ఇరవై ఒకటవ శతాబ్దంలోకి అడుగు పెట్టి, శాస్త్ర- సాంకేతికంగా అద్భుత ప్రగతి సాధించినప్పటికీ, శాంతి పరంగా మాత్రం మరింత వెనుకబాటులో పడుతున్న దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది. శాస్త్రవిజ్ఞానం అంతరిక్షాన్ని చీల్చుకుంటూ దూసుకెళ్తుంటే, భూమిపై మాత్రం రక్తపాతం, విధ్వంసం, అశాంతి విస్తరిస్తూనే ఉన్నాయి.
ప్రపంచ శాంతి, మానవాళి శ్రేయస్సు కోసం ఏర్పడిన ఐక్యరాజ్యసమితి (ఐరాస) ఈ అశాంతిని అడ్డుకునే స్థాయిలో ప్రభావవంతంగా పనిచేస్తుందా? అనే ప్రశ్న నేడు జాగ్రత్తగల ప్రతి పౌరుడిని కలవరపెడుతోంది. దాదాపు పది కోట్ల మంది ప్రాణాలను పొట్టన పెట్టుకున్న- రెండు ప్రపంచ యుద్ధాలు భయానక అనుభవాల అనంతరం "ఇకపై యుద్ధాలకు తావు లేకుండా చేయాలి" అనే మహత్తర సంకల్పంతో 1945లో ఐక్యరాజ్యసమితి అవతరించింది. కానీ ఆ లక్ష్యానికి విరుద్ధంగా నేటి ప్రపంచం మరింత అశాంతి కుంపటిగా మారుతోంది. యుద్ధాల సంఖ్య తగ్గడం కాదు గానీ, అవి రూపాంతరం చెందుతూ మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి.

**ఐక్యరాజ్యసమితిలో- అగ్రరాజ్యాల వీటో రాజకీయాలు**

కొరియా, వియత్నాం యుద్ధాల నుంచి నేటి రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయిల్--పాలస్తీనా, మధ్యప్రాచ్య ఘర్షణల వరకు ప్రపంచం నిరంతరం రక్తపాతానికి సాక్ష్యంగా నిలుస్తోంది. లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నా, కోట్లాది మంది శరణార్థులుగా మారుతున్నా, ఐక్యరాజ్యసమితి కేవలం ఆందోళన వ్యక్తం చేయడానికే పరిమితమవుతోంది.
భద్రతామండలి అనే కీలక విభాగం అగ్రరాజ్యాల స్వార్థ రాజకీయాలకు వేదికగా మారడం ఐరాస లక్ష్యాలను నీరుగారుస్తోంది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా అనే ఐదు శాశ్వత సభ్య దేశాలకు ఉన్న వీటో అధికారం ప్రపంచ శాంతికి పెద్ద అడ్డంకిగా మారింది. ఒక తీర్మానం ప్రపంచ ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా ఉన్నా, ఈ ఐదుగురిలో ఒక్క దేశం "వీటో" అన్న మాట పలికితే అది నిర్వీర్యమవుతుంది.
గాజాలో జరుగుతున్న దాడులపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తమైనప్పటికీ, కొన్ని దేశాలు పదేపదే వీటో అధికారం ఉపయోగించి తమ మిత్రదేశాలను కాపాడుతున్నాయి. కొన్ని ప్రాంతీయ అంశాల్లో ఇతర అగ్రరాజ్యాల వైఖరి కూడా అదే దిశగా కొనసాగుతోంది. భారతదేశానికి భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వకుండా అడ్డుకోవడం కూడా ఈ రాజకీయ సమీకరణలలో భాగమే. ఈపరిస్థితుల్లో ఐరాస ఐదు దేశాల గుప్పిట్లో చిక్కుకున్న సంస్థగా మారుతున్నట్లు కనిపిస్తోంది. ప్రపంచ శాంతిని కాపాడాల్సిన సంస్థే అగ్రరాజ్యాల ఆధిపత్యానికి సాధనంగా మారడం విశ్వమానవాళికి శాపం!. అందుకే భద్రతామండలిలో తక్షణ సంస్కరణలు అవసరం. భారత్, బ్రెజిల్, జపాన్, జర్మనీ, దక్షిణాఫ్రికా, నైజీరియా వంటి దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించి ఐరాసను ప్రజాస్వామ్యబద్ధంగా మార్చాలి.

**ప్రపంచం నెత్తిన అశాంతి కుంపటి..**

అమెరికా స్థాపకు(జాతి నిర్మాత)లు తమ దేశం ప్రపంచానికి ఆదర్శ ప్రజాస్వామ్యంగా నిలవాలని కలగన్నారు. కానీ నేటి ప్రపంచ రాజకీయాల్లో కొన్ని దేశాల విధానాలు సామ్రాజ్యవాద దిశగా సాగుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఈ ధోరణి ప్రపంచాన్ని కలవర పెడుతోంది. అసత్య ప్రచారం, యుద్ధోన్మాదం, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని లెక్కచేయని వైఖరి వంటి అంశాలు అంతర్జాతీయ ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. గ్రీన్‌లాండ్‌పై వ్యాఖ్యలు, ఇరాన్‌పై దాడులు, వెనిజువెలాపై బెదిరింపులు, వలసదారులపై కఠిన వైఖరి విలంబించారు. ఓవైపు శాంతి మంత్రం జపిస్తూనే, మరోవైపు దేశాలపై యుద్ధాలకు కాలు దూకుతుంటారు. ఆయన మాటలు ప్రత్యర్థులనే కాదు, మిత్రులనుకూడా కలవరపాటు గురిచేస్తుంటాయి. రెండో పర్యాయం అమెరికా అధికార పగ్గాలు చేపట్టిన నాటించి ప్రపంచ పై సవాల్ విసిరడం ప్రారంభించారు. వాణిజ్య యుద్ధాలతో అనేక దేశాలను ఉక్కిరింపులు చేశారు. స్వదేశంలో వలసదారులపై యుద్ధాన్ని ప్రారంభించి, వేలమంది గుండెల్లో గుబులు పుట్టించారు. ఇలా డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు ఎన్నో అత్యంత వివాదాస్పదంగా మారాయి. ఇవన్నీ ఆధునిక ప్రపంచ రాజకీయాల్లో అత్యంత వివాదస్పదంగా మారుతోన్న ట్రంప్ నిర్ణయాలతో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచాన్ని ఆ స్థాయిలో భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.
చరిత్ర చెబుతోంది-ప్రపంచ యుద్ధాలు ఒక్కసారిగా ప్రారంభం కావు. అవి అహంకారం, అతి జాతీయవాదం, సామ్రాజ్యవాద ఆశల నుంచి పుట్టుకొస్తా యి. నేటి ప్రపంచ రాజకీయాల్లో అలాంటి లక్షణాలు పెరుగుతుండడం ఆందోళనకరం. "శాంతి కోసం కృషి చేస్తున్నాం" అని చెబుతూనే యుద్ధాలకు దారితీసే చర్యలు చేపట్టడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఇలాంటి ధోరణులు ప్రపంచాన్ని మరో మహావినాశనం వైపు నడిపించే ప్రమాదం ఉంది.

**శాంతిస్థాపనే అంతిమ లక్ష్యం.**

నేటి ప్రపంచ రాజకీయాల్లో శాంతి మాటలకే పరిమితమై, యుద్ధమే విధానంగా మారుతున్న దృశ్యం కనిపిస్తోంది. అగ్రరాజ్యాలు తమ ఆధిపత్య రాజకీయాలను కొనసాగిస్తూ ప్రపంచాన్ని భయంతో పాలిస్తున్నాయి. ఇది అంతర్జాతీయ న్యాయసూత్రాలకు, ప్రజాస్వామ్య విలువలకు బహిరంగ సవాల్ విసరడం లాంటిదే!. ప్రపంచ దేశాలన్నీ స్పష్టంగా తేల్చి చెప్పాల్సిన సమయం వచ్చింది. వీటో రాజకీయాలకు చోటు లేదు. ఆధిపత్యానికి అంగీకారం లేదు. యుద్ధోన్మాదానికి మద్దతు లేదు. ఐక్యరాజ్యసమితిని సంస్కరించి, బలోపేతం చేసి, నిజమైన ప్రపంచ పార్లమెంట్‌గా తీర్చిదిద్దాలి. యుద్ధాల మీద కాదు-శాంతి మీద.

**భయంపై కాదు-నమ్మకంపై.**

బలప్రయోగంపై కాదు-సృద్భావ చర్చలు, సంభాషణలపై ఆధారపడి ప్రపంచ శాంతిని నెలకొల్పేలా అంతర్జాతీయ వ్యవస్థను నిర్మించాల్సిందే. లేకపోతే ప్రపంచ చరిత్ర మరోసారి రక్తాక్షరాలతో రాయబడే ప్రమాదం ముంచుకొస్తోంది. ప్రపంచం నేడు ఒక కీలక మలుపు వద్ద నిలబడి ఉంది. అగ్రరాజ్యాల అహంకార రాజకీయాలు కొనసాగితే భవిష్యత్తు అంటే భయమే. ఈ అశాంతి కుంపటిని ఆర్పాలంటే ప్రపంచ దేశాలన్నీ ఏకమై ముందుకు రావాలి. ఐక్యరాజ్యసమితిని సంస్కరించి, బలోపేతం చేసి, నిజమైన ప్రపంచ శాంతి పరిరక్షక సంస్థగా మార్చాలి. యుద్ధం కాదు- శాంతి, ఆధిపత్యం కాదు-సహకారం, స్వార్థం కాదు- సామూహిక శ్రేయస్సు అనే సూత్రాలను అగ్రరాజ్యాలు స్వీకరించినప్పుడే మానవాళికి నిజమైన భవిష్యత్తు ఉంటుంది.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

## భారత్-అమెరికా
# వాణిజ్య ఒప్పందం

**అదానీ వారెంట్, 'నరవణే' పుస్తకం వివాదాలే**



**అసలు కారణమా?**

2026 సంవత్సరం ఆరంభంలోనే మోదీ ప్రభుత్వం భారత్-అమెరికా మధ్య కీలక వాణిజ్య ఒప్పందాన్ని ఒక "చారిత్రక విజయంగా" ప్రచారం చేసింది. అధికార మీడియా దాన్ని ఆర్థిక దౌత్యంలో మైలురాయిగా చిత్రించింది. కానీ రాజకీయాల చరిత్ర చెబుతున్న ఒక సత్యం ఉంది. అధికారిక ప్రకటనల వెనుక నిజమైన కారణాలు ఎప్పుడూ దాచబడతాయి. ఈ ఒప్పందాన్ని లోతుగా పరిశీలిస్తే, ఇది ఆర్థిక వ్యూహం కన్నా రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోయిన దౌత్య నిర్ణయంలా కనిపిస్తోంది. ముఖ్యంగా అదానీపై అమెరికా న్యాయస్థానం జారీ చేసిన వారెంట్, మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవణే పుస్తకం రేపిన వివాదాలు... ఇవి ఈ ఒప్పందాన్ని వేగవంతం చేసిన మౌన శక్తులుగా అనిపిస్తున్నాయి.
మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి "బలమైన నాయకత్వం", "స్వతంత్ర విదేశాంగ విధానం" అనే నినాదాలను పదే పదే వినిపిస్తోంది. కానీ వాస్తవ పరిస్థితి ఏమిటంటే ...ఈ ప్రభుత్వం అంతర్జాతీయంగా ఎదురయ్యే ప్రతి సంక్షోభంలోనూ పారదర్శకతకన్నా ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. గల్వాన్ సంఘటన తర్వాత చైనాతో జరిగిన సరిహద్దు ఉద్రిక్తతల విషయంలోనూ ఇదే ధోరణి కనిపించింది. "భారత భూభాగం ఎవరూ ఆక్రమించలేదు" అనే అధికారిక ప్రకటనలు ఒక వైపు, మరోవైపు సైనిక స్థాయిలో జరిగిన పరిణామాలు ...ఈ రెండింటి మధ్య ఉన్న విరుద్ధతను మాజీ ఆర్మీ చీఫ్ నరవణే తన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంలో స్పష్టంగా బయటపెట్టారు.
ఈ పుస్తకం వెలువడిన వెంటనే ప్రభుత్వం అసహనానికి లోనైంది. సైనికాధికారులే వాస్తవాలను బయటపెడితే, "జాతీయ భద్రత" అనే ముసుగులో దాచిపెట్టిన అబద్ధాలు బహిర్గతమవుతాయన్న భయం సహజమే. 'కార్ వాన్' పత్రికలో వచ్చిన ఈ అంశంపై కథనాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చదవడానికి ప్రయత్నించిన సందర్భంలో జరిగిన రాజకీయ రభస, ఈ ప్రభుత్వం నిజాలను ఎదుర్కొనే ధైర్యం కోల్పోయిందన్న భావనను మరింత బలపరిచింది. ఒక ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రశ్నించడం నేరం కాదు. కానీ బీజేపీ పాలనలో ప్రశ్నే ఒక ప్రమాదంగా మారింది.
ఇలాంటి పరిస్థితుల్లోనే అంతర్జాతీయంగా మరో పెద్ద సంక్షోభం తెరపైకి వచ్చింది. అదానీ గ్రూప్‌పై అమెరికా న్యాయవ్యవస్థ జారీ చేసిన వారెంట్. ఇది కేవలం ఒక కార్పొరేట్ కేసుగా మాత్రమే చూడలేని అంశం. ఎందుకంటే, అదానీ గ్రూప్ మోదీ ప్రభుత్వానికి రాజకీయంగా, ఆర్థికంగా అత్యంత సన్నిహితమైన కార్పొరేట్ శక్తి. విమానాశ్రయాల నుంచి పోర్టుల వరకు, విద్యుత్ నుంచి రక్షణ రంగం వరకు... దేశ కీలక మౌలిక సదుపాయాల్లో అదానీ పాత్ర ఉంది. అలాంటి సంస్థపై అమెరికాలో న్యాయపరమైన చర్యలు మొదలవడం, అంతర్జాతీయంగా భారత్ ప్రభుత్వ ప్రతిష్ఠపై కూడా ప్రభావం చూపుతుంది.
ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. ఈ నేపథ్యంలోనే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం అంత వేగంగా కుదిరిందా? అమెరికా న్యాయవ్యవస్థలో నడుస్తున్న కేసుల నుంచి రాజకీయ ఒత్తిళ్లను తగ్గించుకోవడానికి, వాణిజ్య ఒప్పందాన్ని ఒక "సాఫ్ట్ డిప్లొమసీ" ఆయుధంగా ఉపయోగించారా? అన్న సందేహం అప్రాసంగికం కాదు. ఎందుకంటే, అమెరికా--భారత్ సంబంధాలు ఎప్పుడూ కేవలం ఆర్థిక ప్రయోజనాలపైనే ఆధారపడలేదు. అవి వ్యూహాత్మక అవసరాలు, గ్లోబల్ పవర్ గేమ్స్‌తో ముడిపడి ఉంటాయి.
ఇటీవల వెలుగులోకి వచ్చిన "ఎఫ్ స్టీన్ ఫైల్స్" వంటి అంతర్జాతీయ వివాదాలు కూడా అమెరికా రాజకీయ వ్యవస్థను ఇబ్బందుల్లోకి నెట్టాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శక్తివంతుల పేర్లు ఈ కేసుల్లో ప్రస్తావనకు రావడం వల్ల, అమెరికా తన మిత్రదేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎదురైంది. ఈ క్రమంలో చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను నిలబెట్టడం అమెరికా వ్యూహాత్మక లక్ష్యం. కానీ ఈ లక్ష్యాన్ని సాధించేందుకు భారత్ ఎంతవరకు తన స్వతంత్రతను త్యాగం చేసింది అన్నదే అసలు ప్రశ్న.
మోదీ ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని "దేశానికి లాభం"గా ప్రచారం చేస్తున్నప్పటికీ, దాని నిబంధనలు, దీర్ఘకాల ప్రభావాలపై పార్లమెంట్‌లో గానీ, ప్రజల మధ్య గానీ విస్తృత చర్చ జరగలేదు. ఇది బీజేపీ పాలనకు అలవాటైన పద్ధతే. పెద్ద నిర్ణయాలు .."నోట్ల రద్దు నుంచి వ్యవసాయ చట్టాల" వరకు ముందుగా తీసుకుని, తరువాత ప్రజలను నమ్మించడానికి ప్రయత్నించడం. వాణిజ్య ఒప్పందాల విషయంలోనూ ఇదే పద్ధతి కొనసాగుతోంది.
ఈ ఒప్పందం నిజంగా భారత చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, భారతీయ వ్యవసాయ తదితర ఉత్పత్తులకు మేలు చేస్తుందా? లేదా బహుళజాతి సంస్థలు, దేశీయ కార్పొరేట్ దిగ్గజాలకు మాత్రమే లాభాలు చేకూరుస్తుందా? అన్న ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానాలు లేవు. కానీ గత అనుభవాలు చూస్తే, బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాలను జాతీయ ప్రయోజనాలుగా చిత్రీకరించడంలో దిట్ట అన్న విషయం తెలిసిందే.
చివరికి ఈ మొత్తం వ్యవహారం ఒక స్పష్టమైన చిత్రాన్ని చూపుతోంది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం అనేది కేవలం ఆర్థిక అభివృద్ధి కథ కాదు. ఇది అదానీపై ఉన్న న్యాయపరమైన ఒత్తిళ్లు, నరవణే పుస్తకం ద్వారా బయటపడుతున్న అసౌకర్యకరమైన నిజాలు, అంతర్జాతీయంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు - ఇవన్నిటి మధ్య తీసుకున్న ఒక రాజకీయ రాజీ నిర్ణయం. దీన్ని "విజయం"గా ప్రకటించడం కంటే, మరింత పారదర్శకంగా, బాధ్యతతో ప్రజల ముందు పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.
లేనిపక్షంలో, ఈ ఒప్పందం కూడా మోదీ ప్రభుత్వ పాలనలోని అనేక నిర్ణయాల్లాగే ... ఘనమైన ప్రచారంతో మొదలై, కాలక్రమంలో తీవ్రమైన ప్రశ్నల మధ్య నిలిచిపోయే మరో ఉదాహరణగా చరిత్రలో మిగిలిపోతుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## ఎక్స్‌లో కేటీఆర్

**మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో**
**రేవంత్ రెడ్డి నోట్లో నుంచి**
**పాలసీలు రావు...**
**పథకాలు వినిపించవు...**
**వచ్చేది ఒక్కటే-మురికిభాష.**
**హార్వర్డ్‌లో**
**5 రోజులు కాదు,**
**500 రోజులు కోర్సులు చేసినా**
**సంస్కారం నేర్చుకోకపోతే**
**కుక్కతోక ఎప్పటికీ వంకరే.**
**తెలంగాణ కోసం ప్రాణాలు పెట్టి,**
**ఉద్యమాల్ని నడిపి,**
**రాష్ట్రాన్ని సాధించి,**
**తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా**
**బంగారు తెలంగాణకు బాటలు వేసిన**
**కేసీఆర్ గారిపై**
**మురికిమాటలు మాట్లాడే నీ స్థానం మురికి కాలువే...**
**పాలనలో చేతకాని వాడే**
**ప్రచారంలో విషం చిమ్ముతాడు.**
**అది అహంకార లక్షణం కాదు...**
**నీ పూర్తి అసమర్థతకు గుర్తు.**
**చరిత్రను సృష్టించిన నాయకుడిని**
**మాటలతో తక్కువ చేయలేరు.**
**మురికిబాష మాట్లాడేవాడు**
**తన మానసిక దరిద్రతనే**
**ప్రజల ముందు బహిర్గతం చేస్తాడు.**
**కనకపు సింహాసనంపై**
**శునకాన్ని కూర్చోబెడితే**
**అది రాజవదు...**
**అది సింహాసనానికే అవమానం.**
**రాష్ట్రాన్ని సాధించినవాళ్లపై,**
**రాష్ట్రాన్ని దారిలో పెట్టినవాళ్లపై**
**నోరు విప్పే నైతిక హక్కు**
**నీకు లేదు రేవంత్.**
**చివరికి ఒకటే గుర్తుపెట్టుకో...**
**కేసీఆర్ గారి చరిత్రను**
**నీ మాటలు మసకబార్చలేవు.**
**కానీ నీ స్థాయిని మాత్రం**
**నీ మాటలే**
**తెలంగాణ ప్రజలకు**
**రోజురోజుకీ మరింత స్పష్టంగా**
**చూపిస్తున్నాయి.**

# తెలంగాణ భోజన విస్తరిపై - ఆంధ్ర కోనసీమ అరిటాకు ప్రభావం

"మోతుకు ఆకు ఆధారిత ప్రాచీన ఆహార సంస్కృతి క్రమంగా అంతరించిపోతున్న సామాజిక-ఆర్థిక అధ్యయనం"
తెలంగాణ ప్రాంతపు ప్రజాజీవితంలో "మోతుకు ఆకు" అనే పదం ఒక సాధారణ వృక్షపు ఆకుకే పరిమితం కాదు. ఇది తరతరాలుగా కొనసాగిన భోజన సంప్రదాయానికి, ఆరోగ్య చైతన్యానికి, గ్రామీణ స్వావలంబనకు ప్రతిరూపంగా నిలిచిన పదం. అడవుల్లో, పొలాల అంచుల్లో, చెరువుల పరిసరాల్లో సహజంగా పెరిగే మోతుకు చెట్టునుంచి లభించే ఈ ఆకును శుభ్రపరచి, ఎండబెట్టి, చేతితో కుట్టి విస్తరిగా తయారుచేయడం తెలంగాణ ప్రజల జీవన నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది.
మోతుకు ఆకుతో చేసిన ఇస్తారా విస్తరిలో భోజనం చేయడం ఆరోగ్యపరంగా మేలైన అలవాటుగా పెద్దలు భావించారు. ఈ ఆకులో సహజ ఔషధ గుణాలు ఉండటంతో జీర్ణక్రియ సవ్యంగా సాగుతుందని, శరీరానికి హాని కలిగించే పదార్థాలు ఆహారంలోకి చేరకుండా అడ్డుకుంటుందని గ్రామీణ అనుభవ జ్ఞానం చెబుతుంది. అందుకే శుభకార్యాలు, పండుగలు, సామూహిక విందులు జరిగే సందర్భాలలో మోతుకు ఆకు విస్తరి అనివార్యంగా ఉపయోగించబడింది.
ఈ పదం మరో ముఖ్యమైన అర్థాన్ని కూడా కలిగి ఉంది. పేదరికం, సంపద అనే తేడా లేకుండా అందరూ ఒకే విస్తరిలో భోజనం చేయాలనే సమానత్వ భావనకు ఇది ప్రతీక. బంతి భోజనంలో మోతుకు ఆకు విస్తరి పరచడం ద్వారా సామాజిక సమతుల్యత వ్యక్తమయ్యేది. అదే సమయంలో ఈ ఆకుల సేకరణ, విస్తరి తయారీ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి కల్పించే కుటీర పరిశ్రమగా పనిచేసింది.
కాలక్రమంలో వాణిజ్య ఉత్పత్తులు, బయట ప్రాంతాల నుంచి వచ్చిన విస్తరుల ప్రభావంతో "మోతుకు ఆకు" అనే పదం వినియోగంలో తగ్గిపోతోంది. అయినప్పటికీ ఈ పదం తెలంగాణ ప్రజల జ్ఞాపకాలలో ఒక జీవంతమైన సాంస్కృతిక గుర్తింపుగా నిలిచిపోయింది. మోతుకు ఆకు అంటే కేవలం ఆకే కాదు. అది ఒక జీవన విధానం, ఒక ఆరోగ్య తత్వం, ఒక స్వదేశీ ఆర్థిక ఆలోచనకు సంకేతం.
1. తెలంగాణ ప్రాంతపు ఆహార సంస్కృతి ఒక సాధారణ తిండి అలవాటు కాదు. జీవన విధానం, ఆరోగ్య అవగాహన, గ్రామీణ ఉపాధి, సామాజిక సమానత్వానికి సంబంధించిన సమగ్ర వ్యవస్థ. శుభకార్యాలు, పండుగలు, విందులు, బంతి భోజనాల సందర్భాలలో ఉపయోగించే విస్తరి తెలంగాణ ప్రజల ఆలోచనా ధోరణిని ప్రతిబింబిస్తుంది. ప్రాచీన కాలం నుండి తెలంగాణలో విస్తృతంగా లభించే మోతుకు ఆకు తో తయారైన ఇస్తారా విస్తరి ఈ సంస్కృతికి ప్రధాన ఆధారం.
2000 తరువాత కాలంలో ఆంధ్ర ప్రాంతంలోని కోనసీమ నుండి దిగుమతయ్యే అరిటాకుల విస్తరి తెలంగాణ భోజన వ్యవస్థలో వేగంగా ప్రవేశించింది. ఫలితంగా తరతరాలుగా కొనసాగిన మోతుకు ఆకు ఆధారిత విస్తరి వినియోగం క్రమంగా కనుమరుగవుతున్నది.
2. మోతుకు ఆకు -- అర్థ విస్తరణ గద్య విశ్లేషణ
తెలంగాణ ప్రజాజీవితంలో "మోతుకు ఆకు" అనే పదం ఒక వృక్షపు ఆకుకే పరిమితం కాదు. ఇది భోజన సంప్రదాయం, ఆరోగ్య తత్వం, గ్రామీణ స్వావలంబనకు ప్రతీకగా నిలిచింది. అడవుల్లో, పొలాల అంచుల్లో, చెరువుల పరిసరాల్లో సహజంగా పెరిగే మోతుకు చెట్టునుంచి లభించే ఆకులను శుభ్రపరచి, ఎండబెట్టి, చేతితో కుట్టి విస్తరిగా తయారుచేయడం గ్రామీణ ప్రజల నైపుణ్యానికి ఉదాహరణ.
ఈ ఆకులో సహజ ఔషధ గుణాలు ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుందని, శరీరానికి హానికరమైన పదార్థాలు



ఆహారంలోకి ప్రవేశించకుండా అడ్డుకట్ట పడుతుందని పూర్వీకుల అనుభవ జ్ఞానం చెబుతుంది. అందుకే సామూహిక భోజనాలు మోతుకు ఆకు విస్తరిలో వడ్డించటం ఒక ఆరోగ్యపరమైన అలవాటుగా స్థిరపడింది.
మోతుకు ఆకు మరో ముఖ్య భావనను సూచిస్తుంది. పేదరికం, సంపద అనే తేడా లేకుండా అందరూ ఒకే విస్తరిలో భోజనం చేయాలనే సమానత్వ దృక్పథం. బంతి భోజనంలో ఈ విస్తరి పరచడం ద్వారా సామాజిక సమతుల్యత వ్యక్తమయ్యేది. అదే సమయంలో మోతుకు ఆకుల సేకరణ, ఇస్తారా తయారీ గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించిన కుటీర పరిశ్రమగా పనిచేసింది.

**3. చారిత్రక నేపథ్యం**

పరిశోధకుల అంచనాల ప్రకారం తెలంగాణలో మోతుకు ఆకు విస్తరి వినియోగం కనీసం 500 సంవత్సరాలు కొనసాగింది. గ్రామీణ సమాజంలో ప్రతి శుభకార్యానికి ఇది తప్పనిసరి అంశం. హోటళ్లలో కూడా ఇదే విస్తరి వినియోగం సాధారణంగా కనిపించేది.

**4. ఔషధ గుణాలు - శాస్త్రీయ దృష్టికోణం**

సామాజిక ఆరోగ్య అధ్యయనాల ప్రకారం మోతుకు ఆకులో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు గుర్తించబడ్డాయి. జీర్ణక్రియ సామర్థ్యం సుమారు 25%-30% వరకు మెరుగుపడే అవకాశం ఉంది. వేడి ఆహారంలో విషపదార్థాల శోషణ తగ్గే అవకాశం సుమారు 40%

**5. బంతి భోజనం - సమానత్వ సంస్కృతి**

తెలంగాణ బంతి భోజనం ఒక సామాజిక తత్వం. ఒకే వరుసలో, ఒకే విస్తరిలో, ఒకే ఆహారం. ఈ విధానంలో మోతుకు ఆకు విస్తరి కీలక పాత్ర పోషించింది. అరిటాకు ప్రవేశంతో ఈ సమానత్వ భావన స్థానంలో వాణిజ్య ఆలోచన బలపడింది.

**6. 1990-2025 మధ్య గణాంక మార్పులు**

1990లో మోతుకు ఆకు విస్తరి వినియోగం 85%
2000లో 60%
2010లో 25%
2025లో 5%
అరిటాకు విస్తరి వినియోగం
1990లో 10%
2000లో 35%
2010లో 70%
2025లో 92%
గ్రామీణ కుటీర ఉపాధి
1990లో 100%
2000లో 75%
2010లో 30%
2025లో 8%

**7. కోనసీమ అరిటాకుల ఆధిపత్యానికి కారణాలు**

భారీ స్థాయిలో వాణిజ్య ఉత్పత్తి
హోటల్ రంగంలో ఖర్చు తగ్గింపు లక్ష్యం
పట్టణ వినియోగదారుల దృశ్య ఆకర్షణ పట్ల ఆసక్తి
స్థానిక విస్తరులకు మార్కెట్ మద్దతు లేకపోవడం
2005 తరువాత తెలంగాణ హోటళ్లలో సుమారు 80% అరిటాకు వినియోగం నమోదైంది.
8. గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం
ఒక గ్రామంలో మోతుకు ఆకు విస్తరి తయారీ ద్వారా 20-30 కుటుంబాలు ఉపాధి పొందేవి.
2025 నాటికి ఈ ఉపాధి అవకాశాలు 90% వరకు క్షీణించాయి. మహిళల స్వయం ఉపాధి తీవ్రంగా దెబ్బతింది. స్థానిక వనరుల ఆర్థిక విలువ తగ్గింది.
9. పారిశ్రామిక ఉత్పత్తుల ప్రభావం
పేపర్ ప్లేట్లు, థర్మాకోల్ ఉత్పత్తులు, అరిటాకు విస్తరులు మార్కెట్‌ను ఆక్రమించాయి. ఇవి పర్యావరణానికి హానికరమైనవిగా గుర్తించబడ్డాయి. మోతుకు ఆకు విస్తరి పూర్తిగా జీవక్షయం అయ్యే సహజ ఉత్పత్తి.

**10. సంస్కృతి అంతరించిపోతున్న ప్రమాద సూచికలు**

ఆహార అలవాట్ల రూపాంతరం ఆరోగ్య పరమైన నష్టాలు
గ్రామీణ ఉపాధి సంక్షోభం స్థానిక జ్ఞాన వ్యవస్థల విచ్ఛిన్నం

**11. పునరుద్ధరణకు కార్యాచరణ సూచనలు**

మోతుకు ఆకు విస్తరి తయారీకి ప్రభుత్వ ప్రోత్సాహకాలు
మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణ మద్దతు
హోటళ్లలో కనీసం 30% స్థానిక విస్తరి వినియోగ నిబంధన
పాఠశాల భోజన పథకాలలో ప్రయోగాత్మక అమలు
ప్రజా అవగాహన కార్యక్రమాలు
మోతుకు ఆకు వినియోగం తగ్గిపోవడం వల్ల ఆరోగ్య పరమైన నష్టాలు కూడా కనిపిస్తున్నాయి. పూర్వీకుల అనుభవ జ్ఞానం ఆధారంగా ఏర్పడిన భోజన విధానం శరీరానికి అనుకూలంగా రూపుదిద్దుకుంది. సహజ ఆకులో వడ్డించిన ఆహారం శరీరానికి హాని కలిగించే పదార్థాల ప్రభావాన్ని తగ్గించేది. ఈ అలవాటు దూరమవటం ద్వారా ఆధునిక ఆహారపు ప్రమాదాలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇది భవిష్యత్తు తరాల ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అంశంగా మారవచ్చు.
గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పడిన ప్రభావం మరింత తీవ్రమైనది. మోతుకు ఆకు సేకరణ, ఇస్తారా తయారీ ఒకప్పుడు అనేక గ్రామాల్లో మహిళలకు స్థిరమైన ఉపాధిని అందించింది. ఇది పెట్టుబడి అవసరం లేకుండా సాగిన కుటీర పరిశ్రమ. ఈ వ్యవస్థ కూలిపోవడంతో గ్రామీణ మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతింది. ఉపాధి కోసం పట్టణాల వైపు వలసలు పెరిగే పరిస్థితి ఏర్పడింది. ఈ మార్పు గ్రామీణ సమాజ నిర్మాణానికే సవాల్ గా మారుతోంది.
కోనసీమ ప్రాంతం నుండి వచ్చే అరిటాకుల విస్తరి మార్కెట్ ను ఆక్రమించటం వెనుక వాణిజ్య శక్తులు పనిచేశాయి. పెద్ద ఎత్తున ఉత్పత్తి, సరఫరా సౌలభ్యం, ఖర్చు లెక్కలు ఈ మార్పుకు దారితీశాయి. కానీ ఈ వాణిజ్య విజయానికి మూల్యం తెలంగాణ స్థానిక సంస్కృతి చెల్లిస్తోంది. స్థానిక వనరుల విలువ తగ్గిపోవడం, స్థానిక జ్ఞాన వ్యవస్థలు నిర్లక్ష్యం పాలవటం ఈ మార్పు తెచ్చిన ప్రధాన పరిణామాలు.
మోతుకు ఆకు విస్తరి పునరాగమనమంటే గతాన్ని గౌరవించడం. అదే సమయంలో భవిష్యత్తును రక్షించుకోవడం. ఈ రెండు లక్ష్యాలు సాధించాలంటే సమాజం మొత్తం ఈ అంశాన్ని తన బాధ్యతగా భావించాలి. అప్పుడే తెలంగాణ భోజన విస్తరి తన ప్రాచీన గౌరవాన్ని తిరిగి పొందగలదు. అప్పుడే ఈ సంస్కృతి పుస్తకాల పుటలకే పరిమితం కాకుండా ప్రజల విస్తరిలో మళ్లీ జీవం పోసుకుంటుంది.

**ఆధునిక ప్లేట్ల వినియోగం:**

నేటి తెలంగాణ భోజన సంస్కృతిని పరిశీలిస్తే మోతుకు ఆకు విస్తరి తగ్గుదలతో పాటు ఆధునిక ప్లేట్ల వినియోగం వేగంగా పెరుగుతున్న దృశ్యం స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు భోజనం వడ్డించే విధానంలో గణనీయమైన మార్పు చోటు చేసుకుంది. ఒకప్పుడు ఆకులే భోజనానికి ఆధారం కాగా నేడు పేపర్ ప్లేట్లు, స్టీల్ ప్లేట్లు, పింగాణి ప్లేట్లు సాధారణంగా ఉపయోగంలోకి వచ్చాయి.

పట్టణ హోటళ్లలో స్టీల్ ప్లేట్లు ప్రామాణికంగా మారాయి. శుభ్రత, దీర్ఘకాలిక వినియోగం అనే కారణాలతో ఇవి విస్తృతంగా ఆమోదం పొందాయి. వివాహ వేడుకలు, ఫంక్షన్ హాల్స్ లో స్టీల్ ప్లేట్ల వినియోగం సుమారు 70% వరకు పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే ఈ ప్లేట్ల వినియోగం భోజనాన్ని ఒక యాంత్రిక ప్రక్రియగా మార్చేస్తున్న భావన కూడా బలపడుతోంది.
పింగాణి ప్లేట్లు మరో వైపు ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయి. సంపన్న వర్గాల విందులు, హోటల్ రెస్టారెంట్లు, అధికారిక సమావేశాలలో పింగాణి ప్లేట్లు గౌరవ సూచికగా ఉపయోగంలోకి వచ్చాయి. ఇది భోజనానికి ఆడంబరాన్ని జోడించినా, భోజన సంస్కృతిలో సమానత్వ భావనను తగ్గిస్తున్న అంశంగా మారుతోంది. ఒకే విందులో వేర్వేరు ప్లేట్లు కనిపించడం సామాజిక వ్యత్యాసాలను స్పష్టంగా చూపిస్తోంది.
పేపర్ ప్లేట్ల వినియోగం మరింత వేగంగా విస్తరిస్తోంది. తక్కువ ఖర్చు, ఒకసారి వాడి పారేసే సౌలభ్యం కారణంగా వీటి వినియోగం పెరిగింది. పండుగలు, రాజకీయ సమావేశాలు, సామూహిక కార్యక్రమాలలో పేపర్ ప్లేట్లు సుమారు 60% వరకు ఉపయోగంలో ఉన్నట్లు అంచనా. అయితే ఇవి పర్యావరణానికి కలిగించే నష్టం దీర్ఘకాలంలో తీవ్రమైన సమస్యగా మారుతోంది.
ఈ అన్ని ఆధునిక ప్లేట్ల వినియోగం ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతోంది. భోజనం అనేది ఇప్పుడు సంస్కృతి కంటే సౌలభ్యంపై ఆధారపడిన చర్యగా మారుతోంది. శుభ్రత, వేగం, ఖర్చు అనే అంశాలు ప్రధానంగా మారాయి. ఈ మార్పులో మోతుకు ఆకు విస్తరి వెనుకబడి పోతోంది.
స్టీల్ ప్లేట్లు ఆరోగ్యపరంగా సురక్షితంగా భావించినా, వాటితో భోజనం చేసే అనుభూతి సహజత్వాన్ని కోల్పోతుంది. పింగాణి ప్లేట్లు ఆహారాన్ని విలాసవంతంగా చూపించినా, ఆహారానికి భూమితో ఉన్న అనుబంధాన్ని తెంచేస్తాయి. పేపర్ ప్లేట్లు తాత్కాలిక పరిష్కారంగా కనిపించినా, వ్యర్థాల సమస్యను పెంచుతున్నాయి.
ఈ సమతుల్యత సాధించినప్పుడే తెలంగాణ భోజన సంస్కృతి సంపూర్ణంగా నిలబడుతుంది. మోతుకు ఆకు విస్తరి ఆధునిక ప్లేట్ల మధ్య తన స్థానం తిరిగి పొందిన రోజు తెలంగాణ తన మూలాలను తిరిగి గుర్తించిన రోజుగా చరిత్రలో నిలుస్తుంది. ఈ దిశగా ఇప్పుడే అడుగులు వేయడం కాలానికి తగిన అవసరంగా మారింది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# అర్హత లేని వైద్యులు స్కానింగ్ చేస్తే చర్యలు తప్పవు

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** జిల్లాలో అర్హత లేని వైద్యులు స్కానింగ్ చేస్తే పిసిపి ఎన్ డి టి యాక్ట్ ప్రకారం శిక్షార్హులు అవుతారని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధ్యక్షతన జిల్లాస్థాయి బహుళ సభ్య అప్రా ప్రియేట్ అథారిటీ కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ స్కానింగ్ సెంటర్ ను సందర్శించి అన్నీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్ కు సూచించారు. అర్హత లేని డాక్టర్స్ స్కానింగ్ చేయరాదని, ఒకవేళ చేస్తే జైలు శిక్ష తప్పదని ఆమె హెచ్చరించారు. జిల్లాలో తక్కువ జెండర్ రేషియో( నిష్పత్తి) ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి (0-6 ఇయర్స్ ) జెండర్ రేషియో పెంచాలని సూచించారు. మూడేళ్ల క్రితం ఎక్కువ ఉన్న రేషియో ఈ ఏడాది తక్కువ కావడంపై కలెక్టర్ ఆశ్చర్యం వ్యక్తం




చేస్తు, కారణాలను విశ్లేషించాలని, గర్భిణి లు రెండోసారి స్కానింగ్ తర్వాత మళ్ళీ స్కానింగ్ కు రాక పోతే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. అంతకుముందు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ (0-6 సంవత్సరాలు జెండర్ రేషియో గురించి మండలాల వారీగా వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులను తరచూ తనిఖీ చేసి రికార్డులను పరిశీలిస్తానని కలెక్టర్ కు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ డా.వినీత్ కుమార్ గత మూడు సంవత్సరాలుగా జెండర్ రేషియో ఎలా ఉందని ప్రశ్నించారు. 2024-25(955/1000) సంవత్సరంతో పోలిస్తే జెండర్ రేషియో 2025-2026(927/1000)సంవత్సరంలో తగ్గిందని, అందువలన జిల్లాలో ఎక్కువగా అబార్షన్స్ జరిగే హాస్పిటల్స్ మీద ప్రత్యేక నిఘా పెట్టి పరిశీలించాలని సూచించారు. మరీ ముఖ్యంగా ఇద్దరు ఆడపిల్లలు ఉన్న గర్భిణీల పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శైలజ మాట్లాడుతూ. జిల్లాలో ఉన్న ప్రతి స్కానింగ్ సెంటర్ లో ప్రతినెలా 10 ఫామ్ ఫ్ లను ఆడిట్ చేస్తున్నామని అందులో ప్రతిదీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని ఫామ్ - ఫ్ ఆన్ లైన్ లో అప్ లోడ్ అయ్యేలా చూస్తున్నామని వివరించారు. ఒకవేళ ఎవరైనా వీటిని ఉల్లంఘిస్తే నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు ఎన్ లింగయ్య, ఐఎంఏ ప్రెసిడెంట్ మల్లికార్జున్, సీ. ఐ. శివ శంకర్ పాల్గొన్నారు.

## కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి




**హయత్‌నగర్, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు సిఐటియు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కీసర నర్సిరెడ్డి ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందచేశారు. ఈ సందర్భంగా కీసర నర్సిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, నూతన విద్యుత్ బిల్లును ఉపసంహరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు హయత్ నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య, జిహెచ్ఎంసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య, ట్రాన్స్ పోర్ట్ జిల్లా అధ్యక్షులు ముషం నరహరి, రమావత్ శక్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మౌలిక వసతుల్లో అలసత్వం వహించొద్దు

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) :** ప్రజల మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి ఆలసత్వం వహించవద్దని అధికారులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదేశించారు. బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ డివిజన్‌లో ఆయన విస్తృతంగా పర్యటించారు. శ్రీరామ్ నగర్ కాలనీ, వెంకటేశ్వర నగర్, నేతాజీ నగర్ బస్తీల్లో పర్యటించిన ఎమ్మెల్యే, స్థానికుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, మురుగునీరు నిలిచిపోకుండా డ్రైనేజీ పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టాలని, వేసవిలో నీటి ఎద్దడి లేకుండా క్రమబద్ధమైన తాగునీటి సరఫరా అందించాలని ఆదేశించారు. అలాగే పాడైపోయిన అంతర్గత రోడ్లకు తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజల ముంగిటకే పాలన అందించడమే మా లక్ష్యం. శ్రీరామ్ నగర్, వెంకటేశ్వర నగర్, నేతాజీ నగర్ ప్రాంతాలను ఆదర్శ బస్తీలుగా అభివృద్ధి చేస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వాటర్ వర్క్స్ ఏఈలు, డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ, టి. ప్రేమ్ గౌడ్, కృష్ణ గౌడ్, మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్, దత్తు, జైపాల్ స్వామి గౌడ్, సోమా శ్రీనివాస్, కుమార్ యాదవ్, డాక్టర్ కృష్ణ, గోపి, సోమ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## మందు అమ్మితే లక్ష దండగ

- మందు కొంటె 10 వేల జరిమానా
- మందు పట్టిస్తే 5వేల నజరానా
- మల్లికార్జునగిరిలో బెల్టు తీసివేత



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** మద్యపానియం హానికరం అంటూ ప్రకటన చేస్తూ ప్రజలకు మద్యం అమ్మే కంపెనీలు. ప్రభుత్వానికి ఒక్క మహిళా సర్పంచ్ తీసుకున్న ఖతర్నాక్ నిర్ణయం చెంపపెట్టు లాంటిది. తాగుడు ఊగుడు ఎగురుడుకు చెక్ పెట్టాలని గ్రామస్తులతో కలిసి సమిష్టి నిర్ణయం తీసుకున్నారు. తాగి ఇల్లు గుల్ల చేయడమే కాకుండా పచ్చని కాపురంలో చిచ్చు రగిలించి విషం చిమ్మే మద్యపానీయాన్ని గ్రామంలో శాశ్వతంగా నిషేధించే నిర్ణయం గ్రామస్తులచే తీర్మానం చేయించారు. నేటి నుంచి గ్రామంలో అధికార సంపూర్ణ మద్యపాన నిషేధం అమలులో ఉంటుంది. సాటి మహిళల కన్నీళ్లు తుడిచే మేటి మహిళా సర్పంచ్ గా సాహసమైన నిర్ణయం నూతన మహిళ సర్పంచ్ తీసుకుంది. ఏ ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో మద్యపాన నిషేధం పై చర్యలు తీసుకున్న దాఖలాలు లేని కారణంగా గ్రామస్తుల జీవితాల్లో వెలుగు నింపే బృహత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వివరాల్లోకి వెళితే. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం మల్లికార్జునగిరి గ్రామపంచాయతీలో నేటి నుంచి సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని గ్రామ మహిళ సర్పంచ్ పట్నం భాగ్య అశోక్ గ్రామస్తులచే తీర్మానం చేయించారు. చిన్న గ్రామపంచాయతీలో మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకొని అనధికారికంగా దర్జాగా ఇప్పటివరకు మద్యం అమ్మకాలు సాగించారు. మద్యం తాగి యువకులు గొడవలు చేసుకోవడమే కాకుండా పచ్చని కాపురాల్లో చిచ్చు రగిలించుకుంటున్నారు. సాయంత్రం అయితే చాలు తాగుడు ఊగుడు ఎగురుడు వంటి సంఘటనలు జరగడంతో విసుగెత్తిన మహిళలంతా సర్పంచ్ దగ్గరకు వెళ్లి తమ గోడు వినిపించారు. దీంతో గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని గ్రామపంచాయతీలో తీర్మానం చేసి గ్రామస్తులు బహిరంగ ప్రదేశంలో మద్యపాన నిషేధంపై ప్రమాణం చేయించారు. అంతేకాకుండా గ్రామంలో ఉన్న బెల్టు షాపులన్నీ వెంటనే మూసివేయాలని నిర్ణయించారు. గ్రామంలో ఎవరైనా మద్యపానియాన్ని దొంగచాటుగా బెల్ట్ షాపుల్లో అమ్మితే లక్ష రూపాయల దండగ వేయాలని గ్రామస్తులు తీర్మానించారు. అంతేకాకుండా గ్రామంలో ఎవరైనా ఎక్కడ నుంచైనా మద్యాన్ని కొనుగోలు చేస్తే పదివేల జరిమానా విధించాలని నిర్ణయించారు. ఎవరికి తెలియకుండా ఎవరైనా మద్యం విక్రయిస్తే సమాచారం అందించిన వారికి 5000 నజరాను ప్రకటించారు. దీంతో నేటి నుంచి గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమల్లోకి వచ్చింది. కొత్తగా మహిళ సర్పంచ్ గా బాధ్యత చేపట్టిన పట్నం భాగ్య అశోక్ సాటి మహిళల కష్టాలను గుర్తించి మద్యపాన నిషేధం కోసం ఖతర్నాక్ నిర్ణయం తీసుకోవడంతో గ్రామంలోని మహిళలంతా హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పురుషులంతా మహిళా సర్పంచ్ కి మద్దతుగా నిలవడం విశేషం.. ప్రతి గ్రామంలో నూతన సర్పంచ్ లు తమ గ్రామాల్లో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తే దుబారా ఖర్చు తగ్గి కొన్ని కుటుంబాలు బాగుపడతాయని ఆర్థికంగా పరిపుష్టి అవుతాయని మల్లికార్జున గిరిని అందరు సర్పంచ్ లు ఆదర్శంగా తీసుకొని అమరు చేస్తారని ఆశిద్దాం..

## దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** దాసారం గుడిసె వాసులపై దాడులకు పాల్పడి న వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సనత్ నగర్ లోని దాసారం బస్తీ గుడిసె వాసులపై ప్రయివేట్ వ్యక్తులు దాడి చేసిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించి ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకో వాలని ఎస్సార్ నగర్ సీఐ శ్రీనివాస్ రెడ్డి ని ఆయన ఆదేశించారు. గత 30 సంవత్సరాల నుండి ఇక్కడే గుడిసె లు వేసుకొని జీవనం సాగిస్తున్న వీరిని ఇక్కడి నుండి ఖాళీ చేయించి ఈ స్థలాన్ని ఆక్రమించాలని కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తూ వస్తున్నారని వివరించారు. గుడిసె వాసులను ఖాళీ చేయించేందుకు భయ బ్రాంతులకు గురిచేసిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. గుడిసె వాసుల జోలికి వెళ్లవద్దని ఇటీ వల కోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ పేపర్ ను సీఐకి అందజేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, సనత్ నగర్ డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## టీజీ-ఐపాస్ ద్వారా పరిశ్ర మల స్థాపనకు అనుమతులు




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** టీజీ-ఐపాస్ ద్వారా పరిశ్రమ ల స్థాపనకు నిబంధనల మేర కు అనుమతులు జారీ చేయా లని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తెలిపారు. బుధ వారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా పెట్టు బడుల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ శ్రీను నిర్వహించారు. ఈ సమావేశంలో టీజీ-ఐపాస్ కింద పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతులు, వివిధ శాఖల వద్ద ఉన్న దరఖాస్తులకు అనుమతు లను పరిశీలించి సకాలంలో ఆమోదించాలన్నారు. టీ-ప్రైడ్ కింద ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల కేటగిరి అభ్య ర్థులకు 50 పరిశ్రమలకు దరఖాస్తులు చేసుకోగా 36 యూనిట్లకు సబ్సిడీ మంజూ రు చేశామని తెలిపారు. అదే విధంగా జిల్లా కమిటీ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సంబంధిత శాఖల అధికా రులతో సమావేశం నిర్వ హించారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనలో నిరు ద్యోగులకు డిజిల్ ఎంప్లాయి మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ తకు ని రంతర ఉపాధి అవ కాశాలను కల్పించేందుకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఎక్స్ఛేం జ్ ఆఫ్ తెలంగాణను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. జిల్లాలో ఉన్న ఐటీఐ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాసైన విద్యార్థు ల వివరాలను డీఈఈటీలో నమోదయ్యే లా చూడాల న్నారు. ఈ యాప్ గురించి విస్తృత అవగాహన కల్పిం చాలని అధికారులకు సూచిం చారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ రామ లింగేశ్వర్ గౌడ్, పి.నర సింహ రావు ఐ.పి.ఓ., తెలం గాణ స్టేట్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మేనేజర్ నవీన్, కుమార్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, ఆర్టీవో మేఘా గాంధీ, ఉద్యా న శాఖ అధికారి సాయి బాబా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధి కారి తదితరులు పాల్గొన్నారు.

## వివక్ష లేని సమాజం కోసం భాగస్వాములవుదాం




**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** సామాజిక న్యాయం, వివక్ష లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేటులోని సమావేశ మందిరంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ సామాజికపరంగా, వివక్షతో కూడిన సమాజంలో మార్పు రావాలన్న సదుద్దేశంతో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీన తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ సమానత్వం, న్యాయం, గౌరవం కోసం నిలబడాలని, ఏ రూపంలోనైనా అన్యాయని ఎప్పుడూ సమర్థించవద్దని కలెక్టర్ సూచించారు. భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ ఎన్నో విలువలతో కూడిన రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగిందని, రాజ్యాంగ సూత్రాలను సమర్థిస్తూ న్యాయమైన, సామరస్య పూర్వకమైన, సాధికారత కలిగిన తెలంగాణ భారతదేశ కోసం కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రమేష్, జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి, డిఆర్ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసు చంద్ర, డిబిసిడిఓ మాధవ రెడ్డి లతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆద్యంతం ఆసక్తికరం అగ్ లూమినా కార్యక్రమం



**ఖైరతాబాద్, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** అగ్ లూమినా -ప్రతిభను ప్రకాశింపజేస్తూ, గొప్పదనాన్ని చాటుకుంటూ థీమ్‌తో హస్తినాపురంలోని జీఎస్ ఆర్ కన్వెన్షన్స్ లో రెండు రోజుల పాటు ఈ కార్య క్రమం గ్రాండ్ గా జరిగింది. రెండు రోజుల అగ్ లూ మినా సిల్వర్ జూబ్లీ సాంస్కృతిక ఉత్సవం అత్యం త వైభవంగా ముగిసింది. పాతికేళ్ల ప్రయాణం, వే లాది మందికి విద్యా బుద్ధులు నేర్పి వాళ్లను తీర్చి దిద్దిన ప్రస్తానం, ఇదీ హైదరాబాద్ మలక్ పేట్ లోని సెయింట్ జోసెఫ్ స్కూల్ గొప్పదనం అన్నారు. ఈ శుభ తరుణాన్ని పురస్కరించుని, సిల్వర్ జూబ్లీ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. విద్యా రంగంలో 25 ఏళ్లుగా సెయింట్ జోసెఫ్ స్కూల్ అందిస్తున్న సేవలను ఈ వేడుకలు ప్రతిబింబించా యని అన్నారు. పాతికేళ్ల పాఠశాల ప్రస్థానాన్ని కళ్ళకు కట్టాయి. 9వ తరగతి విద్యార్థులు ప్రదర్శిం చిన 'ఏ విజన్ దట్ బికేమ్ ఎ లెగసీ' అనే నృత్యనా టిక విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఐసీఎస్ఈ-25 బోర్డు పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి, ఏపీ, తెలంగాణ ప్రాంతాల ప్రిన్సిపల్ చీఫ్ కమిషన ర్ ఆఫ్ ఇన్ కమ్ ట్యాక్స్ ఎం.అనిల్ కుమార్ ఐఆర్ఎస్, తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొ.డా.వి.బాలకిష్టా రెడ్డి, ఏపీ ప్రభుత్వ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ, ఐఏఎస్ అధికారి ధాత్రి రెడ్డి, ప్రిన్సిపాల్ యూ.ఏ.సుందరి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం స్వాధీనం

- ఎన్నికల తనిఖీల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ చర్యలు




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) :** మున్సిపల్ సాధారణ ఎన్నికలు--2026 నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికల నియమావళి అమలులో భాగంగా అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని రావల్ కోల్ గ్రామంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం అక్రమ మద్యం నిల్వలను స్వాధీనం చేసుకుంది. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కె. సాయి కుమార్ (తండ్రి పాండు) ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 12.72 లీటర్ల మద్యం గుర్తించారు. అనంతరం మద్యం ను స్వాధీనం చేసుకుని పోలీసు అధికారుల సమక్షంలో ఎల్లంపేట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సై మన్మథ కొనారికి అప్పగించారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం, డబ్బు పంపిణీపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేస్తామని, ఎవరైనా ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతాం

- జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే మెదకు అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపుతామని జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం మెదక్, రామయంపేట పట్టణంలోని కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని తెలిపారు. మిషన్ భగీరథ పేరుతో గత ప్రభుత్వం రూ.65 వేల కోట్లను మింగిందని విమర్శించారు. ప్రజలకు మంచి భోజనం అందాలనే ఉద్దేశంతో సన్న బియ్యం అందిస్తున్నామని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. అర్హులైన వారందరికీ పెన్షన్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మెదక్ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మెడికల్ కాలేజీ ద్వారా స్థానిక విద్యార్థులు డాక్టర్లుగా మారాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ అభ్యర్థులు నరేష్, లక్ష్మిలను చేయి గుర్తుపై ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లపాటు ఇళు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందించామని చెప్పారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో రేషన్ కార్డులు ఇచ్చిందన్నారు. ఇచ్చిన కార్డుల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూసే ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి భయంతో గత ప్రభుత్వం రైతు బంధు అమలు చేసిందన్నారు. గతంలో నియోజకవర్గానికి రూ.2000 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. అనంతరం మెదక్ ఎమ్మెల్య మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ఏడుపాయల ప్రాంతానికి గతంలో ఏ సీఎం రాలేదని, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి రూ.35 కోట్ల



అభివృద్ధి నిధులు ఇచ్చారని చెప్పారు. మెదక్ చర్చికి గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, సీఎం రేవంత్ రెడ్డి రూ.29.30 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. వరదల సమయంలో ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టిందని, బాధితులకు పరిహారం అందించిందన్నారు. సీఎం రేవంత్‌కు అభివృద్ధి చేయాలనే కసి ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పట్టణాల అభివృద్ధి చెందాలంటే కేవలం కాంగ్రెస్ హయాంలోనే సాధ్యమైన విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మాజీ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

● జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పష్టం చేశారు. ఆర్ అండ్ బి, నేషనల్ హైవే ,పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ ( ప్రమాదకర ప్రదేశాలు) లో ఇకపై ప్రమాదాలు జరగకుండా రోడ్ సేఫ్టీ ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నారాయణపేట నియోజక వర్గ పరిధిలోని ప్రమాదకర ప్రదేశాల్లో అర్ అండ్ బీ అధికారులు, మక్తల్ నియోజకవర్గంలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన కార్యాచరణ ప్రణాళిక లు రూపొందించుకొని నెల రోజులలో ఆయా బ్లాక్ స్పాట్ లలో ప్రమాద నివారణనే లక్ష్యంగా సాగాలన్నారు.సమావేశంలో ఆర్ అండ్ బీ అధికారులు పోలీసు శాఖతో కలిసి జిల్లాలోని బ్లాక్ స్పాట్ ల వద్ద ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను జిల్లా కలెక్టర్,ఎస్పీలకు చూపించారు.పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు సూచించిన ప్రమాద నియంత్రికలను ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు తెలిపారు.అలాగే పోలీసు శాఖ తరపున డీఎస్పీ నల్లపు లింగయ్య కూడా పవర్



పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో గడచిన మూడేళ్లలో (2023 నుంచి 2025 వరకు) జిల్లాలో గుర్తించిన 10 బ్లాక్ స్పాట్ ( నారాయణపేట ,మక్తల్, మరికల్ లో )మొత్తం 101 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ఆయా ప్రమాదాలలో 64 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందని కలెక్టర్, ఎస్పీకి వెల్లడించారు.ఇకపై నారాయణపేట పట్టణం, మక్తల్, మరికల్ పట్టణాలతో పాటు ఆయా సర్కిల్ లలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు, ప్రమాద నియంత్రికల ఏర్పాటు కు ఆర్ అండ్ బీ, ఎన్. హెచ్ అధికారుల సహకారం తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. కోస్గి, మద్దూరు పట్టణాలలో బ్లాక్ స్పాట్స్ ఏమీ లేవని, కానీ సర్కిల్ పరిధిలో కొన్ని ఉన్నాయని అక్కడ కూడా ప్రమాద నివారణకు అవసరమైన అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..ఆర్ అండ్ బీ, పోలీసు శాఖలు చూపించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను అభినందిస్తూ.. అందుకు అనుగుణంగా ప్రమాదాల నివారణకు సమన్వయంతో కలిసి పనిచేయాలని, బ్లాక్ స్పాట్ లే కాకుండా ఇతర పట్టణ, సర్కిల్ ప్రాంతాలలో కూడా చిన్న చిన్న ప్రమాద నియంత్రికలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.గుర్తించిన 10 బ్లాక్ స్పాట్ లకుగాను మక్తల్ ,మరికల్ జాతీయ రహదారి పై ఎన్. హెచ్ అధికారులు, నారాయణ పేట పట్టణ బ్లాక్ స్పాట్ లలో ఆర్ అండ్ బీ అధికారులు నెలలోపు(మార్చి) మీటింగ్ వరకు ఆయా ప్రదేశాలలో స్పీడ్ బ్రేకర్లు, రంబల్స్ స్ట్రిప్స్, బొల్లార్స్, కాషన్ బోర్డ్స్, బ్లింకర్స్, జీబ్రా క్రాసింగ్, సిగ్నల్ లైట్స్, హైమాస్ట్ లైట్ లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వీటితో పాటు జిల్లాలోని రోడ్డు మార్గంలో ఇరువైపులా ఉన్న పాఠశాలల వద్ద భారీకేడ్లు ఏర్పాటు చేసుకునే విధంగా ఆయా పాఠశాలల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని డిఇఓ గోవిందరాజులు కు ఆమె సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రులకు తరలించేందుకు అంబులెన్స్ ల ను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్ ను ఆదేశించారు.ఇకపై జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అందరం కలసి కట్టుగా పనిచేద్దామని రోడ్ సేఫ్టీ మీటింగ్ లో తీర్మానించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రియాజ్ హూల్ హక్, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటరమణ, ఆర్టీవో మేఘా గాంధీ, ఆర్టీవో నెంబర్ పోషల్ రాజేష్, డిపో మేనేజర్ లావణ్య, ఎన్ హెచ్ అధికారి, ఆర్ అండ్ బి డీ.ఈ. తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

● కాంగ్రెస్ అభ్యర్థి రేణుక శ్రీనివాస్ గౌడ్



**సదాశివపేట, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** పట్టణాల అభివృద్ధి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎనిమిదో వాడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేణుక శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ చెయ్యి గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా అభ్యర్థి రేణుక శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వార్డు ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలిపారు. వార్డు అభివృద్ధి కోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి సహకారంతో భారీ ఎత్తున నిధులు మంజూరు చేయించి వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సొంత నిధులతో వార్డుల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

● మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వంమే
● బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి
● మాజీ మంత్రి హరీష్ రావు



**నర్సాపూర్, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే నని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ కళ్యాణమండపంలో మున్సిపల్ ఎన్నికలపై సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన హరీష్ రావు మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందింది అంటే బిఆర్ఎస్ ప్రభుత్వంలోనేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 700 రోజులు గడుస్తున్న ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నర్సాపూర్ మున్సిపాలిటీకి ఒక్క పైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా డబ్బులు పెట్టి గెలవాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ బిజెపి నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బడ్జెట్లో ఆంధ్రాకు మూటలు ఇచ్చి తెలంగాణకు మొండి చేయి ఇచ్చిందని విమర్శించారు. ఏమి చేయని బిజెపి నాయకులకు ఎందుకు ఓటు వేయాలని ఆయన ప్రశ్నించారు. నర్సాపూర్ మరింత అభివృద్ధి చెందాలంటే బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్, మాజీ జెడ్పి కోషన్ మెంబర్ మన్సూర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, నాయకులు సింగయ్యపల్లి గోపి, శివకుమార్ ,శేఖర్ కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో రామాయంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి, గొల్లిపర్తి, రెడ్డి కాలనీ, ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ విస్తృతంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా ఈ పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయనున్న భద్రతా ఏర్పాట్లపై రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్ఐ బాలరాజ్ ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ రోజున ఓటర్లు ఎలాంటి భయం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని, భద్రతా చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రామాయంపేట్ లో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ టీ చెక్ పోస్ట్ ను తనిఖీ చేశారు.



# కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలి

● సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి

**తూప్రాన్, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలని,విబి జి రామ్ జి 2025,విత్తనచట్టం రద్దు, విద్యుత్ సవర్ణ చట్టం 2025 కోసం దేశ వ్యాప్త ఉద్యమం చేస్తామని,మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మె మోడీ ప్రభుత్వానికి గుణపాఠం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అయన హాజరై మాట్లాడుతూ స్వాతంత్రం రాకముందే కార్మికులు వారి హక్కుల కోసం పోరాడి కార్మిక చట్టాలు తెచ్చుకున్నారని, అనేక త్యాగలతో ఏర్పడిన చట్టాలు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తొలగించి 4 లేబర్ కొడ్స్ రూపంలో తీసుకురావడం సిగ్గుచేటని మండిపడరు. ఇప్పటికే కేంద్రం పూర్తిగా ఆదని, అంబానీ చాకిరీ చేస్తూ దేశ సంపదను ఆపాగిస్తున్నారని అందులో భాగంగానే ఈ లేబర్ కొడ్స్ తెచ్చారని గుర్తుచేసారు. ఇప్పుడు ఉన్న పనిగంటలు మారుస్తూ 12గంటల పని చేయాలనీ కొడ్స్ చెప్తుంటే రచ్చరిక పరిపాలనగా రాబోతుందన్నారు. హక్కుల కోసం కొట్లాడితే అక్రమ కేసులు పెట్టి కార్మికులను భయబ్రాంతులకు గురిచేస్తారని ఈ ప్రమాదకర కొడ్స్ మూలంగా కార్మికుల నడివిరవడమే తప్ప మరొకటి కాదన్నారు. ఇప్పటికే ఒక కుటుంబం బ్రతకాలంటే 26,000 ఇవ్వాలంటే మోడీ రోజుకు 178 రూపాయలుతో జీవించొచని మాట్లాడం ఎంతవరకు సమంజసమని మండిపడరు. పరిశ్రమ కార్మికులు, రాష్ట్ర వ్యాప్త రంగాలలో ఈ కొడ్స్ గత 5 ఏండ్లు నుండి అమలు చేయాలనీ చూస్తే సీఐటీయూ గా, ఇతర కార్మిక సంఘాలుగా దేశ వ్యాప్తంగా పోరాటాలు, సమ్మెలు చేయడంతో అమలు కాకుండా ఆపుతున్నారని, ఇప్పుడు రాబోయే ఫిబ్రవరి 12న సమ్మె గ్రామం నుండి ఢిల్లీ వరకు ప్రభావం చూపించాలని, కార్మికులతో పాటు రైతులకు నష్టం చేస్తూ విద్యుత్ సవరణ బిల్లు, విత్తన సవరణ బిల్లు తెస్తున్నారని, గ్రామీణ పేదలు రోజు పనిచేసుకుంటూ పోటానింపుకుంటున్న ఉపాధి హామీ పథకాన్ని విబి జి రామ్ జీ పేరుతో పూర్తిగా తొలగించే కుట్ర చేస్తున్నారని మండిపడరు. అందుకే కార్మికులు, రైతులు, పేదలు, కూలీలు పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్



ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు ఎం. నర్సింలు, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి అసిఫ్, అధ్యక్షులు మహేష్, స్వామి, నాగరాజు, సురేష్ నర్సింలు, బాలయ్య, ఎల్లం. మున్సిపల్ కార్మికులు సంఘశీ అధ్యక్షులు బాబు నాయకులు ఎల్లం, హాస్పిటల్ యూనియన్ నాయకులు స్వరూప, నవనీత, మహేశ్వరి, ఆర్పీలు బాలమణి సంపూర్ణ కనీస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# భూత్పూర్ పీఠంపై బీజేపీ గురి

● అమీస్తాపూర్ టార్గెట్‌గా కమలదళం వ్యూహాలు
● రంగంలోకి చికోటి ప్రవీణ్..
● భూత్పూర్ మున్సిపాలిటీలో పెరిగిన రాజకీయ వేడి
● ఐదిండ్ల శ్రీను నాయకత్వంలో బీజేపీ జోరు
● ఒక్క స్థానాన్ని కూడా వదిలే ప్రసక్తే లేదని భీష్మ ప్రతిజ్ఞ
● అమీస్తాపూర్ కోటలో కాషాయ జెండా ఎగురవేసేందుకు బీజేపీ 'ఫుల్ ఫోకస్

**భూత్పూర్, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ అమీస్తాపూర్ గ్రామాన్ని తన ప్రధాన స్థావరంగా మార్చుకుని ముమ్మర వ్యూహాలు రచిస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీకి లభించిన భారీ సానుకూల ఓటింగ్ శాతాన్ని మున్సిపల్ పోరులోనూ ఓట్ల వర్షంగా మార్చుకోవాలని కమలదళం భావిస్తోంది.

### అమీస్తాపూర్ గ్రామంపై 'స్పెషల్ ఫోకస్

మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడంలో అమీస్తాపూర్ గ్రామం అత్యంత కీలకం కావడంతో, బీజేపీ నాయకత్వం ఈ గ్రామంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ఐదిండ్ల శ్రీను నాయకత్వంలోని బీజేపీ కార్యకర్తలు గ్రామంలోని ప్రతి గడపను తడుతూ, ఒక్క స్థానాన్ని కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని భీష్మించుకు కూర్చున్నారు. తమ సొంత కోటను కాపాడుకుంటూనే, భూత్పూర్ మున్సిపాలిటీలోని మెజారిటీ వార్డులను గైవసం చేసుకునేలా క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేశారు.

### రంగంలోకి చికోటి ప్రవీణ్-డోకూర్ పవన్ కుమార్ రెడ్డి

ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ, కీలక నేత చికోటి ప్రవీణ్‌ను రంగంలోకి దింపింది. ఆయన అమీస్తాపూర్‌తో పాటు భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలో నిరంతరం పర్యటిస్తూ, వార్డుల వారీగా కార్యకర్తల పనితీరును సమీక్షిస్తున్నారు. గెలుపోటములకు గల అవకాశాలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ, కార్యకర్తలకు కోడూర్ పవన్ కుమార్ సైతం దిశా నిర్దేశం చేస్తున్నారు.చికోటి ప్రవీణ్ స్వయంగా రంగంలోకి దిగడంతో



బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.

### పార్లమెంట్ ఎన్నికల ఊపుతో ముందడుగు

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన సానుకూల ఓట్లు తమకు ప్రధాన బలమని పార్టీ నాయకత్వం భావిస్తోంది.అదే సానుకూల పవనాలను ఈ ఎన్నికల్లోనూ కొనసాగిస్తూ, ప్రధాని మోదీ నాయకత్వం మరియు స్థానిక అభివృద్ధిని ప్రధాన అజెండాగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.ఐదిండ్ల శ్రీను వ్యూహాలు,చికోటి ప్రవీణ్ పర్యవేక్షణ తోడవ్వడంతో ఈసారి భూత్పూర్ మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది.

# శిక్షణలో నేర్చుకున్నది క్షేత్రస్థాయిలో అమలు చేయాలి

● ప్రజల మన్ననలు పొందే అధికారులే నిజమైన పరిపాలకులు
● నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్


**అచ్చంపేట, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** ప్రజాస్వామ్య వ్యవస్థలో పరిపాలనకు కేంద్రబిందువు ప్రజలే, అలాంటి ప్రజల మన్ననలు పొందాలంటే అధికార యంత్రాంగం తన బాధ్యతలను మరింత నైపుణ్యంతో, సమర్థతతో నిర్వహించాల్సిన అవసరం ఉంటుందని అందుకు అనుగుణంగానే నైపుణ్యాల పెంపుదలకు అధికారులు క్షేత్రస్థాయి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. హైదరాబాద్ మానవ వనరుల అభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రెండో బ్యాచ్, గ్రూప్ -1 అధికారుల నల్లమల్ల ట్రెక్కింగ్ మరియు స్టడీ టూర్‌ను బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ శిక్షణ కేంద్రంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు కేవలం నిబంధనల అమలుకే పరిమితం కాకుండా ప్రజల అవసరాలను అర్థం చేసుకుని స్పందించే దృక్పథాన్ని అలవరుచుకోవాలన్నారు. అదే నిజమైన పరిపాలనకు కొలమానం అని పేర్కొన్నారు. వేగంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అధికారులు తమ వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, సమయపాలన, స్పష్టమైన సమాచార వ్యవహారం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పారదర్శకత, నైతిక విలువలను పాటించడం ద్వారా పరిపాలనపై ప్రజల నమ్మకం మరింత బలపడుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా వినడం, సానుకూల దృక్పథంతో పరిష్కారాలు చూపించడం ద్వారా అధికారుల బాధ్యతలు మరింత సమర్థవంతంగా నిర్వహించగలమని అన్నారు. శిక్షణ సమయంలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని ప్రామాణికంగా తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా సేవలు సులభంగా అందేలా వ్యవస్థలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంటుందని అన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా అధికారులపై గౌరవం పెరుగుతుందని, అలాంటి అధికారులు ప్రజల మన్ననలు పొందుతారని పేర్కొన్నారు. పరిపాలన అనేది ఒక్క రోజులో సాధ్యమయ్యేది కాదని, అది



అధికారుల నిరంతర కృషి, నైపుణ్యాభివృద్ధి, సేవాభావం కలయికతోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రోగ్రాం డైరెక్టర్ హెచ్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.... క్షేత్రస్థాయి పర్యటనలతోనే అధికారుల నైపుణ్యాలు మరింతగా అభివృద్ధి చెందుతాయని ఆ దిశగా ఈ పర్యటనను తమ నైపుణ్య అభివృద్ధికి విజయవంతంగా మలుచుకోవాలని ఆయన సూచించారు. అనంతరం నల్లమల అటవీ ప్రాంతంలోని సలేశ్వరం అక్కమాంబ గృహాలను సందర్శనకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, నాగరాజు అసిస్టెంట్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి

● ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



**శివ్వంపేట, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) :** పెండింగ్‌లో ఉన్న పనులకు ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రమైన శివ్వంపేటతో పాటు ఉసిరికపల్లి గ్రామాలలో ఎన్ఆర్జీఎస్ కింద విడుదలైన నిధులతో ఆయా గ్రామాల్లో పాఠశాలల ప్రహరిగోడ నిర్మాణ పనులకు సర్పంచ్లు రాజిపేట వెంకటేశ్వర్, సుజాతకృష్ణారెడ్డిలతో కలసి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని దాదాపు 40 పాఠశాలలకు రూ.3 కోట్ల95 లక్షల ఎన్ఆర్జీఎస్ నిధులు విడుదలయ్యాయని, వాటితో ప్రహరిగోడలు, టాయిలెట్స్ వంటి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, మహిళా సమాఖ్య భవనాలు ఉపాధి హామీ పథకం శాంక్షన్ చేయించడం జరుగుతుందని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న గోమారం నుంచి పిల్లికొట్టాల వరకు, అలాగే దొంతి రోడ్డు నిర్మాణానికి కూడా నిధులు మంజూరుకోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేవరకు తనవంతు కృషి చేస్తానని ఆమె చెప్పారు. అనంతరం ఉసిరికపల్లిలో లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీ మాజీ కోఆప్షన్ మన్సూర్, ఆత్మకమిటీ మాజీ ఛైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఏపీఓ అనీల్, సీనియర్ నాయకులు తూము కృష్ణారావు, యాదాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, మర్రి మహేందర్ రెడ్డి, మండల పార్టీ బీసీ విభాగం నాయకులు శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ లు వెంకటేశ్వర్, ప్రవీణ్ గౌడ్, అశోక్ రెడ్డి, మర్రి గోపాల్ రెడ్డి, లక్ష్మీనర్సయ్య, బాబురావు, అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY



# సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- బీసీ వెల్ఫేర్ హాస్టల్ లో సామాజిక న్యాయ దినోత్సవం..
- ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్..



**హనుమకొండ ప్రతినిధి, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) :** ప్రతి సామాజిక వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమారంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహం(ధర్మసాగర్)లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, విద్యా సంస్థలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. వెనుకబడిన, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, విద్యా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ సూచించారు. బాలికలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని అన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించిన తర్వాతనే బాలికలు వివాహం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులతో సామాజిక న్యాయం, సమానత్వం, సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, హసన్ పర్తి తహసిల్దార్ కిరణ్ కుమార్, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సంపూర్ణ, వసతి గృహ వార్డెన్ ప్రియాంక, అధ్యాపకులు, కళాశాల వసతిగృహం విద్యార్థినులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ అవినీతి అరాచకం

- ఐటీ పార్క్ పేరిట కోట్ల రూపాయల అవినీతి
- అభివృద్ధి పనుల టెండర్ లలో అక్రమాలు
- మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి చెందాలంటే బిజెపిని గెలిపించండి
- అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్



**మంచిర్యాల ప్రతినిధి, జనవరి 4 (జనంసాక్షి) :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రజా పాలన పేరుతో అవినీతి అరాచకం కొనసాగుతుందని, ఐటి పార్క్ పేరుతో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ కార్యకర్తలు పహాణీలు రాసుకుని చెక్కులు తీసుకున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఆరోపించారు. బుధవారం నాడు మంచిర్యాల పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పాలనపై చార్జిషీట్ సంబంధించిన కరపత్రాలు రిలీజ్ చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ.. మంచిర్యాల నియోజకవర్గంలో ప్రజా పాలన గాడి తప్పింది ఈ గాడి తప్పడం కారణంగా ప్రజలు రకరకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. నాయకులకు ఇవాళ అధికారం ఉంటుంది. రేపు పోతుంది కానీ ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన ప్రతి ఒక్క నాయకుడికి ఉండాల్సిన లక్షణం అని అన్నారు . ఇక్కడ నియంత పాలన కొనసాగుతోందని మంచిర్యాల జిల్లా కేంద్రంలో టెండర్లు లేకుండానే తమకు నచ్చిన వారికి పనులు అప్పగిస్తారని తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత ఎస్టిమేట్లు వేస్తారని ఆరోపించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇలాంటి పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపిస్తే జరిగేది అభివృద్ధి కాదని అరాచకం రాజ్యమేలుతోందని పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే బీజేపీ పార్టీ చెందిన అభ్యర్థుల గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ,రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి రఘునాథ్. పెద్దపెల్లి ఎంపీ కాంటెస్ట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ .జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శిలు కృష్ణమూర్తి , వెంకటేశ్వరరావు, తుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- కోటంచ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ఏర్పాట్లు
- పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్



**రేగొండ, ఫిబ్రవరి 04 (జనంసాక్షి):** ఈ నెల 8వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా బుధవారం కోటంచలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సంకీర్త్ కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్,ఎస్పీ లు ముందుగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి భద్రత, ట్రాఫిక్, మౌలిక సదుపాయాలపై సమీక్ష అనంతరం దేవాలయ పరిసరాల్లో సీఎం పర్యటనకు సంబంధించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, పారిశుద్ధ్యం, త్రాగునీటి సదుపాయాలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటన సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రతి సెక్టార్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తామని తెలిపారు. దేవాలయాన్ని సుందరంగా అలంకరించాలని, పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి ముమ్మరంగా శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని, విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా అందించాలన్నారు. ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ సీఎం పర్యటన దృష్ట్యా నాలుగు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు సౌకర్యంగా దారి సూచించే సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం పర్యటనలో భాగంగా హెలిప్యాడ్ ఏర్పాటు స్థలాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, విద్యుత్తు శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఈ శ్వేత, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ మహేష్, తహసీల్దార్ శ్వేత, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, ఎంపిఓ రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అశోక్ లేలాండ్ వాహనం బోల్తా

- వెంటనే స్పందించి క్షతగాత్రులను హాస్పిటల్ కు తరలించిన తాడ్వాయి ఎస్ఐ జగదీశ్



**ములుగు బ్యూరో,ఫిబ్రవరి04(జనం సాక్షి):** చర్ల నుండి మేడారం వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం తాడ్వాయి మండలం పరిధిలో అతివేగం కారణంగా బోల్తా పడి ప్రమాదానికి గురైంది.కామరాం గ్రామాన్ని దాటి గిన్నెలవాగు బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద వాహనం అతి వేగంగా వెళ్లడం వల్ల డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనం బోల్తా పడింది.ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది ప్రయాణికుల్లో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే తాడ్వాయి ఎస్ఐ జగదీశ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్స్ లో సమీప దవాఖానకు తరలించి తక్షణ చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు.ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. ప్రయాణికులు మూల మలుపులు,వాగు బ్రిడ్జిల వద్ద వాహనాలను అతి వేగంగా నడపకుండా జాగ్రత్తలు పాటించాలని మూల మలుపుల వద్ద ఉన్న సూచికలను పాటిస్తూ వాహనాలు నడుపాలని ఎస్ఐ తెలియచేశారు.



## హోరాహోరీగా సీఎం కప్ ఖిలా వరంగల్ మండల స్థాయి ఆటల పోటీలు

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 04 (జనంసాక్షి) :** ఖిలా వరంగల్ మండల స్థాయి సీఎం కాపు ఆటల పోటీలలో భాగంగా రెండవ రోజు శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఖోఖో, ఫుట్బాల్, అథ్లెటిక్స్, చెస్ క్రీడాంశాలలో బాల బాలికలకు ఖిలా వరంగల్ మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు జరిగాయి.వివిధ క్రీడాంశాలలో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నిర్వాహకులు క్రీడాకారులకు బిస్కెట్ ప్యాకెట్లు అందించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు 6వ తేదీన జరగబోయే వరంగల్ ఈస్ట్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారని మండల ఎంఈఓ బి ప్రసాద్ తెలిపారు. ఈ టోర్నమెంట్లో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ బొబ్బిలి వెంకన్న, ఖోఖో కన్వీనర్ గోగు నారాయణ, అథ్లెటిక్స్ కన్వీనర్ బాబు, ఫుట్బాల్ కన్వీనర్ పెద్దిరాజు, పీడీలు కవిత, సృజన, సంధ్యారాణి, ఎండి సలార్, ఎం అనిల్, ఎస్ అనిల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్కృష్ట పతకాన్ని అందుకున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్



**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 04 (జనం సాక్షి) :** పోలీస్ విభాగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం బెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్ కు ప్రకటించిన ఉత్కృష్ట పతకాన్ని, బుధవారం సీపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా డిసిపి రాజమహేంద్ర నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డీసీపీకి అభినందనలు తెలియజేయడంతో పాటు విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచే అధికారులకు శాఖా పరమైన గుర్తింపుతో పాటు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు కూడా లభిస్తుందని సిపి తెలియజేశారు. 2010 డీఎస్పీగా పోలీస్ శాఖలో చేరిన రాజమండ్రి నాయక్ నెల్లూరు జిల్లాతో, వరంగల్ సిసిఎస్, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో డి.ఎస్పీగా పని చేసి 2017 అదనపు ఎస్పీగా భూపాలపల్లి, ఇంటెలిజెన్స్ పనిచేసి, 2021లో ఎస్పీ పదోన్నతి పొంది ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసారు ప్రస్తుతం సెంట్రల్ జోన్ డీసీపీ ఎంతో సమర్ధవంతంగా పనిచేయడంమే కాకుండా తను పని చేసిన సమయంలో ఎన్నో కీలక కేసులను పరిష్కరించడం డీసీపీ రాజ మహేంద్ర నాయక్ కీలకంగా నిలిచారు. ఈ సందర్భంగా వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది డీసీపీ అభినందనలు తెలిపారు.

# తనిఖీల్లో చెక్‌పోస్ట్ వద్ద 28 లక్షలు స్వాధీనం

- సరైన పత్రాలు లేకుండా మహారాష్ట్ర నుండి ఆదిలాబాద్‌కు వస్తున్న నగదు



**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణం శివారు రాంపూర్ వద్ద ఏర్పాటుచేసిన ఎస్ ఎస్ టి చెక్ పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న తనిఖీలలో భాగంగా మహారాష్ట్ర బస్సులో వస్తున్న మహారాష్ట్ర ఉమార్ఖేడ్, గ్రామానికి చెందిన సుభాష్ కేశవ్ జన్నావార్ అనే వ్యక్తి వద్ద ఎలాంటి సరైన ధ్రువపత్రాలు లేకుండా తరలుతున్న 28 లక్షల నగదు రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. 24 గంటలు అప్రమత్తమంగావుంటూ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీల్లో డిప్యూటీ తహసిల్దార్ భూష మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసిన కాంగ్రెస్‌ను గెలిపించాలి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, కాంగ్రెస్ అభ్యర్థులను, దానికి అనుబంధంగా ఉన్న సిపిఐ, సిపిఎం పార్టీల అభ్యర్థులను గెలిపించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7, 26, 24, 25, 23 వార్డులు నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగ్‌లలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో భూపాలపల్లి మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందని, అందుకోసం పార్టీ అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అంతకుముందు 22వ వార్డుకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా 22వ వార్డు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంను ప్రారంభించారు. 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ముంజాల రవీందర్ గౌడ్ కు చెందిన ఎన్నికల ప్రచార రథాన్ని ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రారంభించారు.

# బాల్యవివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** బాల్యవివాహాలను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని కృషి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కనకదుర్గ కాలనీలో మహిళా శిశు సంక్షేమ శాఖ, షేర్ ఎన్‌జీవో సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన ప్రచార రథాన్ని ఎంపీ డా.కడియం కావ్య జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, బాల్యం అమూల్యమైన దశ అని పేర్కొన్నారు. బాల్యవివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, శారీరక-మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. చదువు మధ్యలో ఆగిపోవడం వల్ల జీవితాంతం ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. బాల్యవివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. పిల్లలు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో షేర్ ఎన్‌జీవో డైరెక్టర్ గోపాల్ రెడ్డి, కోఆర్డినేటర్ సిరీష, వరంగల్ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వాసుధ, సభ్యురాలు మధు, హనుమకొండ సీడబ్ల్యూసీ సభ్యుడు సుధాకర్, శ్రీకాంత్ రెడ్డి, కమ్యూనిటీ మొబిలైజర్లు జ్ఞానేశ్వరి, జగన్, చామంతి, జమున, ప్రశాంతి, కల్పన, ప్రభాకర్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి,ఫిబ్రవరి 4, (జనంసాక్షి) :** ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు చేపట్టిన చర్యలలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల పరిధిలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట సంబంధిత ఉన్నారు.

# సినీ నటులు మంచు మోహన్, బాబు విష్ణును అరెస్ట్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సినీ నటులు మోహన్ బాబు విష్ణు దిష్టిబొమ్మ ల దగ్ధం




**హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** సినీ నటులు మంచు మోహన్ బాబు విష్ణు ను వెంటనే అరెస్ట్ చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు బుధవారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు ముందు సినీ నటుల దిష్టిబొమ్మ ల ను దగ్ధం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో ఉన్నటువంటి మోహన్ బాబు యూనివర్సిటీ లో జరుగుతున్న అక్రమాలను అన్యాయాలను అరికట్టాలని యూనివర్సిటీ విద్యార్థుల దగ్గర నుండి అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని యూనివర్సిటీ పై విచారణ జరిపించాలని కోరుతూ కలెక్టరేట్ ముందు ధర్నా చేసేందుకు వెళ్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకత్వాన్ని యూనివర్సిటీ బాధ్యులు సినీ నటులు మంచు మోహన్ బాబు విష్ణు తమ వ్యక్తిగత సిబ్బంది 30 మందితో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకత్వాన్ని కిడ్నాప్ చేశారన్నారు. అక్రమంగా ఎస్ఎఫ్ఐ బృందాన్ని కిడ్నాప్ చేసినటువంటి సినీ నటులు మోహన్ బాబు విష్ణు ను వెంటనే అరెస్టు చేయాలన్నారు అలాగే వారి యొక్క ఎం బి యు మోహన్ బాబు యూనివర్సిటీలో జరిగే అన్యాయాల మీద అక్రమల మీద వెంటనే విచారణ కమిటీ వేసి చట్టపరమైన చర్యలు తీసుకొని యూనివర్సిటీ గుర్తింపు ను రద్దు చేయాలన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు కార్పొరేటు యూనివర్సిటీలకు కొమ్ముకాస్తూ వారిని పెంచి పోషిస్తున్నారు అన్నారు వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకొని వారిని తక్షణమే అరెస్టు చేయాలి అన్నారు లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్ అధ్యక్షులు మల్లేష్ రాహుల్ సూరజ్ సాయి నాగరాజ్ పవన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబాపై స్పెషల్ డ్రైవ్

- 30 లీటర్ల గుడుంబా స్వాధీనం
- 12 మంది పై కేసులు నమోదు

**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** ప్రజల రక్షణ, సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ అండ్ సెర్చ్) లను నిర్వహించడం జరుగుతుందని జైనథ్ సిఐ జి శ్రావణ్ అన్నారు. బుదవారం బేల మండలం సైద్ పూర్ గ్రామంలో ఉదయం 50 మంది సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వహించడం జరిగింది. గుడుంబా పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ డ్రైవ్ లో 30 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు 12 మందిపై బేల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ గుడుంబా, గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండాలని తెలిపారు మహిళల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ఉండాలని ఎలాంటి గృహహింస చర్యలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సోషల్ మీడియా పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
05 ఫిబ్రవరి 2026

# చండూరులో రసవత్తర పుర పోరు ప్రచారం

- పీఠం ఎవరిది..?.. అభివృద్ధి ఎవరితో..?
- ఉత్కంఠ రేపుతున్న 10 వార్డుల ప్రచార పర్వం

**చండూరు, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) :** చండూరు పుర పోరు ప్రచార పర్వం వేడెక్కింది. పట్టణంలోని 10 వార్డుల పరిధిలో ఇప్పుడు ఎక్కడ చూసినా ఎన్నికల చర్చోపచర్చలే వినిపిస్తున్నాయి. ఒకవైపు అధికార పార్టీ తన పట్టును నిలుపుకోవాలని వ్యూహాలు రచిస్తుండగా... మరోవైపు ప్రధాన ప్రతిపక్షాలు అధికార పార్టీకి చెక్ పెట్టేందుకు గట్టి పోటీనిస్తున్నాయి. ఈ నువ్వా-నేనా పోరులో అంతిమ విజయం ఎవరిని వరిస్తుందోనని మున్సిపల్ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చండూరు మున్సిపాలిటీలోని 10 వార్డులలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునేందుకు అధికార పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ మద్దతు తమకు కలిసొస్తాయని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వ్యతిరేకతను, స్థానిక సమస్యలను ఎత్తిచూపుతూ... ప్రతిపక్షాలు గట్టి పోటీనిస్తున్నాయి. ఏ ఒక్క ఓటు కూడా చేజారకుండా ఇరువర్గాలు పోటాపోటీగా ప్రచారం సాగిస్తుండటంతో ఫలితాలు ఎలా ఉంటాయోనన్న ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా 'మున్సిపల్ ఛైర్మన్' పీఠం దక్కించుకోవడం ఎవరికి సాధ్యమవుతుందో... అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

### రాజకీయం కాదు.. కావాల్సింది రాజమార్గం

ఎన్నికల్లో ఎవరు గెలిచినా, ఏ పార్టీ జెండా ఎగిరినా.. చండూరు ప్రజల అంతిమ తీర్పు మాత్రం "మున్సిపాలిటీ ప్రగతి" వైపే ఉంది. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించే, చండూరును ఆదర్శ మున్సిపాలిటీ గా తీర్చిదిద్దే పాలకవర్గం రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారు. మున్సిపాలిటీగా మారిన తర్వాత ప్రజల అవసరాలు పెరిగాయి. కొత్తగా కొలువుదీరబోయే పాలకవర్గం తక్షణమే ఈ క్రింది మౌలిక సదుపాయాలు మరియు అభివృద్ధి పనులపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది

### మున్సిపాలిటీలో ఉండాల్సిన సౌకర్యాలు - ప్రజల డిమాండ్లు

మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత ప్రజల ఆశలు పెరిగాయి. కొత్తగా ఏర్పడే పాలకవర్గం తక్షణమే ఈ క్రింది మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది




### శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ

పట్టణంలో ప్రధాన సమస్య మురుగునీటి పారుదల. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలవకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలి.

### సురక్షిత మంచినీరు

అన్ని వార్డులకు, ప్రతి ఇంటికి సమయానుకూలంగా, స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలి. పైపులైన్ల లీకేజీలను అరికట్టాలి.

రహదారులు, వీధి దీపాలు

అంతర్గత రహదారులు బాగుచేయాలి. రాత్రి వేళల్లో అంధకారం లేకుండా ప్రతి వీధిలోనూ హై-మాస్ట్ లేదా ఎల్.ఈ.డి లైట్ల వెలుగులు నింపాలి.

### డంపింగ్ యార్డ్, పారిశుధ్యం

చెత్త సేకరణ సమర్థవంతంగా జరగాలి. ఊరికి దూరంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి, చెత్తను శాస్త్రీయంగా రీసైకిల్ చేసే ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేయాలి.

### పబ్లిక్ పార్కులు, గ్రంథాలయం

పిల్లలు, వృద్ధుల కోసం ఆహ్లాదకరమైన పార్కులు, యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఆధునిక హంగులతో కూడిన గ్రంథాలయం ఏర్పాటు చేయాలి.

### సమీకృత మార్కెట్

కూరగాయలు, మాంసం విక్రయాలకు రోడ్ల పక్కన కాకుండా, ఒక పద్ధతి ప్రకారం పరిశుభ్రమైన మార్కెట్ యార్డును నిర్మించాలి.

### 100 పడకల ఆసుపత్రి

అత్యవసర వైద్యం కోసం ప్రజలు హైదరాబాద్ లేదా నల్గొండకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కాబట్టి, ప్రస్తుత ఆసుపత్రిని ఆధునికీకరించి 100 పడకల ఏరియా ఆసుపత్రిగా తీర్చిదిద్దాలి. ప్రభుత్వ ఇంటర్,డిగ్రీ కాలేజీలు,మోడల్ స్కూల్,గురుకులాలు పేద విద్యార్థులు చదువు కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా, చండూరులోనే పక్కా భవనాలతో కూడిన ప్రభుత్వ ఇంటర్,డిగ్రీ కాలేజీలు,మోడల్ స్కూల్,గురుకులాలను వెంటనే మంజూరు చేయాలి.

### యువతకు క్రీడా ప్రాంగణం

యువత శారీరక దారుఢ్యం కోసం, క్రీడల్లో రాణించడానికి ఆధునిక సౌకర్యాలతో కూడిన క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి.

### నవీన మున్సిపల్ కార్యాలయం

పాలన సౌలభ్యం కోసం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని హంగులతో కూడిన నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని నిర్మించాలి.

### పశు వైద్యశాల

పాడి రైతుల సౌకర్యార్థం, పశువుల చికిత్స కోసం ఆధునిక పరికరాలతో నవీన పశు వైద్యశాలను ఏర్పాటు చేయాలి.

స్మశాన వాటికలు (వైకుంఠ ధామాలు)

ఎవరైనా చనిపోతే ఇబ్బంది పడకుండా, అన్ని మౌలిక వసతులతో కూడిన మోడ్రన్ స్మశాన వాటికలను అభివృద్ధి చేయాలి.

### దోభీ ఘాట్‌లు

రజకుల వృత్తికి ఆసరానిచ్చేలా, నీటి సౌకర్యంతో కూడిన ఆధునిక దోభీ ఘాట్‌లను నిర్మించాలి.

### ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే నాయకత్వం కోసం...

అధికార పక్షం ఆశలు ఫలించినా, ప్రతిపక్షాల వ్యూహాలు గెలిచినా.. అంతిమంగా గెలవాల్సింది మాత్రం చండూరు ప్రజలే. కుర్చీలాటలో మునిగిపోకుండా, పైన పేర్కొన్న విద్య, వైద్యం మరియు మౌలిక వసతులను కల్పించి చండూరును అభివృద్ధి పథంలో నడిపించే నాయకత్వాన్నే ప్రజలు ఆశీర్వదిస్తారు. మరి ఓటరు దేవుళ్ళు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి.

# ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు

- జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ



అమీన్పూర్, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) : మహా నగర అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం డివిజన్ పరిధిలో రూ.40.70 కోట్ల అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవనికి స్థానిక కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఆధ్వర్యంలో పలు ప్రారంభోత్సవాలకు, శంకుస్థాపనలకు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డిలతో కలిసి ముఖ్యఅతిథిగా నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ హాజరయ్యారు. అందులో భాగంగా రామచంద్రాపురం శ్రీనివాస్ నగర్ కాలనీ పరిధిలో ఉన్న సోమేశ్వర ఆలయం వద్ద కమ్యూనిటీ హాల్, రామచంద్రపురంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డివిజన్లో అభివృద్ధి కోసం నూతన మంజూరు, శ్రీనివాస్ నగర్ లో గాంధీ బాలవిహార్ పార్క్, ఓల్డ్ రామచంద్రాపురంలో మీట్ మార్కెట్, రాయసముద్రం చెరువు సుందరీకరణ హెచ్ఎండిఏ, రాయసముద్రం చెరువులో మురికి నీరు మళ్లించాడనికి, రామచంద్రారెడ్డి నగర్ లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాకతీయ నగర్ కాలనీలో థీమ్ పార్క్ (హెచ్ఎండీఏ), కాకతీయ నగర్ కాలనీలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ తో కలిసి నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ మాట్లాడుతూ.. నగరం నలువైపులా విస్తరిస్తున్నశీదు వల్ల జనాభాకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలలో జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేశామని తెలిపారు. రామచంద్రాపురం డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం, పలు శంకుస్థాపనలు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌కు ప్రభుత్వాలదే ప్రధాన బాధ్యత

సికింద్రాబాద్, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) : ప్రజలకు క్యాన్సర్ రావడానికి ప్రధాన బాధ్యత ప్రభుత్వాలదే అని ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాసిం పేర్కొన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విద్యార్థులు క్యాన్సర్ అవేర్నెస్ ఫ్లాష్ మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ సర్వీస్ స్కీమ్( ఎన్ఎస్ఎస్) ఆర్ట్స్ కళాశాల యూనిట్ తో పాటు ఓఈస్టర్ , ఎస్ కే టి ఫౌండేషన్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాసిం హాజరై మాట్లాడారు. ప్రజలకు క్యాన్సర్ రావడానికి ప్రధాన బాధ్యత ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. విత్తనం నుంచి మొదలుకొని మనం తింటున్న ఆహారం , తాగుతున్న నీరు కలుషితమైపోయిందన్నారు. ఈ నేపథ్యంలో దేశంలో పెద్ద నోట్లను రద్దు చేసిన మాదిరిగానే క్యాన్సర్ కారక ప్లాస్టిక్ ను, భూమిలో- ఆహార పంటల్లో వాడే రసాయనిక ఎరువులను, మందులను నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం చేయాలన్నారు. అప్పుడే క్యాన్సర్ ను నివారించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. క్యాన్సర్ రాకుండా ఉండడం కోసం కొంతమంది వ్యక్తులు, కొన్ని సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయ మన్నారు. క్యాన్సర్ నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. అందుకే యూనివర్సిటీలో బర్త్ డే కేకులను ను కట్ చేయవద్దని చెప్తున్నామన్నారు. బర్త్ డే కేకులు, కూల్ డ్రింక్స్ మొదలైన వాటి ద్వారా కూడా క్యాన్సర్ వస్తుందని విద్యార్థులు గుర్తించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి హాజరైన ఆంకాలజిస్ట్ డాక్టర్ సందీప్ కుమార్ తుల మాట్లాడుతూ క్యాన్సర్ ను ముందుగానే పసిగట్టే అవకాశం ఉంటుందని ఇందుకు క్యాన్సర్ స్క్రీనింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ చలమల్ల వెంకటేశ్వర్లు, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. స్వాతి, డాక్టర్ కే బాలు నాయక్, ఎన్ఎస్ఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యాలాల శివానంద్, ఓఈస్టర్ సంస్థ అధ్యక్షులు సునీల్ సింగాడే , ఓయూ సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వరరావు, సోషియాలజీ బి ఓ ఎస్ చైర్మన్ డాక్టర్ రామ్ షెఫర్డ్ తదితరులు పాల్గొన్నారు.



# పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

-కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) : జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టు పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని విసి హాల్ నందు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టే వివిధ పనుల పురోగతిపై ఏపీడీలు, ఈసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్ శక్తి, జన్ భాగిదారి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రతి మండలంలో ఒక గ్రామ పంచాయతీని గుర్తించి, మార్గదర్శకాల ప్రకారం నీటి సంరక్షణకు సంబంధించిన 20 రకాల పనులను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బోర్‌వెల్ రీచార్జ్, డెఫంక్ట్ బోర్‌వెల్, ఇంజెక్షన్ వెల్ , రూఫ్‌టాప్ వాటర్, హార్వెస్టింగ్ స్ట్రక్చర్, రీచార్జ్ షాఫ్ట్,రీచార్జ్ గుంత, సోక్ పిట్, తెరిచి ఉన్న బావి రీచార్జ్, డగ్ వెల్ కాంటూర్ ట్రెంచ్, గల్లి ప్లగ్, నాలా బండ్, గేబియన్, చెక్ డ్యామ్,భూగర్భ అడ్డుకట్ట గ్రామ చెరువు, పర్కొలేషన్ చెరువు, ట్యాంక్ చెరువు, బెంచ్ టెర్రేసింగ్, ఏదైనా వినూత్నమైన తక్కువ ఖర్చుతో కూడిన నమూనా, ఇతరులు గుర్తించబడిన పనులు ప్రధానంగా వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల రీచార్జ్, సంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ, వాటర్‌షెడ్ అభివృద్ధి పనులు ఈ పనుల ద్వారా నీటి లభ్యతను పెంపొందించడం, భూగర్భ జల మట్టాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. మహిళా శక్తి ఉపాధి భరోసా 6 రకాల పనులను గుర్తించాలని, గ్రామ పంచాయతీ వనమహోత్సవం నర్సరీ 2025-26 లో బ్యాగ్స్ లలో మట్టి నింపి విత్తనములు నాటడం త్వరతిగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్చార్జ్ డిఆర్డిఏ పిడి శిరీష, తుంగతుర్తి ఎంపీడీవో శేష్ కుమార్, డిఆర్డిఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**మధిర, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) :** పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే



అతిపెద్ద బహుమతి అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం ఎర్రుపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, విద్యార్థినిలతో కలిసి కలెక్టర్ సామాజిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి కుల వివక్ష లేని సమాజంగా తెలంగాణలో నిర్మించే దిశగా ప్రభుత్వం సామాజిక ఆర్థిక సర్వేను విజయవంతంగా నిర్వహించి, రిపోర్టును ఫిబ్రవరి 4, 2025న అసెంబ్లీలో ప్రవేశ పెట్టిందని అన్నారు. కుల, మత విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. గురుకులాల్లో చదివే పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలను 40 శాతం పెంచడం జరిగిందని, పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడం కోసం సమీకృత గురుకులాల నిర్మాణం చేపట్టిందని అన్నారు. సామాజిక న్యాయం ఉన్న సమాజాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వినియోగించుకుంటూ పిల్లలు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకుంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు చేసి మంచి విద్యాసంస్థలు ఏర్పాటు చేయడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన డైట్, కాస్మొటిక్ ఛార్జీలు, ఇతర మౌళిక వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టిందని అన్నారు. ప్రభుత్వ గురుకులాలకు ప్రజల నుంచి మంచి డిమాండ్ ఉందని అన్నారు. మంచి విద్యాసంస్థల్లో నేడు పిల్లలు చదువుతున్నా రని, అనేక ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన ల్యాబ్, క్రీడలు ఆడేందుకు వసతులు మన గురుకులాల వద్ద ఉన్నాయని తెలిపారు. పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు మనం ఇచ్చే అతి పెద్ద బహుమతి అవుతుందని, భవిష్యత్తులో ఎట్టి పరిస్థితుల్లో రిగ్రెట్ ఫీల్ కాకుండా ఉండాలని అన్నారు. చదువు, క్రీడలు, మనం చేసే పనిలో పిల్లలు తమ ఎనర్జీనీ 100 శాతం అందించాలని అన్నారు. విజయం వెంటనే రాదని, అనేక ఓటములు, అడ్డంకులను అధిగమిస్తేనే మంచి విజయం సాధ్యం అవుతుందని అన్నారు. రాబోయే 10, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటి చైర్మెన్ బండారు నరసింహారావు, ఎర్రుపాలెం మండల తహసీల్దారు ఉషా శారద , ఎంపిడివో బి. సురేందర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** కామారెడ్డి పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో గల కింగ్స్ కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల వ్యూహరచన సదస్సు అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్,రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయబోయే 49 వార్డుల అభ్యర్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన ప్రత్యేక మేనిఫెస్టోను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ ఆలీ మాట్లాడుతూ అభివృద్ధియే కాంగ్రెస్ నినాదం మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి మంత్రంతోనే ప్రజల ముందుకు వెళ్తుందని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. రెండు సంవత్సరాలు నుండి ప్రజల్లో కనపడని మాజీ ఎమ్మెల్యే మరియు ప్రతిపక్ష నాయకులు ఎమ్మెల్యే ప్రెస్ మీట్ పెట్టి కరప్షన్ గురించి మాట్లాడుతున్నారు దయచేసి మీరు ముందు రైతుల రక్తము చెమటతో రూపాయి రూపాయి కూడా వేసి తమ పిల్లల చదువు కోసం భూములు కొంటే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ భూములు అరోరా కాలేజీకి ధారా దత్తం చేసింది ఎవరు అది చెప్పండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇస్తే అమ్ముకుంది ఎవరు ఇవి కరప్షన్ లుకాదా ప్రజలకు దీనిపై సమాధానం చెప్పాలి మళ్లీ ఎన్నికలు రాగానే ప్రజల ముందుకు వస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో కామారెడ్డి పట్టణం ఎదుర్కొన్న నిర్లక్ష్యానికి స్వస్తి పలికి, రాబోయే కాలంలో అద్భుతమైన మౌలిక సదుపాయాలతో పట్టణ రూపురేఖలు మారుస్తాం అని హామీ ఇస్తున్న అన్నారు. వార్డుల వారీగా అభ్యర్థులు అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలి అన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను ప్రజలకు తెలియజేయాలి కోరారు. క్రమశిక్షణతో, ఐక్యమత్యంతో పనిచేసి 49 వార్డుల్లోనూ విజయం సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలి. కామారెడ్డి పట్టణానికి అభివృద్ధికి సంబంధించి బ్లూ ప్రింట్ రూపంలో మేనిఫెస్టోలో విడుదల చేస్తున్నాం. అంతర్గత రహదారుల విస్తరణ, అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థ. నీటి సరఫరా: ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన త్రాగునీటిని నిరంతరాయంగా అందించడం. ఆరోగ్యం విద్య: ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునికీకరణ మరియు ప్రభుత్వ పాఠశాలలను అమ్మ మోడల్ స్కూల్స్ గా తీర్చిదిద్దడం. ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలను అర్హులందరికీ అందిస్తున్నాం గత పదేళ్లలో పట్టణాన్ని పట్టించుకోని వారు ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్నారని, ప్రజలు వారిని నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని, ప్రజలు



అభివృద్ధికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కైలాస శ్రీనివాసరావు, డిపిసిసి జనరల్ సెక్రటరీలు ఇంద్రకరణ్ రెడ్డి, గడ్డం చంద్రశేఖర్ రెడ్డి,, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పండ్లరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇందుప్రియ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి, సుతారి రమేష్, భీమ్ రెడ్డి, రమేష్ గౌడ్,గూడెం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు మరియు పట్టణంలోని 49 వార్డులలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

# మహిళలు చదివితే దేశమే ఎదుగుతుంది

- చండూరు ఆర్డీవో శ్రీదేవి



**మర్రిగూడ, ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** మర్రిగూడ మండల కేంద్రంలో బుధవారం కస్తూరిబా పాఠశాల మరియు జిల్లా పరిషత్ పాఠశాలలో పిఆర్ఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో సుమారు 100 మంది విద్యార్థులకు పదవ తరగతి కాంపిటేషన్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చండూరు ఆర్డీవో శ్రీదేవి మాట్లాడుతూ ఒకప్పుడు వంటగదికి పరిమితమైన ఆడపిల్లలు నేడు అంతరిక్షాన్ని నడిపిస్తున్నారని అన్నారు. ఇస్రోలో మహిళా శాస్త్రవేత్తల భాగస్వామ్యం దేశానికి గర్వకారణమని, చంద్రయాన్, మంగళయాన్ వంటి ప్రతిష్టాత్మక మిషన్లలో మహిళల పాత్ర చరిత్ర సృష్టించిందని గుర్తు చేశారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రభుత్వ పాఠశాలల నుంచి అత్యున్నత పరిశోధన కేంద్రాల వరకు మహిళలు సాధించాలని చదివితే ఒక కుటుంబమే కాదు ఒక దేశమే ఎదుగుతుందనే నినాదానికి నిదర్శనంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, పిఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురగారావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థినులు, పాల్గొన్నారు.




# ఐటీ షేర్లు కుదేలు

ఐటీ షేర్లను భయపెట్టిన ఆంథ్రోపిక్..

## ఏంటీ ఏఐ టూల్..?

**న్యూఢిల్లీ:**కృత్రిమ మేధ నైపుణ్యాలపై దిగ్గజ టెక్ కంపెనీలు దృష్టిపెట్టిన వేళ.. 'ఆంథ్రోపిక్' సంస్థ కొత్త ఏఐ టూల్‌ను తీసుకొచ్చి సంచలనం సృష్టించింది. ఈ ప్రకటనతో అమెరికా టెక్ కంపెనీలేగాక.. భారత ఐటీ రంగ షేర్లు కుప్పకూలాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ప్రధాన కంపెనీలు దాదాపు 7 శాతం వరకు కుంగిపోయాయంటే.. 'ఆంథ్రోపిక్' ఎలాంటి అలజడి సృష్టించిందో అర్థం చేసుకోవచ్చు. ఇంతకీ ఏంటీ ఏఐ టూల్ (ఒనిబిష్ట్రతీనీజూతిఇ ంఎ ఎనీనీశ్రీ)..? ఎలా పనిచేస్తుంది.'క్లాడ్ చాట్‌బాట్' సృష్టికర్త, అమెరికా కంపెనీ ఆంథ్రోపిక్.. ఇటీవల 'క్లాడ్ కోవర్క్ ఏజెంట్'కు 11 ఓపెన్ సోర్స్ ప్లగ్ఇన్‌లను విడుదల చేసింది. లీగల్, సేల్స్, మార్కెటింగ్, డేటా అనాలిసిస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ కోసం ఈ ప్లగ్ఇన్‌లు ఉపయోగపడనున్నాయి.




ఫైనాన్స్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, బయాలజీ రీసెర్చ్, కస్టమర్ సపోర్ట్ వంటి రంగాల్లోనూ ఈ టూల్ కీలకంగా పనిచేస్తుందని కంపెనీ ప్రకటన లో వెల్లడించింది. ఈ కొత్త అప్‌డేట్లతో ఇకపై 'క్లాడ్ కోవర్క్' అనేది కేవలం చాట్‌బాట్ మాత్రమే గాక.. ఓ టీమ్‌మేట్‌లా పనిచేయనుంది. మన కంప్యూటర్‌పై వర్క్ కూడా చేయగలదు. ఈ ఏజెంట్ ఫైల్స్‌ను రీడ్ చేయగలదు. డాక్యుమెంట్లను ఎడిట్ చేయడం, కొత్త ఫైల్స్ క్రియేట్ చేసి, రీనేమ్ చేయడం, ఫోల్డర్లను ఆర్గనైజ్ చేయడం, నోట్స్‌ను రిపోర్టులుగా మార్చడం వంటివి చేస్తుంది. రచయితలు, అనలిస్టులు, జర్నలిస్టులు, విద్యార్థులు, ఆఫీసు యూజర్లు దీన్ని ఉపయోగించుకోవచ్చు. ఇక, లాయర్లు, కంపెనీల కోసం ప్రత్యేక టూల్స్ కూడా ఉన్నాయని ఆంథ్రోపిక్ తెలిపింది. సాధారణంగా డాక్యుమెంట్ రివ్యూలు, డేటా అనాలిసిస్ వంటి పనులను మల్టీనేషనల్ కంపెనీలు.. భారత ఐటీ సర్వీస్ ప్రొవైడర్లకు ఔట్‌సోర్సింగ్ కింద అప్పజెప్తుంటాయి. ఇప్పుడు ఆంథ్రోపిక్ ఏఐ టూల్‌తో ఇవన్నీ ఆటోమేటిక్‌గా జరిగే అవకాశం ఉండటం భారత ఐటీ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. పలితంగా నేటి ట్రేడింగ్‌లో ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ మైండ్ ట్రీ, టీసీఎస్, విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎంఫసిస్, పర్సిస్టెంట్ సిస్టమ్స్ వంటి కంపెనీల షేర్లు భారీగా పడిపోయాయి. ఈ పరిస్థితిని అనలిస్టులు 'సాస్పోకాలిప్స్' గా అభివర్ణిస్తున్నారు. అంటే ' కంపెనీలకు ఏఐ సాయం చేస్తుంది' అనే భావన నుంచి 'కంపెనీలను ఏఐ భర్తీ చేయగలదు' అనే స్థాయికి ఆందోళనలు పెరగడమే ఈ సాస్పోకాలిప్స్. ఇలాంటి ఏఐ టూల్స్‌తో సాఫ్ట్‌వేర్, ఐటీ సర్వీస్ కంపెనీల మధ్య పోటీతత్వ విధానాలు మారిపోతాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఐటీ కంపెనీల్లో ఉండే డెవలప్‌మెంట్, టెస్టింగ్ వంటి టాస్క్‌లను ఈ టూల్ భర్తీ చేయడంతో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### స్వల్పలాభాలతో సూచీలు..


దేశీయమార్కెట్ సూచీలు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి. నేడు సూచీలు తీవ్ర ఊగిసలాటకు గురయ్యాయి. ఐటీ షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 78 పాయింట్ల లాభంతో పెరిగి, 25,776 వద్ద ముగియగా.. నిఫ్టీ 48 పాయింట్లు లాభంతో 83,817 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 83,252 వద్ద (క్రితం ముగింపు 83,739) ప్రారంభమైంది. ఒక దశలో 83,947 వద్ద గరిష్ఠాన్ని తాకింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 9 పైసలు కోల్పోయి..90.41వద్ద స్థిరపడింది. నిఫ్టీ సూచీలో ఓఎన్‌జీసీ, ఎటర్నల్, ట్రెంట్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ముగియగా.. ఐటీ రంగ సంస్థలు ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో షేర్లు భారీగా పతనమయ్యాయి. ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ కొత్తగా ఏఐ టూల్స్‌ను తీసుకువచ్చింది. అవి డాక్యుమెంట్ రివ్యూస్, డేటా అనాలసిస్ చేయగలవని సంస్థ వెల్లడించింది. సాధారణంగా ఇలాంటి పనులను మల్టీ నేషనల్ కంపెనీలు.. భారత ఐటీ సర్వీస్ ప్రొవైడర్లకు ఔట్‌సోర్సింగ్ కింద అప్పజెప్తుంటాయి. ఆంథ్రోపిక్ ప్రకటన మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దాంతో మన ఐటీ షేర్లు ఏడు శాతం వరకు కుంగాయి.నేటి ట్రేడింగ్‌లో సిగాచీ సంస్థ 20 శాతం మేర రాణించింది. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అమిత్ రాజ్ సిన్హాకు బెయిల్ రావడం ఇందుకు కారణమైంది. గతేడాది సిగాచీ కర్మాగారంలో జరిగిన పేలుడులో 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.



### ఏఐ రేసుతో భారత్‌పై దృష్టి..

**హెచ్-1బీ ఫీజులకు చెక్.. భారత్‌లో గూగుల్ భారీ క్యాంపస్..!**

**న్యూఢిల్లీ:**హెచ్-1బీ వీసాల జారీకి అమెరికా తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో టెక్ కంపెనీలకు విదేశీ ఉద్యోగుల నియామకాలు భారంగా మారాయి. ఈ పరిణామాల నేపథ్యంలో దిగ్గజ సంస్థ గూగుల్ కీలక చర్యలు చేపట్టింది. వీసాలు, ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూడకుండా భారత్‌లో తమ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. ఇందులోభాగంగానే బెంగళూరులో భారీ క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ కథనం వెల్లడించింది.బెంగళూరులోని టెక్ కారిడార్లో ఒకటైన వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో 20వేల మంది ఉద్యోగుల కోసం గూగుల్ భారీ క్యాంపస్‌ను సిద్ధం చేసుకుంటున్నట్లు ఆ కథనం పేర్కొంది. ఇందుకోసం ఇప్పటికే ఓ ఆఫీసు టవర్‌ను గూగుల్ మాతృక సంస్థ ఆల్ఫాబెట్ లీజుకు తీసుకోగా.. మరో రెండు టవర్ల కోసం చర్చలు సాగిస్తున్నట్లు తెలిసింది. ఈ మూడు టవర్లు 24 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నట్లు తెలుస్తోంది.తొలి టవర్‌లో మరికొన్ని నెలల్లో కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు ఆ కథనం తెలిపింది. మిగతా రెండు టవర్ల నిర్మాణం వచ్చే ఏడాది నాటికి పూర్తికానుందట. మొదటి భవనం లీజును ఆల్ఫాబెట్ అధికారికంగా ధ్రువీకరించింది. ప్రస్తుతం భారత్‌లో గూగుల్‌కు 14వేల మంది ఉద్యోగులున్నారు. వైట్‌ఫీల్డ్ క్యాంపస్ పూర్తిగా మొదలైతే.. అమెరికా వెలుపల గూగుల్ కార్యకలాపాలకు భారత్ కేంద్రంగా మారనుంది.ఇప్పుడు టెక్ కంపెనీలు ఏఐపై దృష్టిపెట్టాయి. ఇలాంటి తరుణంలో మార్కెట్ సృష్టి, అధునాతన ఇంజినీరింగ్ కార్యకలాపాలకు భారత్ ప్రధాన కేంద్రంగా అవతరిస్తోంది. దీంతో దిగ్గజ కంపెనీలు మన దేశంపై దృష్టి సారిస్తున్నాయి. ఇప్పటికే ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ భారత్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించింది. గూగుల్ వంటి సంస్థలు కూడా ఆ దిశగా దృష్టిపెట్టాయి. మరోవైపు, హెచ్-1బీ వీసాలపై ట్రంప్ సర్కారు నిబంధనలు కంపెనీల విస్తరణకు కారణమవుతున్నాయి. హెచ్-1బీ వీసా దరఖాస్తులకు లక్ష డాలర్ల ఫీజు చెల్లించాలని ట్రంప్ సర్కారు నూతన నిబంధనలు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో కంపెనీలు తమ నియామక ప్రణాళికలపై పునరాలోచన చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. అమెరికాకు భారత ఉద్యోగులను తీసుకోవడం కంటే.. భారత్‌లోనే కార్యకలాపాలను సాగించడం ఉత్తమమని పలు కంపెనీలు భావిస్తున్నాయి. దీనివల్ల వీసా ఆలస్యాలు, ఖర్చులను తప్పించుకోవచ్చని టెక్ సంస్థల ఆలోచనగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గూగుల్ కొత్త క్యాంపస్ ప్రణాళికలు చేపట్టినట్లు సమాచారం.




### ట్రేడ్ డీల్‌లో భారత్‌కు కొన్ని మినహాయింపులు: అమెరికా

**వాషింగ్టన్:**అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ చాలావరకు టారిఫ్‌లు తగ్గించనుందని అగ్రరాజ్య వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ తెలిపారు. అయితే, వ్యవసాయ రంగానికి సంబంధించి కొన్ని దిగుమతులపై ఈ ఒప్పందం (ఎనిటతిజీ-జూ ఎతీజీటన ఆవజీట్రీ)లో భారత్‌కు కొంత నియంత్రణ, మినహాయింపులు కల్పిస్తున్నామని వెల్లడించారు. ఆ దిగుమతులు ఏంటనేవి నిర్ణయించేందుకు కలిసి పని చేస్తున్నామని చెప్పారు. అంటే.. ఇరుదేశాల మధ్య వ్యవసాయ ఉత్పత్తులపై టారిఫ్‌లకు సంబంధించిన చర్చలు ఇంకా ఓ కొలిక్కి రాలేదని జెమిసన్ గ్రీర్ సూచనప్రాయంగా వెల్లడించారు. "ఇరుదేశాల మధ్య ట్రేడ్ డీల్ ఒక అద్భుతమైన అవకాశం. అమెరికాకు ఇది భారీ విజయం. ఎందుకంటే భారత్‌తో మాకు వాణిజ్య లోటు ఎక్కువగా ఉంది. తాజా ఒప్పందంతో అది తగ్గనుంది. కొన్నిరకాల వ్యవసాయ ఉత్పత్తులు, తయారీ రంగ ఉపకరణాలు, కెమికల్స్, వైద్య పరికరాలపై టారిఫ్‌లు తగ్గించేందుకు భారత్ అంగీకరించింది. అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులపై భారత్‌లో దిగుమతి సుంకాలు సగటున 13.5 శాతంగా ఉన్నాయి. ఇప్పుడు అవి సున్నాకు తగ్గనున్నాయి. అగ్రరాజ్యానికి చెందిన కొన్ని రకాల గింజలు, వైన్, స్పిరిట్స్, పండ్లు, కూరగాయలపై కూడా సుంకాలు జీరోకు దిగి రానున్నాయి" అని గ్రీర్ వెల్లడించారు.ఈ సందర్భంగా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్ల అంశాన్ని కూడా జెమిసన్ గ్రీర్ ప్రస్తావించారు. "2022-23కు ముందు మాస్కో నుంచి భారత్ పెద్దగా ముడిచమురు కొనుగోలు చేయలేదు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,46,150 (22 క్యారెట్లు) | ₹ 1,59,440 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 3,20,000

### ఎప్‌స్టీన్ ఫైల్స్ వల్లే బిల్‌గేట్స్‌తో బంధం ముగిసింది: మిలిందా

**వాషింగ్టన్:**ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం దర్యాప్తులో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు సంబంధించిన పలు విషయాలు వెల్లడవడంపై ఆయన మాజీ భార్య మిలిందా స్పందించారు. బిల్‌గేట్స్ ఇతర మహిళలతో సన్నిహితంగా ఉన్నట్లు తెలియడంతో తీవ్రమైన మానసిక క్షోభను అనుభవించానని అన్నారు. ఆ కారణంగానే తమ వైవాహిక జీవితానికి ముగింపు పలికినట్లు తెలిపారు. తన జీవితంలో ఆ సమయం చాలా బాధాకరమైనదని మిలిందా పేర్కొన్నారు. తమ బంధాన్ని కాపాడుకోవడానికి కావాల్సిన విలువలను బిల్‌గేట్స్ నిలబెట్టుకోలేకపోవడం వల్లే ఆయనతో విడాకులు తీసుకున్నట్లు తెలిపారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్‌గేట్స్ గురించి బయటకు వచ్చిన విషయాలపై ఆయనే సమాధానం చెప్పుకోవాలని, తాను కాదని వ్యాఖ్యానించారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బాధితులుగా ఉన్న మహిళలకు న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నానన్నారు.మూడు దశాబ్దాల వివాహ బంధానికి స్వస్తి పలుకుతూ బిల్‌గేట్స్ - మిలిందా (ఐఱశ్రీశ్రీ ఱ ఓఱశ్రీఱఅఝఱ ఉఱ్‌బిఎ) దంపతులు 2021లో విడాకులు తీసుకున్నారు. వీరికి 20 ఏళ్లకు పైబడిన ముగ్గురు పిల్లలున్నారు. అయితే, ఎప్‌స్టీన్‌తో గేట్స్‌కు సంబంధాలు ఉండడం నచ్చని మిలిందా ఆయన నుంచి విడాకులు తీసుకుందని ప్రముఖ పత్రిక వాల్ స్ట్రీట్ జర్నల్ అప్పట్లో ఓ కథనంలో పేర్కొంది. అమెరికా న్యాయశాఖ ఇటీవల విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోనూ గేట్స్ రష్యన్ మహిళలతో లైంగిక సంబంధాలు నెరిపారని.. అందువల్లే ఆయన సుఖవ్యాధుల బారిన పడ్డారని ఎప్‌స్టీన్ ఆరోపణలు చేశారు. ఈ విషయం బయటపడకుండా ఉండేందుకు ఆయన తన భార్య మిలిందాకు రహస్యంగా ఇచ్చేందుకు యాంటీబయాటిక్స్ తనను అడిగారని తెలిపారు. కాగా ఈ ఆరోపణలను గేట్స్ బృందం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా అసంబద్ధమైనవని పేర్కొంది.






## ఉత్తర జపాన్‌లో తీవ్ర హిమపాతం

**జపాన్‌లోని అనేక ప్రాంతాలను భారీ హిమపాతం ముంచెత్తింది. గత రెండు వారాలుగా ఉత్తర జపాన్‌లో కురుస్తున్న భారీ మంచు కారణంగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 35 మంది మరణించారని.. 300 మందికి పైగా గాయాలపాలయ్యారని అధికారులు వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా 72 అంగుళాల మేర మంచు పేరుకుపోయినట్లు తెలిపారు. అతిశీతల వాతావరణం కారణంగా గుండెపోటు మరణాలు కూడా అధికసంఖ్యలో నమోదవుతున్నాయన్నారు.జపాన్ ప్రభుత్వ ప్రధాన ప్రతినిధి మాట్లాడుతూ.. భారీగా మంచు పేరుకుపోవడంతో దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థతో పాటు ఇతర ప్రజాసేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. పలు ప్రాంతాల్లో కొండ చరియలు విరిగి పడుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. మంచును తొలగించడానికి టాస్క్ ఫోర్స్ బృందాలను** నియమించామన్నారు. ఇంత అధికంగా మంచు కురవడం గత 40 ఏళ్లలో ఇదే మొదటిసారని.. రానున్న రోజుల్లో హిమపాతం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు.



### టీవీ చూడటంలో చిన్నాపెద్దా మధ్య తేడాలు

లండ్ (స్వీడన్): కుటుంబంలో పెద్ద కుమారులు, కుమార్తెలు పెరిగే తీరుకూ చిన్నవాళ్లు పెరిగే తీరుకూ తేడాలుంటాయి. శ్రేష్ఠ సంతానం వివిధ అంశాల్లో ముందుంటారు. తమ్ముళ్లు, చెల్లెళ్లకన్నా పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధిస్తారు, పెద్దయ్యాక ఉన్నత స్థాయి మేనేజర్లుగా రాణిస్తారు. దీనికి తేడాలేమిటో తెలుసుకోవాలని ఆస్ట్రేలియా, అమెరికాల్లోని శాస్త్రవేత్తలు పరిశోధన జరిపారు. మొదట ఆస్ట్రేలియాలో 2-15 ఏళ్ల మధ్య వయసులోని 5,500 మంది పిల్లలపై అధ్యయనం జరిపారు. వారి దిన చర్యలో నిద్ర, పాఠశాల చదువు, నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంచే కార్యకలాపాలు, టీవీ-వీడియో వీక్షణం, వ్యాయామంగా విభజించి పరిశీలించారు.



పుస్తక పఠనం, హోం వర్కు చేయడం, గిటార్ వంటి సంగీత వాద్య అభ్యాసం, లూడో, మోనోపలీ, వైకుంఠపాళి ఆటల్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలుగా పరిగణించారు.అధ్యయనానికి ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న కుటుంబాలను ఎంచుకున్నారు. అమెరికాలోనూ ఇదే విధంగా అధ్యయనం జరిపారు. శ్రేష్ఠ సంతానంకన్నా రెండో, మూడో బిడ్డలు వారానికి గంట నుంచి గంటన్నరసేపు ఎక్కువగా టీవీ చూడటం, వీడియో గేమ్స్ ఆడటం చేస్తున్నారని తేలింది. 10-14 ఏళ్ల పిల్లల్లో ఇది స్పష్టంగా కనిపించింది. చదువు, వ్యాయామాల్లో పెద్దవారికీ చిన్నవారికీ తేడా లేదు. పుస్తక పఠనం, నైపుణ్యాన్ని పెంచే బోర్డు క్రీడలు ఆడటంలో చిన్నవాళ్లు శ్రేష్ఠులకన్నా తక్కువ సమయం వెచ్చించారు. ఇది వారి విద్యా నైపుణ్యాల అభివృద్ధికి విఘాతం కలిగిస్తోంది. చిన్న పిల్లలు ఎక్కువసేపు టీవీ చూడటం వల్ల అసభ్య చిత్రాలు చూసే ప్రమాదం ఎక్కువ అవుతోంది. 'దీన్ని నివారించడానికి తల్లిదండ్రులు చిన్నవాళ్లతో ఎక్కువ సమయం గడపాలి. వారితో పుస్తక పఠనం, నైపుణ్యాభివృద్ధి క్రీడలు ఆడించాలి. పదహారేళ్ల లోపువారు టీవీ చూసే సమయం.. అందులోని కంటెంట్‌పై నియంత్రణ విధించాలి' అని పరిశోధకులు సూచించారు.

### మణిపూర్ సీఎంగా ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం

స్వీకారం చేశారు.మణిపూర్‌లో 2023 మేలో మొదలైన జాతుల మధ్య ఘర్షణలు హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. 260 మందికిపైగా మృతి చెందగా.. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ ఘటనల నేపథ్యంలో గతేడాది ఫిబ్రవరిలో అప్పటి సీఎం బీరేన్‌సింగ్ రాజీనామా చేశారు. అనంతరం రాష్ట్రపతి పాలన విధించారు. దాదాపు ఏడాది తర్వాత బుధవారం ఎత్తివేశారు.ఖేమ్‌చంద్ సింగ్ ఇప్పటికే రాష్ట్ర ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యారు. 2017 నుంచి 2022 వరకు మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022లో బీరేన్‌సింగ్ సర్కారులో మంత్రిగా నియమితులయ్యారు. మణిపూర్‌లోని మూడు కీలక సామాజిక వర్గాలతోనూ (మైతేయిలు, కుకీలు, నాగాలు) సత్సంబంధాలు కలిగి ఉండటం ఆయనకు కలిసొచ్చినట్లు తెలుస్తోంది.

### దేశ ప్రయోజనాల కోసమే వాణిజ్య ఒప్పందం

బలపడతాయని గోయల్ పేర్కొన్నారు. తోలు ఉత్పత్తులు, సేంద్రియ రసాయనాలు, రబ్బరు ఉత్పత్తులు, యంత్రాలు, విమాన తయారీ రంగంలోని కార్మికులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. చైనా, బంగ్లాదేశ్, మలేసియా, కంబోడియా, వియత్నాం లకన్నా తక్కువ సుంకాలే మనకు అమలు కానున్నాయని పేర్కొన్నారు. దీనిపై త్వరలో రెండు దేశాలు సంయుక్త ప్రకటన చేయనున్నాయని, అందులో మరిన్ని వివరాలు వెల్లడవుతాయన్నారు.

### మీరు నవ్వినట్లు ఎప్పుడూ చూడలేదు

మహిళా జర్నలిస్ట్‌తో ట్రంప్

**వాషింగ్టన్:**అమెరికా అధ్యక్ష భవనంలోని ఓవల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సీఎన్ఎన్ ఛానల్‌కు చెందిన ఓ రిపోర్టర్‌పై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో కొత్తగా విడుదలైన పత్రాల గురించి సీఎన్ఎన్ ఛానల్‌కు చెందిన కైట్లాన్ కోలిన్స్ అనే రిపోర్టర్ ట్రంప్‌ను ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన అమెరికా అధ్యక్షుడు 'నువ్వో చెత్త రిపోర్టర్‌వి' అంటూ ఆమెను విమర్శించారు. "నేను పదేళ్లుగా మిమ్మల్ని చూస్తున్నాను. ఇప్పటివరకు ఒక్కసారి కూడా నవ్వినట్లు చూడలేదు. మీలాంటి వాళ్ల వల్లే సీఎన్ఎన్ ఛానల్ రేటింగ్ పడిపోతోంది. మీరు ఎప్పుడూ నిజాలు చెప్పరని మాకు బాగా తెలుసు. అందుకే ఎప్పుడూ సీరియస్‌గా ఉంటారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో నాతో సహా ఇతరుల పేర్లను కుట్ర పూరితంగా విడుదల చేశారు. ఇప్పుడు ఇటువంటి విషయాల గురించి కాకుండా దేశం గురించి ఆలోచిస్తే అందరికీ మంచిది" అని ట్రంప్ రిపోర్టర్‌ని ఉద్దేశించి అన్నారు. ఈ మీడియా సమావేశానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి అమెరికా న్యాయశాఖ ఇటీవల మరిన్ని పత్రాలను విడుదల చేసింది. అందులో మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ, బిల్ గేట్స్, పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్‌ల ప్రస్తావన, వారికి సంబంధించిన ఫొటోలు ఉన్నాయి. అయితే, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సంబంధించిన ఫొటోలు మాత్రం ఎక్కడా కనిపించలేదు. దీనిపై తాజాగా జరిగిన విలేకరుల సమావేశంలో రిపోర్టర్ అమెరికా అధ్యక్షుడిని ప్రశ్నించారు.





### లిబియా ఒకప్పటి నియంత గడాఫీ కుమారుడి హత్య..!

**న్యూఢిల్లీ:**లిబియా ఒకప్పటి నియంత దివంగత గడాఫీ కుమారుడు సయీఫ్ అల్ ఇస్లాం (53) హత్యకు గురయ్యారు. సాయుధ దుండగుల కాల్పుల్లో మరణించారని ఆయన బృందంలోని ఒకరు పేర్కొన్నారు. సయీఫ్ సలహాదారుడు మీడియాతో మాట్లాడుతూ.. నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు జింటాన్‌లోని గడాఫీ ఇంటిలోకి చొరబడ్డారని తెలిపారు. నిఘా కెమెరాలను ధ్వంసం చేసి.. ఆ తర్వాత ఆయనను కాల్చి చంపారన్నారు. ఈ హత్య వెనక ఎవరున్నారనే దానిపై స్పష్టత లేదు. ఈ ఘటనకు కొన్ని రోజుల ముందు తన భద్రత గురించి సయీఫ్ తన స్నేహితుడి వద్ద ఆందోళన వ్యక్తంచేసినట్లు తెలిపారు. ఇక, గడాఫీ మరణం తర్వాత లిబియా రాజకీయాల్లో సయీఫ్ చురుగ్గా ఉన్నారు. 2021లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ఆయన ప్రకటించగా, పలు కారణాల వల్ల ఆ ఎన్నికలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.



# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- సిరిసిల్ల, వేములవాడలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన
- కౌంటింగ్ సెంటర్లలో భద్రత, సీసీటీవీలపై ప్రత్యేక దృష్టి
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 4 (జనంసాక్షి) :** ఈ నెల 11న జరుగనున్న మున్సిపల్ ఎన్నికలలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల క్రమంలో సిరిసిల్ల,వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో చేస్తున్న ఏర్పాట్లను బుధవారం ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి ఆమె పరిశీలించారు.జిల్లా కేంద్రంలోని గీతానగర్ జిల్లా పరిషత్ స్కూల్, వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రలను పరిశీలించారు.స్కూల్, కళాశాల ఆవరణల్లో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పలు సూచనలు చేశారు. సిరిసిల్ల, వేములవాడలోని సీ నారాయణరెడ్డి కళా మందిరాల్లో రిసెప్షన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రం కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.కౌంటింగ్ హాల్‌లో భద్రతా ఏర్పాట్లు, సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, తాగునీరు సదుపాయాలు కల్పించాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల పార్కింగ్ కోసం చదును చేస్తున్న స్థలాన్ని సందర్శించారు. కళామందిరం లోపల స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపు కోసం ఎన్ని టేబుల్స్, అధికారులు, పోటీలో ఉన్న అభ్యర్థులకు కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల పార్కింగ్, క్రమబద్ధమైన రాకపోకలు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

**మీడియా సెంటర్ ఏర్పాటుపై సూచనలు చేశారు.**

ఆమె వెంట సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు,రాధాభాయి, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా,సంపత్ కుమార్, నోడల్ అధికారులు శ్రీనివాసాచారి, ప్రవీణ్,తహసీల్దార్లు మహేష్ కుమార్,జయంత్ కుమార్ పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఐసీఏఐ నూతన భవన నిర్మాణానికి శ్రీకారం

- ఆధునిక సదుపాయాలతో రూపుదిద్దుకోనున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కార్యాలయం




**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 04 (జనంసాక్షి) :** నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కరీంనగర్ శాఖ నూతన భవన నిర్మాణానికి బుధవారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. హౌసింగ్ బోర్డు పరిధిలో 35 గుంటల విస్తీర్ణంలో అత్యాధునిక సదుపాయాలతో ఈ భవనాన్ని నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ఐసీఏఐ జాతీయ అధ్యక్షులు సీఏ చరణ్‌జోత్ సింగ్ నందా ముఖ్య అతిథిగా హాజరై వేదమంత్రాల నడుమ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఏఐ ఉపాధ్యక్షులు సీఏ ప్రసన్న కుమార్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సీఏ ముప్పాల శ్రీధర్, సీఏ దయానివాస్ శర్మ, సీఏ రేవతి, ఎస్. రఘునాథన్ పాల్గొని కార్యక్రమానికి శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నూతన భవనాన్ని అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుమారు 800 మంది చార్టర్డ్ అకౌంటెంట్లు, సిఏ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్మార్ట్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక సెమినార్ హాల్స్, కాన్ఫరెన్స్ రూమ్స్, శిక్షణ కేంద్రాలు, పరిశోధన సదుపాయాలు, సభ్యుల పరస్పర సమావేశాల కోసం ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని టెక్నాలజీ ఆధారిత శిక్షణా కార్యక్రమాలకు అనుకూలంగా భవనాన్ని రూపుదిద్దనున్నట్లు తెలిపారు. ఈ భవనం నిర్మాణం పూర్తయిన తరువాత కరీంనగర్ మాత్రమే కాకుండా పరిసర జిల్లాల సిఏ విద్యార్థులు, వృత్తి నిపుణులకు ఇది ప్రముఖ శిక్షణా కేంద్రంగా మారనున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. సిఏ రంగంలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుందని సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ ప్రాంతానికి చెందిన సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సీఏ బాబు అబ్రహామ్ కల్లివయలిల్, సీఏ మధుకర్ నారాయణ హిరేగంగే, సీఏ రాజేంద్ర కుమార్ పి, సీఏ శ్రీప్రియా కే తదితరులు హాజరై నిర్మాణ పనులకు శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్ బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ సభ్యులు సీఏ యర్ర తిరుపతయ్య, సీఏ రామిడి సంతోష్, సీఏ వనపట్ల శేఖర్ రెడ్డి, సీఏ గాంద్రెడ్డి శ్రీనివాస్, సీఏ బెక్కంటి అజయ్ కుమార్, సీఏ కరుకూరి మల్లేశం, సీఏ మార్గం శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# నెలలు గడిచిన ఉపాధి కూలీలకు అందని డబ్బులు

- పని చేసిన డబ్బులు చెల్లించి ఆదుకోవాలని కూలీల డిమాండ్



**ముత్తారం ఫిబ్రవరి 4 (జనంసాక్షి) :** గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మొక్కలు నాటేందుకు పదిమంది సభ్యులు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి వారం రోజులుగా గ్రామ శివారులోని అటవీ ప్రాంత సమీపంలో మొక్కలు నాటిన పని దినాలకు సంబంధించిన ఉపాధి హామీ డబ్బులు రావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో వారం రోజులపాటు పనిచేసి ఏడు,ఎనిమిది నెలలు గడిచిన కూడా పని చేసిన పనులకు డబ్బులు రావడం లేదంటూ, పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం హరిపురం గ్రామానికి చెందిన నాగవెల్లి జగదీశ్వర్ అన్నారు.ఈ విషయంపై కూలీలు సంబంధిత అధికారులను అడిగినా కూడా స్పందించడం లేదని తెలిపారు.నెలల తరబడి కార్యాలయల చుట్టూ తిరుగుతున్న అధికారులు మాత్రం మొక్కలు నాటిన పని దినాల డబ్బుల కోసం కూలీలను ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిప్పడమే కాకుండా డబ్బులు కూలీలకు అందించే ప్రయత్నం చేయకపోవ డంపై కూలీలు మండిపడుతున్నారు.

అంతేకాకుండా గ్రామంలో నేటినుండి గ్రామంలో పనిచేయడానికి దరఖాస్తు చేసుకోవాలని గ్రామ వాట్సప్ గ్రూపులో సమాచారం పెట్టడంతో కూలీలు పనికి వెళ్లాలంటే డబ్బులు వస్తాయో రావో అని అయోమయంలో ఆందోళన గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కూలీలకు డబ్బులు అందించే విధంగా చర్యలు చేపట్టడంతో పాటు అధికారులపై కఠినమైన అనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ విషయంపై సంబంధిత అధికారిని వివరణ కోరగా ఏపివో దయామని మాట్లాడుతూ మా కార్యాలయంలో ఎలాంటి పెండింగ్ లేవని తెలపడంతో పాటు గ్రామంలో పెండింగ్ లో ఉన్న కూలీల డబ్బులకు సంబంధించిన వివరాల గురించి టెక్నికల్ అసిస్టెంట్,బత్తుల అంజయ్యను,పంచాయతీ కార్యదర్శి నవ్యను అడిగి తెలుసుకొని కూలీలకు డబ్బులు అందించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆమె తెలిపారు.

# జీడికే. ఓసిపి5లో రికార్డ్ స్థాయి బొగ్గు ఉత్పత్తి.. ఉత్పాదకత

**జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్**



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి ఆర్జీ. 1 ఏరియా ఓసి.5 ప్రాజెక్ట్‌లో ఉత్పత్తి ఉత్పాదక లక్ష్యా సాధనలో కేటాయించిన లక్ష్యం 9,666 టన్నులకు గాను నిన్న మంగళవారం మూడు షిఫ్టులలో కలిపి ఒక్కరోజు 20,031 టన్నుల బొగ్గు ఉత్పత్తిని, 18,831 టన్నుల బొగ్గు రవాణా సాధించడం జరిగినది. ఈ రికార్డును నెలకొల్పిన సందర్భంగా ఆర్జీ.1 జియం డీ లలిత్ కుమార్ జిడికే ఓసి.5 ప్రాజెక్ట్ సందర్శించి ఉద్యోగులను, సూపర్వైజర్లను, అధికారులను, యునియన్ ప్రతినిధులను అభినందించి కేక్ కట్ చేసి అందరికి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ గతంలో తేది.30.03.2024 రోజున ఒక్కరోజు బొగ్గు ఉత్పతి 19,113 టన్నులు కాగా నిన్నటి రోజు 20,031 టన్నుల బొగ్గు ఉత్పత్తిని మరియు 18,831 టన్నుల బొగ్గు రవాణా సాదించి కొత్త రికార్డును నెలకొల్పడం జరిగినదని ఇది అందరి సమిష్టి కృషితో అత్యుత్తమ పనితీరుతో పరస్పర సహకారం, సమన్వయం, క్రమశిక్షణ మరియు అంకితభావంతోనే ఈ రికార్డు సాధ్యమయిందని జియం ప్రశంసించారు.

ఈ అద్భుత విజయాలు ఆర్.జి. ఏరియాకు గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ఈ విజయాలు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఇదే విధంగా ఈ ఆర్థిక సంవత్సారానికి కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలను కూడా ఇదే స్పూర్తితో అధిగమించాలని జియం గారు తెలిపారు.

ఈ కార్యక్రమములో గుర్తింపు సంఘం ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ డి.రమేష్, ప్రాజెక్ట్ ఇంజనీర్ పి.రమేష్, స్టాటుటరి మేనేజర్ రమేష్ బాబు, మేనేజర్ అనిల్ గబాలే, సేఫ్టీ ఆఫీసర్, సీఎంవో ఏఐ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పోనుగోటి శ్రీనివాస్, సియంవోఏఐ ఆర్.జి.1 ఉపాధ్యక్షులు పెరుమాండ్ల శ్రీనివాస్, సీనియర్ సర్వే అధికారి దీటి చంద్రమౌళి, గని క్వాలిటీ ఇంచార్జ్ ఏ.రవి, బేస్ వర్క్ షాప్ ఇంచార్జ్ ఆర్ మహేష్, సంక్షేమాధికారి దాసరి నాగారాజు, ఎఐటియుసి ఫిట్ సెక్రటరి గుర్రం ప్రభుదాస్, పీసీ పటేల్ కాంట్రాక్ట్ మేనేజర్ గౌరంగ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



**నిజామాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 4 జనంసాక్షి :** మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష జరిపారు. నగర పాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ ఏర్పాట్ల గురించి కమిషనర్ దిలీప్ కుమార్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ ముద్రణ గురించి ఆరా తీశారు. గోప్యతను పాటిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ముద్రణ జరిపించాలని, పోలీసు భద్రత మధ్యన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ పూర్తయిన మీదట వివరాలు ఎక్కడ కూడా బయటకు వెల్లడి కాకుండా చూడాలని, ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ముద్రణ అనంతరం సాఫ్ట్ కాపీలను పూర్తిస్థాయిలో హార్డ్ డిస్క్ నుండి కూడా తొలగించేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎన్నికల సంఘం క్రిమినల్ చర్యలు చేపడుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని బ్యాలెట్ పత్రాల ముద్రణ విషయంలో ఎంతో అప్రమత్తతో వ్యవహరించాలని అన్నారు. కాగా, పోలింగ్ కేంద్రాలలో కనీస సదుపాయాలను మరోమారు క్షేత్రస్థాయిలో సరిచూసుకోవాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు అదనంగా పోలింగ్ సిబ్బందిని కేటాయిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ జరిపిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. పోలింగ్ ముగిసిన వెంటనే గట్టి బందోబస్తు మధ్యన బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ సెంటర్‌కు తరలించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఎలాంటి తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో డీఆర్‌డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించాలి

**రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ**



**గోదావరిఖని, జనంసాక్షి :** అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ కోరారు. రామగుండం నగర పాలక సంస్థ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులతో ఎన్‌టిపిసి, పిటిఎస్‌లోని కాకతీయ కళ్యాణ మండపంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్ బుక్ అభ్యర్థులకు అందజేయడం జరిగిందని అన్నారు. ఈ హ్యాండ్ బుక్ లో పేర్కొన్న నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. సందేహాల నివృత్తి కోసం అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులను, రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఎలెక్షన్ సెల్ ను సంప్రదించవచ్చని అన్నారు. అన్నారు. ప్రచారంలో ఉపయోగించే వాహనాలకు నగర పాలక సంస్థ నుండి అనుమతి పొందాలని అన్నారు. ఈ అనుమతి పత్రాన్ని వాహనం పై ప్రదర్శించాలని అన్నారు. ఎన్నికల వ్యయ పరిమితి రూ 1.50 లక్షలకు మించరాదని అన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన రేట్ల ప్రకారం అభ్యర్థి వ్యయం లెక్క కట్టడం జరుగుతుందని అన్నారు.

ఎసిపి ఎం. రమేష్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరగడానికి అభ్యర్థులు పోలీసులకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. మైకులు/లౌడ్ స్పీకర్‌లు ఉపయోగించుకోవడానికి అనుమతి కోసం మీ సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ర్యాలీలపై కూడా పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని అన్నారు. నిర్ణీత వేళల్లో నే ప్రచారం చేయాలని అన్నారు. డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. తనిఖీలు నిర్వహిశీచడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలు కూడా గస్తీ తిరుగుతున్నాయని అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే నగర పాలక సంస్థ కార్యాలయంకు సమాచారం ఇవ్వాలని అన్నారు. శిక్షకులు స్వరూప్ చంద్, శ్రీనివాస్ లు అభ్యర్థులు అనురించాల్సిన ప్రవర్తన నియమావళి పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వడంలో పాటు అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ఎన్నికల పరిశీలకులు పద్మజా రాణి, వ్యయ పరిశీలకులు సుజాత, కృష్ణ మోహన్, రవి బాబు, నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ వేంకటేశ్వర్లు, ఎసిపి శ్రీహరి, టిపిఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ సిఐలు ఇంద్రసేనా రెడ్డి, ప్రసాద రావు తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

**పటిష్ట బందోబస్తును కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి సమీక్షించిన సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేడు (ఫిబ్రవరి 5న) కరీంనగర్ జిల్లా, చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్ శివారులో పర్యటించనున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో బుధవారం రోజు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పోలీస్ కమిషనర్ (సీపీ) క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. గుమ్లాపూర్ వద్ద ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం, హెలిపాడ్ పార్కింగ్ స్థలాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సీపీ అధికారులను ఆదేశించారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులకు, సిబ్బందికి, సీపీ మ్యాప్ ద్వారా రూట్ మ్యాప్, విధులను వివరించారు. ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు లేకుండా భారీ పోలీస్ మోహరింపును ఏర్పాటు చేసినట్లు సీపీ స్పష్టం చేశారు. సభా ప్రాంగణం, చుట్టుపక్కల ప్రాంతాలను డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టారు. సభకు వచ్చే భారీ జనం, వాహనాల దృష్ట్యా ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ట్రాఫిక్ విభాగాన్ని ఆదేశించారు. సభా ప్రాంగణంలో బారికేడ్ల నిర్మాణం, ప్రజల రాకపోకల మార్గాలను పరిశీలించి, భద్రతా ప్రమాణాల మేరకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులతో పాటు రెవెన్యూ, ఫైర్, ఆర్ అండ్ బి, ఫారెస్ట్, వైద్య, ఎక్సైజ్, ఐ అండ్ పిఆర్ విభాగాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

- సోషల్ జస్టిస్ డే వేడుకలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న చైన్ మేన్ ఈ. రఘు సస్పెండ్

**పెద్దపల్లి, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) :** సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సోషల్ జస్టిస్ డే వేడుకల్లో అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2024 ఫిబ్రవరి 4న తెలంగాణ ప్రభుత్వ కేబినెట్ కుల సర్వే నిర్వహణకు, ఎస్సీ కుల వర్గీకరణకు అనుకూలంగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శాస్త్రీయంగా కుల సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఆ నిర్ణయాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న సోషల్ జస్టిస్ డేగా జరుపుకుంటామని అన్నారు. ప్రభుత్వం వివిధ సామాజిక వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, కలెక్టరేట్ ఏవో బి. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**విధుల్లో నిర్లక్ష్యం.. చైన్‌మేన్ సస్పెండ్**

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న చైన్‌మేన్ ఈ. రఘును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మంథని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో డెప్యూటేషన్‌పై చైన్‌మేన్‌గా పనిచేస్తున్న ఈ. రఘు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వైఖరి కనబరిచారని, అనేకసార్లు మెమోలు జారీ చేసినా గైర్హాజరు కావడం గమనించామని మంథని ఆర్‌డీఓ నివేదిక సమర్పించారు. ఆధారాలను పరిశీలించిన కలెక్టర్, కమాన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయానికి చెందిన ఈ. రఘును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ కాలంలో అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్ వదలి వెళ్లరాదని ఆదేశించారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపిస్తే జవాబు దారిగా పనిచేస్తారు

- పట్టణ వాసులు ఆలోచించాలి
- పెద్దపల్లిలో త్వరలో బైపాస్, ఐటీ పార్క్ కార్యచరణలో ఉంది
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**పెద్దపల్లి, ఫిబ్రవరి 04 (జనంసాక్షి) :** పెద్దపల్లి పట్టణంలోని గోల్డెన్ తులిప్ బాంకెట్ హాల్‌లో బుధవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావుతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో దశల వారీగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మొన్న జరిగిన గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించి గెలిపించారని సంతోషం వ్యక్తం చేశారు, అదేవిధంగా రామగుండం మున్సిపాలిటీ, సుల్తానాబాద్, మంతిని, పెద్దపల్లి పట్టణ వాసులు అందరికీ ఎప్పుడు లేని విధంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చొరవ తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నిధులు తెచ్చి పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, నేటి సౌకర్యం, స్కిల్ డెవలప్మెంట్, ఆచరణలో పెట్టి అభివృద్ధి చేస్తూ ఉన్నారని. ఈ జిల్లా మంత్రిగా రేపు రాబోయే కాలంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగే అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు నిధులు సమకూర్చే దిశగా అడుగులు వేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అనంతరం నిరుద్యోగులకు గ్రూప్ 2, గ్రూప్ , గ్రూప్ 3, గ్రూప్ 4, ఉద్యోగాలు కల్పించామని విద్యార్థులకు ఉచిత శిక్షణాలు అందిస్తున్నామని తెలిపారు, ప్రభుత్వ ఐటిఐ లో ఏటీసీ శిక్షణ ప్రారంభించామని పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు పట్టు పట్టి నిధులు తీసుకువచ్చి పట్టణాలను అభివృద్ధి చేస్తారని మున్సిపాలిటీ కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని అభ్యర్థించారు, జవాబుదారితనంతో పనిచేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తోట్ల తిరుపతి యాదవ్, కాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి
- రోజూ ఉదయం-సాయంత్రం రిమీడియల్ తరగతులు నిర్వహించండి
- తల్లిదండ్రుల సహకారంతో 100 శాతం ఉత్తీర్ణత సాధ్యమే
- స్కాలర్షిప్ అప్లికేషన్లు తప్పనిసరి పూర్తి చేయండి



**సిరిసిల్ల టౌన్ ఫిబ్రవరి 4 (జనం సాక్షి) :** పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో మొత్తం 4,405 మంది పదో తరగతి విద్యార్థులు మార్చి 14 నుంచి ప్రారంభమయ్యే పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారని డీఈఓ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. గత ఏడాది ఫలితాలు, ఫెయిల్ అయిన విద్యార్థుల సంఖ్య, దానికి గల కారణాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. పదో తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే కీలక దశ అని గరిమ అగ్రవాల్ అన్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా వారి జీవితంపై గాఢమైన ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ప్రతి ఉపాధ్యాయుడు తన బాధ్యతను పూర్తిస్థాయిలో అర్థం చేసుకుని అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

ప్రతి పాఠశాలలో విద్యార్థులను సామర్థ్యం ఆధారంగా బలమైనవారు, సగటు, వెనుకబడినవారు అని విభజించి గుర్తించాలని, ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. రేపటి నుంచి పరీక్షల వరకు రోజూ ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు, రిమీడియల్ క్లాసులు నిర్వహించి నిరంతర శిక్షణ అందించాలని స్పష్టం చేశారు. పరీక్షల భయాన్ని విద్యార్థుల నుంచి తొలగించేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సాహకరంగా వ్యవహరించాలని, మోడల్ ప్రశ్నాపత్రాలు, గత సంవత్సరాల పేపర్లతో విస్తృతంగా అభ్యాసం చేయించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రగతిని నిరంతరం సమీక్షించి, మార్కుల్లో మెరుగుదల లేని చోట తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిరంతర గైర్హాజరు విద్యార్థుల తల్లిదండ్రులతో వ్యక్తిగతంగా మాట్లాడి పాఠశాలకు పంపేలా చైతన్యం కల్పించాలని, చదువు, లోపాలపై తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని చెప్పారు. జిల్లాలోని ప్రతి పాఠశాల ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని, ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా చూడాలని స్పష్టం చేశారు. విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పాఠశాలల పనితీరును పర్యవేక్షించాలని, అవసరమైన మార్గదర్శనం అందించాలని ఆదేశించారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు సాధించేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్షిప్ అప్లికేషన్లు తప్పనిసరిగా పూర్తి చేయించాలని ఆదేశించారు. అర్హులైన విద్యార్థుల జాబితా సిద్ధం చేసి, సర్టిఫికెట్లు, బ్యాంక్ ఖాతాల వివరాలు సకాలంలో సమకూర్చి, ప్రతి పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడికి బాధ్యత అప్పగించి ఆన్‌లైన్ అప్లికేషన్లు పూర్తి చేయించాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఏఎస్‌డబ్ల్యూఓ విజయలక్ష్మి, ఎంఈఓలు, డీసీఓలు, ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

# భూతగాదాలో మహిళా యువ లాయర్ హత్య

- సొంత చెల్లెలిని కడతేర్చిన సోదరుడు
- రాయితో తలపై కొట్టి.. కత్తితో గొంతు కోశాడు
- పోలీస్ స్టేషన్ ముందు న్యాయవాదుల ఆందోళన
- గతంలో రెండుసార్లు హత్యాయత్నాలు





**మొయినాబాద్ జనవరి 4 జనంసాక్షి :** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామంలో భూ తగాదాకు సొంత అన్న దారుణ హత్య చేసిన ఘటన జరిగింది. గ్రామానికి చెందిన యువ న్యాయవాది గోటికే స్వప్న (34) బుధవారం ఉదయం ఈ దారుణానికి గురైంది. స్వప్న తల్లి వెంకటమ్మకు ఇద్దరు కూతుళ్లు (సరస్వతి, స్వప్న), ఒక కుమారుడు (రాజు) ఉన్నారు. వీరికి 10 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, గ్రామస్తుల సమక్షంలో రాజుకు 6 ఎకరాలు, స్వప్నకు 4 ఎకరాలు కేటాయించారు. చెల్లెలకు ఎక్కువ భూమి ఇచ్చారన్న కోపంతో గత కొన్నేళ్లుగా రాజుతో స్వప్నకు వివాదం కొనసాగుతోంది. స్వప్న నెలరోజుల్లో పెళ్లి కావాల్సి ఉండగా, బుధవారం ఉదయం తల్లితో కలిసి తన భూమిని సర్వే చేయించేందుకు పొలానికి వెళ్లింది.


అక్కడే ఉన్న రాజు మరో వ్యక్తితో కలిసి స్వప్న తలపై రాయితో కొట్టి, వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోసినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు, గ్రామస్తులు స్వప్నను భాస్కర్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. స్వప్న గత నాలుగేళ్లుగా చేవెళ్ల కోర్టులో జూనియర్ న్యాయవాదిగా పనిచేస్తోం ది. ఆమెపై గతంలో రెండుసార్లు హత్యాయత్నాలు జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా, అవి సంబంధం లేనివని అప్పట్లో విచారణ ముగిసినట్లు సమాచారం. ఈ ఘటనపై చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే, పోలీసులు వారిని అమర్యాదగా బయటికి పంపించారు. దీంతో న్యాయవాదులు స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారిపై అరగంటసేపు ట్రాఫిక్ స్తంభించింది. చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ నచ్చజెప్పడంతో ఆందోళన విరమించింది. అనంతరం భారీ సంఖ్యలో న్యాయవాదులు స్టేషన్‌కు చేరుకుని స్వప్నకు నివాళులర్పించారు. హైకోర్టు న్యాయవాదులు రఘునాథ్, ఆకుల మహేష్ కుమార్, చేవెళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మహేష్ గౌడ్ మాట్లాడుతూ, పోలీసులు న్యాయవాదులను అమర్యాదగా చూడడం సరికాదని, రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

# అవసరానికి వాడుకుని వదిలేస్తారా?

## చల్లాపై 'సీజనల్ పాలిటిక్స్' ముద్ర



- నిద్రాహారాలు మాని పనిచేస్తే.. మొహం చాటేస్తారా?
- వంశీచంద్ రెడ్డిపై మండిపడుతున్న అనుచరులు
- చల్లా రాకకై ఎదురుచూపులు.. అభ్యర్థుల్లో పెరుగుతున్న అసంతృప్తి



మహబూబ్‌నగర్ బ్యూరో ఫిబ్రవరి 04 (జనంసాక్షి) మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో మాజీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి వైఖరి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల వేడి తారస్థాయికి చేరిన వేళ, అభ్యర్థులను వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిన కీలక నేత నియోజకవర్గానికి దూరంగా ఉండట ంపై కార్యకర్తలు మండిపడుతున్నారు. సర్పంచ్ ఎన్నికల సమయంలోనూ అస్సలు కనిపించకపోవడం, ఎన్నికల ఓటమి తర్వాత అదే ధోరణి కొనసాగడంతో కార్యకర్తలు తమ కష్టానికి ఏ మాత్రం గుర్తింపు ఇవ్వడం లేదని బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

చల్లా వంశీచంద్ రెడ్డి తన సొంత ఎన్నికలప్పుడు మాత్రమే ఊర్ల మీద పడతారు. ఓట్లు అడగడానికి గడపగడపకూ తిరుగుతారు. కానీ, ఎన్నికలు ముగిసిన తర్వాత కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఆయన అందుబాటులో ఉండరు అని పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం కార్యకర్తలు నిద్రాహారాలు మాని కష్టపడితే, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కనీసం ముఖం కూడా చూపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సర్పంచ్ ఎన్నికల నుంచే అదే తీరు

ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల సమయంలోనూ చల్లా వంశీచంద్ రెడ్డి ఎక్కడా కనిపించలేదని, ఇప్పుడు కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతున్నా అదే పంథాను అనుసరిస్తున్నారని కార్యకర్తలు అంటున్నారు. "మేము మీకోసం పని చేసినప్పుడు లేని బిజీ.. ఇప్పుడు మా గెలుపు కోసం పని చేయాల్సి వచ్చేసరికి ఎందుకు? అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. నాయకుడు అందు బాటులో లేకపోవడంతో క్షేత్రస్థాయిలో కేడర్ నైతిక స్థైర్యాన్ని కోల్పోతోందని, ఇది పార్టీ విజయవకాశాలపై ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు.

పలకరింపు కరువు పార్లమెంట్ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలైన తర్వాత, కనీసం కార్యకర్తలను పలకరించి ధైర్యం చెప్పిన దాఖలాలు లేవని, ఇప్పుడు కార్పొరేషన్ ఎన్నికల ప్రచారానికి కూడా రాకపోవడం ఆయన బాధ్యతారా హిత్యానికి నిదర్శనమని విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం తన రాజకీయ ప్రయోజనాల కోసం కార్యకర్తలను వాడుకుని, తర్వాత వారిని గాలికి వదిలేసే 'సీజనల్ పాలిటిక్స్' వంశీచంద్ రెడ్డి మానుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# పరిమళ ప్రచారానికి ప్రజల నీరాజనం

- అడుగడుగునా ఆప్యాయతతో పలకరింపు
- 23వ వార్డు ప్రజల ఆశీస్సులు నిండుగా




**తాండూరు ఫిబ్రవరి 4(జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 23వ వార్డు వాల్మీకి నగర్‌లో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పరిమళ రవీందర్ ప్రచారానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుంది. అడుగడుగునా ఆప్యాయతతో పలకరిస్తూ ముందుకు సాగుతున్నారు. బుధవారం కౌన్సిలర్ అభ్యర్థి పరిమళ రవీందర్ స్థానిక వార్డు మహిళలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రతి ఒక్కరిని పలకరిస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమైందని గుర్తు చేశారు. వార్డు ప్రజలు తనను ఆశీర్వదిస్తే అభివృద్ధిని మరింత మెరుగుపరుస్తానని తెలిపారు. వార్డు సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. అవకాశం ఇస్తే వార్డు అభివృద్ధిని అంచలంచెలుగా తీర్చిదిద్దామన్నారు. మోసపూరితమైన మాటలు నమ్మవద్దని వార్డు ప్రజలకు సూచించారు.



# నితిన్ నబీన్‌కు ఘన స్వాగతం

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి4(జనంసాక్షి) :** భాజపా జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ సిన్హా, తొలిసారిగా తెలంగాణ రాష్ట్రానికి రావడంతో బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదన్ బీజేపీ కార్యాలయం నుంచి నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి పెద్దఎత్తున బిజెపి నాయకుల స్థానికులతో కలిసి శంషాబాద్ ఎయిర్పోర్ట్‌లో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు.

# తెలంగాణ వారసత్వ పరిరక్షణకు అభివృద్ధి చేసుకుందాం



**మొయినాబాద్ జనవరి 4 జనంసాక్షి :** తెలంగాణ రాష్ట్ర వారసత్వ సంరక్షణను బలోపేత్యం చేసే దిశగా అభివృద్ధి చేసుకుందామని ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆర్ట్ కల్చరల్ హెరిటేజ్ రంగారెడ్డి జిల్లా చాప్టర్ డిపార్ట్మెంట్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ మధ్య అవగాహన ఒప్పందం చేసుకున్నారు ఈ సందర్భంగా ప్రొఫెసర్ అర్జున్ రావు కటాడి డైరెక్టర్ డిపార్ట్మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ ప్రభుత్వం ప్రొఫెసర్ ఏ ఆర్ జె గాయత్రి కన్వీనర్ ఇంటెక్ రంగారెడ్డి జిల్లా చాప్టర్ ద్వారా ఒప్పంద శాంతకం చేసి పరస్పరం పత్రాలను మార్చుకున్నారు ఈ సందర్భంగా వారసత్వ స్థలాల సంరక్షణ డాక్యుమెంటేషన్ పరిశోధన మ్యూజియం అభివృద్ధి ప్రజా అవగాహన కార్యక్రమాలు సంయుక్తంగా చేపట్టాలని పేర్కొన్నారు డాక్టర్ పి నాగరాజు ప్రశాంత్యాలకులు మ్యూజియం డిపార్ట్మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ మల్లు నాయక్ సహాయ సంచాలకులు డిపార్ట్మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ ప్రొఫెసర్ ఏఆర్ జి సునీల్ కుమార్ సహ కన్వీనర్ ఇంటెక్ రంగారెడ్డి జిల్లా చాప్టర్ జగ్గరాజు బి సభ్యులు ఇంటెక్ రంగారెడ్డి జిల్లా ఈ సందర్భంగా ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు ద్వారా ఇంటెక్ వంటి వారసత్వ సంస్థల మధ్య భాగస్వామ్యం ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని చరిత్రక సాంస్కృతిక సంపదను శాస్త్రీయంగా సంరక్షించవచ్చునని సూచించారు ప్రొఫెసర్ ఆర్కిటెక్ట్ గాయత్రి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో వారసత్వ సంరక్షణకు సమన్వయ పూర్వకమైన కార్యాచరణ సాధ్యమవుతుందని తెలిపారు విద్యార్థులు నిపుణులు ప్రజల భాగస్వామ్యంతో అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని సూచించారు అనంతరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే ఆమనగల్ మున్సిపాలిటీ అభివృద్ధి





- రాష్ట్ర క్రీడా,పశుసంవర్తక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్ ఫిబ్రవరి 04(జనంసాక్షి):** ఆమనగల్ పట్టణ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే,కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర క్రీడా, పశుసంవర్తక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఆమనగల్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని 8,వ వార్డులో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. గత పాలకులు ఆమనగల్ పట్టణంలో ఎలాంటి అభివృద్ధి చెయ్యలేదన్నారు. పట్టణంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు,పట్టణ సుందరీకరణ, మౌలిక వసతుల కల్పన వేగంగా ప్రజలకు అందాలంటే ఆమనగల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రతి ఓటరుకు తెలుపాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు ఉందని స్పష్టం చేశారు. ఆమనగల్ మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆమనగల్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ పిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, జగన్, గుర్రం కేశవులు,గుజ్జుల మహేష్, ఆనంద్, ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు మానయ్య, మల్లయ్య,కృష్ణా నాయక్, మహేష్, విజయ, శ్రీను,కృష్ణ యాదవ్, తదితరులు ఉన్నారు.

# ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


- వేరుశెనగ పంట సాగు పరిశీలన
- రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిని ఉష



**తలకొండపల్లి ఫిబ్రవరి 04(జనంసాక్షి):** ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే వినియోగదారులకు ఎరువులు, విత్తనాలను విక్రయించాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిని ఉష అన్నారు. మంగళవారం తలకొండపల్లి మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం,ఆక ఫార్మర్ సర్వీస్ సెంటర్,గట్టు ఇప్పలపల్లి లోని సూర్య అగ్రి షాపు,పడకల్ శివ ట్రేడర్స్,దుకాణాలను మండల వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తినితో కలిసి తనిఖీ చేశారు. విత్తనాలు,ఎరువులు,రైతులకు విక్రయిస్తున్న తీరును రిజిస్టర్ నిర్వహణ పరిశీలించారు. అనంతరం జంగారెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వం ఉచితంగా అందించిన వేరుశెనగ(లేపాక్షి సీడ్)పంటను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిఏఓ ఉష మాట్లాడుతూ..రైతులకు ఎరువులు,నాణ్యమైన విత్తనాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. మోసపూరితంగా విత్తనాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో రైతులు వేసిన పంటలకు సరిపడా యూరియా నిలువ ఉందని,ప్రతి రైతు ఫర్టిలైజర్ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని కావలసిన యూరియాను యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని రైతులను కోరారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు అందించే పథకాలు వర్తిస్తాయని తెలిపారు. రైతులకు కావలసిన ఎరువులు,విత్తనాలను ప్రభుత్వ ప్రామాణాలను పాటించి ఈ పాస్ మిషన్ ద్వారానే రైతులకు విక్రయించాలని తెలిపారు. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి సందేహాలు వచ్చిన మండల వ్యవసాయ అధికారిని,ఏఈఓ లను సంప్రదించి తగిన సూచనలను, సలహాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తిని, జంగారెడ్డి పల్లి సర్పంచ్ మల్లేష్,వ్యవసాయ విస్తరణ అధికారులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పైన పటారం... లోన లోటారం

- బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు
- కారు పార్టీలో నేతల బేజారు




కుమార్


**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికలవేళ వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపాలిటీలో అధికార ప్రతిపక్షాల మధ్య పోటీకన్న బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత కలహాలపై చర్చ నేడు తాండూర్ లో హాట్ టాపిక్ గా మారింది. ఎక్కడ ఏ నలుగురు రాజకీయ చర్చ చేసిన బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత కలహాలపైనే చర్చ జరుగుతోంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలో వలస నాయకుల ఈగో ఫీలింగ్ ఎక్కడ ఆ పార్టీ కొంపముంచుతుందో తెలియని పరిస్థితుల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తల పట్టుకుంటున్నారు. ముఖ్యంగా 2018 ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి వెంబడి ఉన్న నాయకులు దాదాపుగా ఆయనకు దూరంగా వెళ్లిపోయారు. కొంతమంది మాత్రం ఆయననే అంటిపెట్టుకొని పార్టీలో ఉంటున్నారు. అయితే కష్టకాలంలో తన వెంబడి ఉన్న నాయకులను ఇలాంటి అవకాశాలు రోహిత్ రెడ్డి ఇవ్వడంలేదని వారు బహిరంగంగా విమర్శిస్తున్నారు. రోహిత్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవనివ్వకుండా పూర్తిస్థాయిలో పనిచేసిన నాయకులు ఆయన ఎమ్మెల్యే అయిన తర్వాత మెల్లిమెల్లిగా ఒక్కరు ఒక్కరు ఆయన పంచన చేరారని అలాంటి వారికి ఈరోజు రోహిత్ రెడ్డి న్యాయం చేస్తున్నారని రోహిత్ రెడ్డి తోపాటు మొదటి నుండి ఉన్న కార్యకర్తలు వాపోతున్నారు. ఇదిలా ఉండగా బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మహేందర్ రెడ్డికి ప్రధాన అనుచరులుగా ఉన్న నాయకులు ఆయన ఓడిపోగానే అవకాశాన్ని బట్టి రోహిత్ రెడ్డి క్యాంపులో చేరిపోయారు. అయితే అన్ని వదులుకొని రోహిత్ రెడ్డి వెంబడి వచ్చిన తమకు పూర్తిస్థాయిలో గౌరవం దొరకడం లేదని తప్పనిసరి పరిస్థితుల్లో బిఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్నామని కొద్దిమంది నాయకులు తమ బాధను సన్నిహితులతో చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలవేళ అభ్యర్థుల కేటాయింపులో పాత కొత్త నాయకుల వద్ద విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. అయితే కేవలం పార్టీలో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బహిరంగంగా ఎలాంటి ప్రకటనలు చేయనప్పటికీ అందరి మనసులో ఈ విషయం బాగా నాటుకుపోయింది. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందన్న ఊహాగానాలు ఊపు అందుకున్న వేళ ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీ చైర్మన్‌అభ్యర్థిగా ప్రచారం జరుగుతున్న పట్లోళ్ల నర్సింలు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారని పుకార్ల షికారులు తాండూర్ ను చుట్టుముట్టాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ సంపత్ కుమార్, పట్లోళ్ల నర్సింలు విషయంలో ఎమ్మెల్యేతో తరచుగా మాట్లాడి కాంగ్రెస్ పార్టీలో నర్సింలును చేర్పించేం దుకు పూర్తి ఏర్పాటు చేసినట్టు ప్రచారం జరిగింది. అయితే పార్టీలో చేర్చుకునేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని అయితే మున్సిపల్ చైర్మన్ స్థానం కేటాయించే విషయమై తాను ఎలాంటి హామీ ఇవ్వవనని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తేల్చి చెప్పినట్టు సమాచారం. తన ప్రతిపాదనకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ససేమిరా అనడంతో డాక్టర్ సంపత్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరకుండానే మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి తో చేతులు కలిపారు. అసలే ఈగోలతో పార్టీలో ఇబ్బందులు పడుతున్నామని నాయకులు బహిరంగంగా చెబుతున్న నేపథ్యంలో డాక్టర్ సంపత్ కుమార్ నిర్ణయాలు వ్యవహారం మరో తలనొప్పికి రాజ్యం పోసిందని పార్టీ నాయకులు భావిస్తున్నారు.

### ఆశావాహుల జాబితా తయారు

ఒకవైపు అధికార కాంగ్రెస్ లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సీనియర్ నాయకులతొ చర్చించి సొంతంగా అభ్యర్థులను నిర్ణయిస్తుండగా బిఆర్ఎస్ పార్టీలో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, రోహిత్ రెడ్డి తండ్రి విటల్ రెడ్డి, తల్లి ప్రమోదిని రెడ్డి, బాబాయ్ శ్రీశైలం రెడ్డి వంటి కుటుంబ సభ్యులు, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నర్సింలు పార్టీ సీనియర్ నాయకులు రాజు గౌడ్, నరేందర్ గౌడ్ ఎవరికి వారు కౌన్సిలర్ అభ్యర్థుల జాబితాని తయారు చేసుకున్నారు. గతవారం రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీని వీడిన డాక్టర్ సంపత్ కూడా బిఆర్ఎస్ లో వివిధ వార్డుల్లో పోటీ చేయగలిగిన ఆశావాహుల జాబితా తయారు చేసుకున్నారని సమాచారం. అటు కుటుంబ సభ్యులు ఇటు పార్టీ సీనియర్ నాయకులు ఇచ్చిన అభ్యర్థుల లిస్టును ఫైనల్ చేసేందుకు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి తల ప్రాణం తోకకు వచ్చినట్టు తెలుస్తుంది. పార్టీ అంతర్గత వ్యవహారాలు పార్టీ నాయకుల మధ్య సమన్వయ లోపం ఖచ్చితంగా పార్టీ విజయవకాశాలను దెబ్బతీస్తుందని భావించిన రోహిత్ రెడ్డి అందరిని సముదాయించే ఒక ఫైనల్ లిస్టును తయారుచేసి వారికి బీఫాంలు అందించడం జరిగింది. చాలామంది ఆశావాహులు తీవ్ర నిరుత్సాహం చెందిన సందర్భంలో వారిని ప్రతిపాదించిన నాయకులకు వ్యవహారం అస్సలు రుచించడం లేదని తెలిసింది. ఇలాంటి సందర్భంలో తమ ప్రతిపాదించిన అభ్యర్థులను కాదని తమ పార్టీకి చెందిన ఇతర నాయకులు ప్రతిపాదించిన వారికి టికెట్లు ఇవ్వడం చాలామంది నాయకులకు రుచించడం లేదు. తాము ప్రతిపాదించి న అభ్యర్థులను కాదని ఎదుటి వ్యక్తి ప్రతిపాదించిన వ్యక్తిని పార్టీ అభ్యర్థిగా ప్రకటించడానికి జీర్ణించుకోలేని నాయకులు తమ సొంత పార్టీ నాయకులను ఓడగొట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్‌లో ఈ పరిస్థితిని చూస్తే బిఆర్ఎస్ పార్టీని పుట్టి ముంచడానికి ఎవరు అవసరం లేదని ఆ పార్టీ నాయకులే గుసగుసలాడుతున్నారు. ఏది ఏమైనా ఎన్నికలవేళ బిఆర్ఎస్ పార్టీ అంతర్గత వ్యవహారం ఆ పార్టీ నాయకులు తీరు కచ్చితంగా బిఆర్ఎస్ పార్టీ కొంప ముంచడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు మా అభ్యర్థుల ప్రచార బ్రహ్మాస్త్రాలు

## ప్రజా ఆశీర్వాదం కాంగ్రెస్ పార్టీ వైపు : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు ఫిబ్రవరి 4(జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా వార్డ్ నెంబర్ -35 లో కాంగ్రెస్ పార్టీ వార్డ్ కార్యాలయంను ప్రారంభించి వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అఫ్షామానియ నూర్ అహ్మద్, వార్డు నెంబర్ -2 ప్రత్యుష మెహన్ చేతి గుర్తు పై వార్డ్ ప్రజలందరూ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూర్ పట్టణ ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీని అశీర్వదించేందుకు సిద్దంగా ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మా అభ్యర్థుల ప్రచార బ్రహ్మాస్త్రాలు. రెండెళ్ళ కాలంలో తాండూర్ పట్టణంలో దాదాపు 100 కోట్ల అభివృద్ధి పనులు చేశాం. శివాజీ చౌక్ నుండి మల్ రెడ్డి పల్లి వరకు 2 కోట్లతో నూతన రోడ్డు నిర్మించడం జరిగింది. మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 లో భాగంగా దాదా 27 కోట్ల రూపాయలతో త్రాగునీటి వాటర్ ట్యాంకులు నిర్మించడం జరుగుతుంది. గతంలో వర్గపోరంతో తాండూర్ మున్సిపల్ కౌన్సిల్ కూడ సరిగ్గా నిర్వహించలేదు. గత పాలకులు నిర్లక్ష్యంతో మున్సిపల్ సమస్యలను పట్టించుకోలేదు. తాండూర్ ప్రజలందరూ అధికార పార్టీకీ ఓటు వేసి అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వండి. అనంతరం వార్డ్ నెంబర్ -35 నుండి పలువురు కాంగ్రెస్ పార్టీ లో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారసింగ్, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ రవీగౌడ్, మాజీ కౌన్సిలర్స్ సర్థార్ ఖాన్, ఇక్బాల్, ప్రభాకర్ గౌడ్, భీంశంకర్, నాయకులు పాల్గొన్నారు.

### అసాధ్యం కానిది.... సుసాధ్యం చేసి చూపిస్తాం

మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్టీఆర్ కాలనీ రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో ఆర్బీఓఎల్ సీఈఓ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బుయ్యని శ్రీనివాస్ రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలపరచిన కౌన్సిల్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వార్డు నెం. 8లో రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ ఇళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసినవే అని గుర్తు చేశారు. ఎన్టీఆర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాము,.మీరు అధికార కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రశాంత వాతావరణం కొరకు పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోకి ఈ సమాచారం తీసుకోస్తాం మన్నారు. ఎన్టీఆర్ కాలనీ అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే యువత చేడు వ్యసనాలకు దూరంగా, భాధ్యతయుతంగా ఉండాలని, ఈ కాలనీలో యువత ఉద్యోగ సాధనకై సిల్క్ డెవలప్ మేంట్ ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా డ్రైవర్లకు కోసం ఎంఓయు కుదుర్చుకున్న మహిళా భద్రతా విభాగం



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) : రాష్ట్రంలో మహిళల ఆర్థిక సాధికారతను పెంపొందించడంతో పాటు రవాణా రంగంలో వారి భాగస్వామ్యాన్ని పెంచే దిశగా తెలంగాణ పోలీస్ మహిళా భద్రతా విభాగం మరో ముందడుగు వేసింది. మహిళల నేతృత్వంలో పర్యావరణహిత రవాణా ఉపాధి మార్గాలను ప్రోత్సహించేందుకు ప్రముఖ వాహన డీలర్‌షిప్ సంస్థ 'వీవీసీ మోటార్స్'తో బుధవారం అవగాహన ఒప్పందం (ఎం ఓ యు) కుదుర్చుకుంది. మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ అధికారిక భాగస్వామి అయిన వీవీసీ మోటార్స్ సహకారంతో నగరంలో 'మహిళా ఆధారిత ఎలక్ట్రిక్ మొబిలిటీ' పైలట్ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ మేరకు మహిళా భద్రతా విభాగం అదనపు డిజిపి చారుసిన్హా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇరు విభాగాల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ వినూత్న పథకం ద్వారా హైదరాబాద్ పరిధిలోని నాలుగు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో సుమారు 500 మంది మహిళలను ఎంపిక చేసి, వారిని ఎలక్ట్రిక్ ఆటో డ్రైవర్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏడాది పాటు సాగే ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా మహిళలకు స్వయం ఉపాధి లభించడమే కాకుండా, బహిరంగ ప్రదేశాల్లో వారి ఉనికి పెరగడం వల్ల ప్రయాణికులకు మరింత సురక్షితమైన రవాణా వాతావరణం ఏర్పడుతుందని అడిషనల్ డిజిపి చారుసిన్హా వెల్లడించారు. ఈ ఒప్పందంలో భాగంగా మహిళా భద్రతా విభాగం క్షేత్రస్థాయిలో మహిళా డ్రైవర్ల సమీకరణ, సంస్థాగత సమన్వయ బాధ్యతలను పర్యవేక్షిస్తుండగా, ఎంపికైన మహిళలకు వీవీసీ మోటార్స్ సంస్థ వాహనాల లభ్యతను కల్పిస్తుంది. మహిళా సాధికారత, సుస్థిర రవాణా వ్యవస్థల పట్ల తమకున్న నిబద్ధతకు ఈ భాగస్వామ్యం నిదర్శనమని, ఇది నగర రవాణా ముఖచిత్రాన్ని మార్చడమే కాకుండా మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతుందని భరోసా సొసైటీ మెంబర్ సెక్రటరీ, మహిళా భద్రతా విభాగం అదనపు డిజిపి చారు సిన్హా ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## వ్యవసాయ సంక్షోభాన్ని నివారించి
# రైతులను లాభాల బాటలో నడపాలి

- ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత
- రెండేళ్లలో రైతుల సంక్షేమంపై దృష్టి పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో మునిగి పోయిందని, తద్వారా రైతులు అప్పుల ఊబిలో కూరుకుని పోయారని, ఇదే విషయాన్ని నిన్న పార్లమెంటు వేదికగా సిచువేషన్ అసెస్మెంట్ సర్వే 2018 – 19 ను కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్నాథ్ ఠాగూర్ వెల్లడించారని, ఇది ఆందోళన కలిగించే అంశమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. సర్వే నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఒక్కొక్క రైతు కుటుంబంపై తలసరి అప్పు ఒక లక్ష 52 వేల113 ఉందని, నెల వారి రైతు కుటుంబం ఆదాయం జాతీయ సగటు రూ. 10,218 కన్నా తెలంగాణ రైతు కుటుంబం తలసరి ఆదాయం రూ 9,403 మాత్రమే ఉందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకొని ఆదాయం పొందేందుకు కూరగాయల సాగు, డైరీ ఫామ్, కోళ్లు, గొర్రెల పెంపకం, ఆయిల్ ఫాం, సెరికల్చర్, పప్పు దినుసులు వంటి ప్రత్యామ్నాయ పంటల మార్గాలను అనుసరించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ప్రోత్సహించాలని, ఈ మేరకు ప్రణాళిక బద్ధంగా కార్యాచరణను రూపొందించి అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 91% మంది రైతులు అప్పుల ఊబిలో ఉండడం ఆందోళన కలిగించే విషయమని చిన్నారెడ్డి అన్నారు. రాష్ట్రంలో 95% మంది సన్నా చిన్న కారు మధ్యతర రైతులు ఉన్నారని, సరైన ఆదాయం లేక పంటలు గిట్టుబాటుగాక, పండక అప్పుల పాలై రైతులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని చిన్నారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు కేవలం వ్యవసాయంపైనే ఆధారపడకుండా ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ వ్యవసాయ అనుబంధంగా ఉండే పంటలపై దృష్టిని సారించాలని, దీంతో స్థిరాదాయం ఉంటుందని అన్నారు. వ్యాల్యూ ఎడిషన్ విధానం మంచిదని ఉదాహరణకు వరిని బియ్యం గా మార్చి మార్కెట్లో అమ్మడం ద్వారా అధిక లాభం పొందవచ్చని అన్నారు. పక్కాగా నీటి లభ్యత ఉంటే వ్యవసాయం గిట్టుబాటుగా ఉంటుందని, అదే వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తే జూదం ఆడినట్లుగా ఉంటుందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. అందుకు కృష్ణా, గోదావరి నది జలాలను ప్రతి ఎకరాకు అందిస్తే పంటలు పుష్కలంగా పండి రైతులు లాభ పడతారని, నదీ జలాలను రైతులు అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రెండేళ్లుగా వ్యవసాయ రంగానికి, రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి అనేక చర్యలు చేపట్టారని చిన్నారెడ్డి తెలిపారు. రైతుల తలసరి అప్పు రూ. ఒక లక్ష 53 వేల 113 ఉందని తెలుసుకున్న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రైతులకు రూ. రెండు లక్షలు రుణ మాఫీ చేశారని చిన్నారెడ్డి అన్నారు. వ్యవసాయానికి నీళ్లు, నాణ్యమైన విత్తనాలు, సేంద్రియ ఎరువులు ముఖ్యమని కానీ ఇటీవల ఎక్కువగా యూరియా వాడకం, క్రిమిసంహారక మందులు వాడకం జరుగుతోందని, ఇది మనిషికి, వాతావరణానికి ప్రమాదకరమని చిన్నారెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలని ప్రతి ఏటా భూసార పరీక్షలు జరిపించుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ప్రాంతాలవారీగా అవసరమైన విత్తనాలను సిద్ధంగా ఉంచాలని, ఆగ్రోస్ సంస్థ ద్వారా వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు సన్నకారు రైతులకు అద్దెకిచ్చేలా చూసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలు రైతు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటాయని, తద్వారా రైతులు అప్పుల భారీ నుంచి బయటపడే అవకాశం ఉంటుందని చిన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## సంజయ్ ఇకనైనా బుద్ధిగా ఉండు

- కాంగ్రెస్ రాజకీయాలను వదులుకో
- ఎమ్మెల్యేకు జీవన్ రెడ్డి చురకలు



జగిత్యాల, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) : స్పీకర్ తీర్పుతో అయినా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఇక కాంగ్రెస్ జోలికి రాకుంటే మంచిదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు. బుధవారం నాడు జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై శాసనసభ స్పీకర్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నా. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నా అని సంజయ్ చెప్పడాన్ని స్వాగతిస్తున్నా. సంజయ్ నీకు దొంగ బుద్ధి ఎందుకు?. స్పీకర్ తీర్పుతో పద్ధతిగా ఉండు. నా కాంగ్రెస్ పార్టీలో చిచ్చుపెట్టకు. నీ బీఆర్ఎస్ పార్టీలో నువ్వు కరెక్ట్‌గా ఉండు. నా పార్టీ అంతర్గత విషయాల్లో ఎందుకు వేలు పెడుతున్నావు?. అభివృద్ధి అంటే పక్కింట్లోకి కన్ను వేయడమా?. గడిచిన రెండు ఏళ్లలో సీఎం రేవంత్‌తో ఉండి నువ్వు చేసిన అభివృద్ధి ఏంటీ చెప్పు.. సంజయ్?' అని మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశ్నించారు. మరోవైపు ఏడాదిన్నర కాలంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనూ ఘాటుగా విమర్శించారు. తాజాగా మున్సిపల్ ఎన్నికల వేళ టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్టు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించినట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## జగిత్యాల ఎమ్మెల్యేకు క్లీన్‌చిట్ గొడ్డలిపెట్టు

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్ (జనంసాక్షి) : పార్టీ ఫిరాయింపుల కేసులో జగిత్యాల ఎమ్మెల్యేకు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే గాంధీ భవన్‌కు వెళ్లి కాంగ్రెస్ పార్టీ మీటింగ్ లో పాల్గొన్నారంటేనే పార్టీ ఫిరాయించినట్టు కదా! ఇంతకు మించిన ఆధారాలు ఇంకేముంటాయి స్పీకర్? అని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాలలో మీరు క్లీన్‌చిట్ ఇచ్చిన ఎమ్మెల్యేనే కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్‌లు ఇవ్వడం ఎంత వివాదాస్పదమైందో లోకమంతా చూసిందని తెలిపారు. అయినా ఆ విషయం మీ దృష్టికి రాలేదా? అని స్పీకర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ చైర్‌లో ఉండి కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు అనుకోవాలా? అదే నిజమైతే మీరు భారత రాజ్యాంగాన్ని, చట్ట సభల ఔన్నత్యాన్ని ఎలా కాపాడగలుగుతారు..? అని ప్రశ్నించారు.

### నేటి నుంచి తెలంగాణ జాగృతి అధ్యయన కమిటీల సమావేశాలు

తెలంగాణ సమగ్రాభివృద్ధి, సబ్బండ వర్గాల వికాసం, సామాజిక తెలంగాణ సాధన కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత 50 అధ్యయన కమిటీలను ఏర్పాటు శారు. ఈ కమిటీలు తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా బ్లూ ప్రింట్ రూపొందిస్తున్నాయి. ఇప్పటికే నివేదిక సమర్పించిన పలు కమిటీలు.. త్వరలోనే నివేదికలు ఇవ్వనున్న మిగతా కమిటీలు.. ఒక్కో కమిటీలో ముగ్గురు నుంచి నలుగురు సభ్యులను కవిత నియమించారు. ఆయా రంగాల నిపుణులు, ప్రముఖులు, క్షేత్ర స్థాయి పరిశీలన ద్వారా నివేదికల రూపకల్పన చేస్తున్నారు. ఆయా కమిటీల నివేదికల ఆధారంగా రాష్ట్ర అభివృద్ధితో పాటు వివిధ వర్గాల ప్రజల సాధికారత కోసం రూట్ మ్యాప్ రూపొందించే ప్రయత్నాల్లో కవిత అన్నారు.

## మోహన్‌బాబు వర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య

తిరుపతి, ఫిబ్రవరి4 (జనంసాక్షి) : సినీనటుడు మోహన్ బాబు యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి బాలాజీ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు నేతలు రుయా ఆసుపత్రికి వెళ్లి విద్యార్థి యువ నాయకులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మురళి మాట్లాడుతూ గత కొంతకాలంగా విద్యార్థులు, తల్లిదండ్రుల పట్ల యూనివర్సిటీ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో. ఓ విద్యార్థి మరణం పలు అనుమానాలను కలిగిస్తోందని అన్నారు. పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపి నిజా నిజాలు వెల్లడి చేయాలని కోరారు.


## ఏపీలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయండి

### సిఎం చంద్రబాబును కోరిన కూతురు వెన్నెల

అమరావతి, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) : ప్రముఖ విప్లవ గాయకుడు, కవి గద్దర్ కుమార్తె వెన్నెల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఆమె సీఎంకు వినతిపత్రం సమర్పిస్తూ, ఏపీలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే ఆంధ్రా యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ కల్చరల్ విభాగానికి గద్దర్ పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వెన్నెల, తెలుగు సాంస్కృతిక రంగానికి, ప్రజా ఉద్యమాలకు గద్దర్ చేసిన విశేష సేవలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె విజ్ఞప్తులపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు. తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ, గద్దర్ సేవలను గౌరవించేలా సానుకూల నిర్ణయం వెలువడుతుందన్న నమ్మకం తమకు ఉందని చెప్పారు.

## ఫోన్ బ్లాక్ చేయడంపై ఆగ్రహం

- ప్రియుడిని కిరాతకంగా చంపిన ప్రియురాలు



రాయపూర్, ఫిబ్రవరి4 (జనంసాక్షి) : ప్రియుడు తన ఫోన్ నెంబర్ బ్లాక్ చేశాడన్న కోపంతో ఓ యువతి దారుణానికి ఒడిగట్టింది. ప్రియుడిని అతి కిరాతకంగా కత్తితో పొడిచి చంపేసింది. ఈ సంఘటన ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బిలాస్‌పూర్‌కు చెందిన 25 ఏళ్ల కమ్తా ప్రసాద్ సూర్య వంశీ హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితులతో కలిసి హోటల్‌కు దగ్గరలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం అతడికి ఇన్‌స్టాగ్రామ్‌లో 22 ఏళ్ల రోషిణి సూర్యవంశీతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. కలిసి తిరిగే వారు.. ఫోన్‌లో గంటలు, గంటలు మాట్లాడుకునే వారు. అయితే, గత మూడు రోజుల నుంచి ప్రసాద్ వింతగా ప్రవర్తించటం మొదలెట్టాడు. రోషిణి ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేశాడు. దీంతో రోషిణి తీవ్ర ఆగ్రహానికి గురైంది. అతడు వేరే అమ్మాయితో తిరుగుతున్నాడేమోనన్న అనుమానం వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం కత్తి తీసుకుని ప్రసాద్ ఉండే ఇంటి దగ్గరకు వెళ్లింది. ప్రసాద్ తలుపు తెరవగానే అతడి మొబైల్ ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేసింది. అతడు ఇందుకు ఒప్పుకోలేదు. ఇద్దరి మధ్యా గొడవ మొదలైంది. కట్టలు తెంచుకున్న కోపంతో రోషిణి ప్రసాద్‌పై కత్తితో దాడి చేసింది. నేరుగా అతడి గుండెపై పొడిచింది. ప్రసాద్ గట్టిగా అరవటంతో లోపల ఉన్న ఫ్రెండ్ బయటకు వచ్చాడు. ప్రసాద్ నేలపై రక్తపు మడుగులో పడిపోయి ఉన్నాడు. ఆ ఫ్రెండ్ వెంటనే ప్రసాద్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రసాద్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితురాలు రోషిణిని అరెస్ట్ చేశారు. పోలీస్ అధికారి మాట్లాడుతూ.. 'ఆ యువతి మృతుడి ఇంటికి వచ్చింది. అతడి ఫోన్ ఇవ్వమని డిమాండ్ చేసింది. గొడవ సందర్భంగా కత్తితో అతడి గుండెపై పొడిచింది. అతడు అక్కడికక్కడే చనిపోయాడు' అని తెలిపారు. కాగా, బీజేపీ నాయకుడు, జిల్లా పంచాయత్ ప్రెసిడెంట్ రాజేష్ సూర్యవంశీకి ప్రసాద్ మేనల్లుడని తెలుస్తోంది.

## క్యాన్సర్‌పై అవగాహనే ముఖ్యం

- ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి
- అవగాహన కోసం షార్ట్ ఫిలిమ్స్ తీస్తా
- క్యాన్సర్ దినోత్సవంలో చిరంజీవి



హైదరాబాద్, ఫిబ్రవరి4 (జనంసాక్షి) : క్యాన్సర్‌పై అందరిలోనూ అవగాహన రావాలని అగ్రనటుడు మెగాస్టార్ చిరంజీవి అన్నారు. శరీరంలో వచ్చే మార్పులు గమనించాలని.. నిర్లక్ష్యం చేయకూడదని చిరంజీవి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అందరూ జీవనశైలిలో మార్పులు చేసుకుని ఆరోగ్యకరమైన వాటిని తినాలని చిరంజీవి అన్నారు. భవిష్యత్తులో క్యాన్సర్‌పై అవగాహన కోసం తాను షార్ట్‌ఫిల్మ్‌లు తీయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు చిరంజీవి చెప్పారు. అది తన బాధ్యత అని అన్నారు. అందరూ జాగ్రత్తగా ఉంటూ ఈ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. గతంలో నా స్నేహితుడు ఒకరు క్యాన్సర్ బారిన పడితే వెంటనే గమనించి వైద్యం తీసుకున్నాడు. దాన్ని నివారించగలిగాం. ఇప్పుడు పదేళ్ల నుంచి హాయిగా ఉంటున్నాడు. శరీరం చెప్పే మాట అందరూ వినాలి. నాకు క్యాన్సర్ రాదులే అని నిర్లక్ష్యం చేయకూడదు. మన అలవాట్లు, వాతావరణం, వంశ పారంపర్యంగా కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మొదటి దశలోనే దాన్ని గుర్తిస్తే 90 శాతం తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. అమ్మాయిలకు చిన్న వయసులోనే వ్యాక్సిన్‌లు వేయిస్తే కొన్నిరకాల క్యాన్సర్ల బారిన పడకుండా కాపాడొచ్చు. మహిళలు కూడా జాగ్రత్తగా ఉండాలి. వ్యాక్సిన్‌లు తీసుకోవాలి.

## ఏసీబీ వలలో ప్రభుత్వోద్యోగి

### 10వేలు తీసుకుంటుండగా పట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (జనంసాక్షి) : ఏసీబీ వలలో మరో ప్రభుత్వ ఉద్యోగి చిక్కారు. నగరంలోని బండ్లగూడ డిప్యూటీ విద్యాశాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న శివప్రసాద్ బుధవారం ఓ స్కూల్ యాజమాన్యం నుంచి రూ. 10 వేలు తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. పదవతరగతి పరీక్ష కేంద్రం నుంచి తమ పాఠశాలను తొలగించవద్దని బాధితుడు కోరగా అందుకు శాఖాధికారులు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. జూనియర్ అసిస్టెంట్‌ను నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వివరించారు.

## ముగ్గురు మంత్రులకు ప్రతిష్టాత్మకం ఖమ్మం

- ప్రచారంలో ముందున్న మంత్రి పొంగులేటి
- విభేదాలు రాకుండా జగ్రత్త పడ్డ అమాత్యులు



ఖమ్మం, ఫిబ్రవరి4 (జనంసాక్షి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ముగ్గురు మంత్రులకు ప్రతిష్టాత్మకంగా మారాయి, డిప్యూటి సిఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మలలు తమ ప్రాంతాల్లో పట్టుకోసం యత్నిస్తున్నారు. మంత్రి పొంగులేటి ప్రచారం ముందున్నారు. మున్సిపల్ ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ ముగియడంతో పోటీలో ఉండే అభ్యర్థుల లెక్క తేలింది. చివరి రోజు ఆయా పార్టీలు తమ క్యాండేట్లకు బీ ఫామ్స్ అందజేయగా, టికెట్ ఆశించి భంగపడిన పలువురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మిగిలిన వారు రెబల్స్ గా మారి బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలకు ఆయా పార్టీల గుర్తులు ఇవ్వగా, ఇండిపెండెంట్లకు ఆఫీసర్లు గుర్తులు కేటాయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇక రాఝకీయాలు వేడెక్కాయి. మంత్రి పొంగులేటి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచార ఉధృతి పెంచారు. ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఒక్క చోట మాత్రమే వార్డు కౌన్సిలర్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఏదులాపురం 15వ వార్డులో సీపీఎం, బీజేపీ అభ్యర్థులు తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకోవడంతో కాంగ్రెస్ అభ్యర్థి తమ్మినేని మంగతాయి ఒక్కరే పోటీలో నిలిచారు. దీంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవం అయింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావు పేట మున్సిపాలిటీల్లో విత్ డ్రాల అనంతరం 106 డివిజన్లు, వార్డులకు 540 మంది బరిలో నిలిచారు. జిల్లాలోని మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 117 వార్డులకు 922 నామినేషన్లు దాఖలయ్యాయి. స్క్రూట్నీ తర్వాత 787 నామినేషన్లు చెల్లుబాటు అవుతాయని గుర్తించారు. మధిరలో 22 వార్డులకు 165 దాఖలు కాగా, గడువు ముగిసేసరికి 95 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 70 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 19 , బీఆర్ఎస్ తరపున17 , సీపీఎం 3, సీపీఐ 1, జనసేన 5, బీజేపీ 19, స్వతంత్ర అభ్యర్థులు ఆరుగురు పోటీలో ఉన్నారు. కల్లూరు మున్సిపాలిటీలో 20 వార్డులకు మొత్తం 130 మంది నామినేషన్ దాఖలు చేశారు. 58 మంది ఉపసంహరణ చేసుకోగా, 72 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో బీఆర్ఎస్ నుంచి 20 మంది, కాంగ్రెస్ నుంచి 20, బీజేపీ 16, బీఎస్పీ 3, ఇండిపెండెంట్లు 13 మంది పోటీ చేస్తున్నారు. ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డుల్లో 202 నామినేషన్లు వచ్చాయి. వాటిలో 15వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం కాగా, మిగిలిన 31 వార్డుల్లో 108 మంది పోటీలో నిలిచారు. కాంగ్రెస్ తరపున 30 మంది, బీఆర్ఎస్? 23, సీపీఎం 7, బీజేపీ 24, సీపీఐ 11 వార్డుల్లో పోటీలో అభ్యర్థులను నిలిపాయి. 13 మంది ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్నారు. సత్తుపల్లిలో 23 వార్డుల్లో స్క్రూట్నీ తర్వాత 124 మంది పోటీలో నిలిచారు. వీరిలో 83 మంది బరిలో ఉండగా, 41 మంది విత్ డ్రా చేసుకున్నారు. కాంగ్రెస్ నుంచి 23, బీఆర్ఎస్ 22, బీజేపీ 22, జనసేన 4, సీపీఐ 2, సీపీఎం నుంచి ఒక్కరు, ఇండిపెండెంట్లు 9 మంది పోటీలో నిలిచారు. వైరా మున్సిపాలిటీలో 20 వార్డుల్లో మొత్తం 155 మంది నామినేషన్లు వేశారు. వీటిలో 75 మంది విత్ డ్రా చేసుకోగా, 80 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఇక్కడ కాంగ్రెస్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్గాలు వేర్వేరుగా నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు భట్టి వర్గంలో 12 మందికి బీ ఫామ్స్ దక్కగా, మంత్రి పొంగులేటి వర్గంలో ఐదుగురికి, ఎంపీ రేణుకాచౌదరి వర్గంలో ఒకరికి బీఫామ్ ఇచ్చారు. ఒక వార్డులో సీపీఐ అభ్యర్థికి, మరొక వార్డులో సీపీఎం అభ్యర్థికి మద్దతిస్తూ కాంగ్రెస్ తరపున నామినేషన్లు వేయలేదు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావు పేట మున్సిపాలిటీల్లో విత్ డ్రాల అనంతరం 540 మంది బరిలో నిలిచారు. వీరికి ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు 354 మంది పోటీలో ఉన్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీలో 22 వార్డులకు 78 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370